Pubilshed from Kadapa

PRGI NO : APTEL/25/A1220

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



కడప KADAPA | సంపుటి : 03 | సంచిక : 51 | ఆదివారం | నవంబర్ 22, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 03 | Issue No : 51 | Sunday | 22 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



"భారత్‌ను చూసి
నేర్చుకోండి..ఫెడ్‌కు ట్రంప్ క్లాస్ !"

- భారత్ 7 శాతం వృద్ధి సాధిస్తుంటే.. అమెరికా ఎందుకు వెనుకబడాలి ?
- వడ్డీ రేట్లు తగ్గించాలంటూ ఫెడ్ పై ట్రంప్ ఒత్తిడి..
- జీడీపీ వృద్ధి 20 శాతానికి చేరుతుందంటూ వ్యాఖ్యలు

అమెరికా : ప్రపంచ ఆర్థిక అగ్రరాజ్యమైన అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింత వేగంగా పరుగులు పెట్టించాలన్న లక్ష్యంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వడ్డీ రేట్ల అంశాన్ని తెరపైకి తెచ్చారు. అమెరికా కేంద్ర బ్యాంకు అయిన ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఇందుకు భారత్ ఆర్థిక వృద్ధిని ఉదాహరణగా చూపిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

- మిగతా 2లో..

కూటమిగా నిలిచాం.. ఐక్యంగా గెలిచాం

సామాన్య కార్యకర్తలను జెడ్పీ పీఠాలపై కూర్చోబెట్టాం

- వైసీపీ కుట్రలను తిప్పికొట్టిన ఓటర్లకు హ్యాట్సాఫ్
- జనాభా దామాషా పద్ధతిన అన్ని వర్గాలకు రాజ్యాధికారం
- స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియా సమావేశం



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు ఎప్పుడూ అండగా ఉంటారని స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు మరోసారి నిరూపించాయని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రజలు పట్టం కట్టారని, 2024 సార్వత్రిక ఎన్నికల కంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి మరింత ఆదరణ లభించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా ప్రజలు కూటమి అభ్యర్థులను అక్కున చేర్చుకున్నారని, ఈ విజయం రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన ప్రతిఫలంగా భావిస్తున్నామని చెప్పారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు మరింత బాధ్యతతో పనిచేస్తామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా, పోస్టల్ బ్యాలెట్ అయినా ప్రజల తీర్పు కూటమికి అనుకూలంగానే ఉందన్నారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో కూటమి 96.42 శాతం స్ట్రయిక్ రేట్ సాధించిందని, ఎంపీపీల్లో 93.15 శాతం స్థానాలను గెలుచుకుందని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ 94 శాతం స్ట్రయిక్ రేట్ నమోదు చేసినట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో వైసీపీకి 39.81 శాతం ఓట్లు రాగా, ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో అది 33.56 శాతానికి పడిపోయిందని, ఆ పార్టీకి 6.25 శాతం ఓట్లు తగ్గాయని వివరించారు. రాష్ట్రంలో కూటమి మరింత బలపడిందని,

- మిగతా 2లో..



కొత్త అవకాశాలను
అందిపుచ్చుకోండి

- ప్రధాని మోడి

పశ్చిమ బెంగాల్ : పరిమిత ఆలోచనా విధానాల అడ్డంకులను ఛేదించి, కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడి యువతకు పిలుపునిచ్చారు. శనివారం పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మేదినీపూర్ జిల్లా, ఖరగ్‌పూర్‌లోని ఐఐటి ఖరగ్‌పూర్ క్యాంపస్‌లో జరుగుతున్న ఐఐటి ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకలకు ప్రధాని విచ్చేశారు. కలైకుండ వైమానిక స్థావరంలో దిగి, రోడ్డు మార్గంలో ఐఐటి క్యాంపస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా.. వైద్య సదుపాయాల లభ్యతను మెరుగుపరచడానికి ఈ సంస్థ అభివృద్ధి చేసిన అందుబాటు ధరల డీప్ మెడ్-టెక్ ఆవిష్కరణలు, లాస్ట్ మైల్ హెల్త్‌కేర్ పరిష్కారాలను ప్రధాని పరిశీలించారు. '75 వాయిసెస్ ఫర్ వికసిత్ భారత్' చొరవ కింద 75 మంది విద్యార్థులతో ప్రధాని మాట్లాడారు. ఐఐటి ఖరగ్‌పూర్ 75 ఏళ్ల వార్షికోత్సవానికి గుర్తుగా ఒక స్మారక నాణేన్ని ఆవిష్కరించారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రధానమంత్రి మోడి ప్రసంగిస్తూ ... పరిమిత ఆలోచనా

- మిగతా 2లో..

పులి కదలికలపై నిరంతర
నిఘా..
ప్రజల భద్రతకు భరోసా



థర్మల్ డ్రోన్లు, ఏఐ ఆధారిత కెమెరా ట్రాప్‌లతో నిఘా

- హనుమాన్ బృందాలతో విస్తృత పర్యవేక్షణ చేపట్టండి
- ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి
- అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేక రెస్క్యూ బృందాలను రప్పించండి
- రెవెన్యూ, పోలీస్, పశుసంవర్ధక శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లాలి
- పులికి ఎలాంటి హాని కలగకుండా సురక్షితంగా పట్టుకునేలా చర్యలు
- ఏ.కొండూరు అటవీ ప్రాంతంలో పులి సంచారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమీక్ష

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : ఏ.కొండూరు పరిసరాల్లోని అటవీ ప్రాంతాల్లో తిరుగుతూ, ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్న పులిని సురక్షితంగా పట్టుకునేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ఉప ముఖ్యమంత్రి అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పులి కదలికలపై నిరంతరం నిఘా పెడుతూ, ప్రజల భద్రత భరోసా ఇవ్వాలని పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి పులిని సురక్షితంగా పట్టుకునేందుకు అధునాతన సాంకేతికతతోపాటు ఇతర రాష్ట్రాల నిపుణుల సహకారం తీసుకోవాలని అటవీశాఖ ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ స్థాయి పర్యవేక్షణలో ఆపరేషన్ నిర్వహించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

2 పేజీలో..

కొత్త ఎయిర్‌లైన్స్‌కు
భోగాపురం కేంద్రస్థానం
కావాలి
రామ్మోహన్ నాయుడు

- కుప్పం, పలాస ఎయిర్‌పోర్టులకు భూసేకరణ జరుగుతోందన్న రామ్మోహన్ నాయుడు
- భోగాపురంపై కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని వెల్లడి
- సీఐఐ సమ్మిట్‌తో ఏపీ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేశామన్న కేంద్ర మంత్రి



- మిగతా 2లో..

కుమార్తె పెళ్లికి షర్మిళ ఆహ్వానిస్తే రోత రాతలా?

పెట్టుబడులు వస్తుంటే కడుపుమంట

- గతంలో పరిశ్రమలు తరిమేసి ఇప్పుడు విష ప్రచారం
- తప్పుడు ప్రచారాలతో రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నంలి
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి ఆగ్రహం

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : వ్యక్తిగత సంబంధాలు, కుటుంబ బంధాల విషయంలోనూ రాజకీయ మహుందా తనం పాటించాలని ముఖ్యమంత్రి హితవు పలికారు. క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు వైసీపీ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుక పడ్డారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన కుమార్తె వివాహానికి ఆహ్వాన పత్రిక అందించేందుకు వస్తే, దానిపై గొడ్డలి పార్టీ సొంత పత్రికలో రోత రాతలు రాయడం ఏమిటని ప్రశ్నించారు.



ఆహ్వాన పత్రిక ఇవ్వడం ఒక మర్యాద పూర్వకమైన సంప్రదాయమని, దాన్ని కూడా రాజకీయ కోణంలో చూసి వ్యక్తిగతంగా అవమానించేలా నీచపు వార్తలు రాయడం అత్యంత బాధ్యతారాహిత్యమని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత చెల్లెలు పెళ్లికి ఒక ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తే, దానిపైనా ఇంత నీచంగా కథనాలు రాస్తారా? కుటుంబ బంధాలను కూడా రాజకీయాలకు వాడుకుంటారా? అని నిలదీశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, తాను మంచి స్నేహితులుగా ఉన్నామని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

2 పేజీలో..



కర్నూలు జిల్లా ఓర్వకల్లులో
ఉత్పత్తి ప్రారంభించిన
రిలయన్స్ ప్లాంట్

- ఏపీపై నమ్మకంతో ఇంతటి భారీ పరిశ్రమ ఏర్పాటు చేసిన రిలయన్స్ యాజమాన్యానికి ధన్యవాదాలు: లోకేశ్
- కేవలం 12 నెలల్లోనే సిద్ధమైన ఆసియాలోనే అతిపెద్ద బెవరేజ్ యూనిట్
- స్థానిక యువతకు లభించనున్న 1,200 ప్రత్యక్ష ఉద్యోగాలు
- కూటమి ప్రభుత్వ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ఓర్వకల్లే ప్రత్యక్ష నిదర్శనమన్న లోకేశ్

2 పేజీలో..

అమరావతి క్వాంటం వ్యాలీలో
సరికొత్త అధ్యాయం

- రాష్ట్రానికి 'నీలిట్' డీమ్డ్ టు బి యూనివర్సిటీ
- ప్రపంచలోనే తొలి క్వాంటం, ఏఐ వర్సిటీ ప్రత్యేక క్యాంపస్- ఆచార్య నాగార్జునలో తాత్కాలిక తరగతులు ప్రారంభం
- త్వరలో రూ.730 కోట్లతో రాజధానిలో శాశ్వత క్యాంపస్

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా మరో కీలక ముందడుగు పడింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (MeitY) ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (NIELIT) డీమ్డ్ టు బి యూనివర్సిటీ, అమరావతి తాత్కాలిక క్యాంపస్‌ను శనివారం గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ANU) క్యాంపస్‌లోని సీడీఈ భవనంలో ప్రారంభమైంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆర్థిక సలహాదారు డాక్టర్ ఎ. ప్రతిభ ఈ క్యాంపస్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నీలిట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి పాల్గొన్నారు.



2 పేజీలో..



బోల్తాపడిన కారు

- ఇద్దరు మృతి

చీరాల (బాపట్ల) : కారంచేడు చీరాల జాతీయ రహదారిలోని కుంకలమర్రు ఫ్లైఓవర్ వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఇద్దరు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చీరాల వైద్యశాలకు తరలించారు.

ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పెళ్లూరు సమీపంలో జాతీయ రహదారిపై ఈరోజు ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. తిరుపతి నుండి బాపట్లకు వస్తున్న ఇన్నా 40 నాన 5055 నంబరు గల మారుతి సుజుకి ఎర్టిగా కారులో ఆరుగురు ప్రయాణిస్తుండగా, ఫేస్ కాలేజ్ దాటిన అనంతరం డ్రైవర్ ప్రవీణ్ నిద్రమత్తులో ఉండడంతో రోడ్డు పక్కన ఉన్న కల్వర్టు గోడను బలంగా ఢీకొట్టాడు. దీంతో కారు పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న బాపట్లకు చెందిన డ్రైవర్ ప్రవీణ్, వెంకట్రావు, సుజాత, సీతా మహాలక్ష్మి మరణించారు. కొత్తగా వివాహమైన జంట శ్రీతేజ, కైవల్య లకు స్వల్ప గాయాలు కావడంతో వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈనెల 18వ తేదీన బాపట్ల కమ్మ కళ్యాణ మండపంలో వివాహం జరిగింది. తిరుపతి కి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం

- మిగతా 2లో..

ప్రజాభూమి
ఆదివారం, నవంబర్ 22, 2026

పులి కదలికలపై నిరంతర నిఘా.. ప్రజల భద్రతకు భరోసా

ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్న నేపథ్యంలో అటవీ శాఖ ఉన్నతాధికారులతో ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించారు. పులి కదలికలు, దాని సంచార ప్రాంతాలు, ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, పులి సంచార మార్గాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ సమాచారాన్ని పరిసర గ్రామాల ప్రజలకు చేరవేయాలి. స్థానిక అటవీ శాఖ బృందాలతో సమన్వయం చేసుకుంటూ హనుమాన్ బృందాలతో విస్తృతంగా గస్తీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పులి కదలికలను మరింత సమర్థవంతంగా గుర్తించేందుకు థర్మల్ డ్రోన్లు, ఏఐ ఆధారిత కెమెరా ట్రాప్‌లు, ఇతర ఆధునిక సాంకేతిక పరికరాలను విస్తృతంగా వినియోగించాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌ను పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ (జఫౌ), ఇతర అటవీ శాఖ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో చేపట్టే చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని స్పష్టం చేశారు.
పులి సంచరిస్తున్న ప్రాంతానికి సమీపంలోని గ్రామాల్లో ప్రజల భద్రతకు తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులు, పశువుల కాపరులు, స్థానిక ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకుండా అవసరమైన సూచనలు చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖల అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ, చేపట్టిన చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు కలగకుండా అన్ని చర్యలను, అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఉత్పత్తి ప్రారంభించిన రిలయన్స్ ప్లాంట్

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సంస్థ ఆసియాలోనే అతిపెద్ద పానీయాల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి రికార్డు సృష్టించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో సరిగ్గా ఏడాది క్రితం ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగ్గా, కేవలం 12 నెలల వ్యవధిలోనే పనులు పూర్తి చేసుకుని ఉత్పత్తిని ప్రారంభించడం విశేషం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ఈ ప్లాంట్‌లో కాంపా కోలాతో పాటు పండ్ల రసాలు, ప్యాకేజ్డ్ తాగునీటి తయారీ మొదలైంది. ప్రభుత్వం నినదిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ఓర్వకల్లు ప్లాంట్ ఒక ప్రత్యక్ష నిదర్శనమని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌పై పూర్తి నమ్మకంతో రాష్ట్రంలో ఇంతటి భారీ పరిశ్రమను ఏర్పాటు చేసిన రిలయన్స్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, వేగవంతమైన నిర్ణయాలపై విశ్వాసం ఉంచి పెట్టుబడులు పెట్టినందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.తరతరాల భారతీయుల జ్ఞాపకాలతో ముడిపడి ఉన్న స్వదేశీ బ్రాండ్ కాంపా కోలా, ఇప్పుడు రాయలసీమ గడ్డపై సరికొత్త రూపంలో పునర్జన్మ పొందిందని లోకేశ్ వివరించారు. అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో పోటీపడే సత్తా ఉన్న స్వదేశీ బ్రాండ్లకు ఆంధ్రప్రదేశ్ వేదిక కావడం రాష్ట్రానికే గర్వకారణమని చెప్పారు. ఓర్వకల్లులో తయారయ్యే ఉత్పత్తులు దేశంలోని ప్రతి ఇంటికీ చేరడంతో పాటు ప్రపంచ మార్కెట్లలోనూ సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాయని ఆయన అన్నారు.అన్నింటికంటే ముఖ్యంగా ఈ ప్లాంట్ ద్వారా స్థానిక యువతకు సొంత గడ్డపైనే ఉపాధి లభించడం అత్యంత సంతృప్తిని ఇస్తోందని లోకేశ్ పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం యువత కుటుంబాలను, ఊళ్లను వదిలి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. ఉద్యోగాలే యువతను వెతుక్కుంటూ రావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాయలసీమ ప్రజలకు ఇచ్చిన ఆ మాటను నిలబెట్టుకుంటున్నామని తెలిపారు.ఈ భారీ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు 1,200 ప్రత్యక్ష ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయని, అదే సమయంలో రవాణా, వ్యవసాయం, ఇతర అనుబంధ రంగాల్లో పెద్దఎత్తున పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. నంద్యాలకు చెందిన మహేశ్ హరి, కర్నూలుకు చెందిన ఆర్.కె. స్ఫూర్తి వంటి స్థానిక యువతీ యువకులు సొంత ప్రాంతంలోనే ఇలాంటి ప్రపంచ స్థాయి సంస్థలో పనిచేస్తుండటం శుభపరిణామమని లోకేశ్ ప్రస్తావించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి భవిష్యత్తులో ఇలాంటి విజయగాథలు మరిన్ని రావాలని, అందరం కలిసి ఆ దిశగా అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

బోల్తాపడిన కారు

జరిగింది. పెళ్ళికొడుకు శ్రీ తేజ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పెళ్లకూతురు కైవల్య తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొత్త అవకాశాలను అందిపుచ్చుకోండి

విధానాల అడ్డంకులను ఛేదించి, కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. సంకుచిత భావజాలం కేవలం కలలను, ప్రతిభను మాత్రమే కాకుండా దేశ సామర్థ్యాలను కూడా పరిమితం చేస్తుందని చెప్పారు. ఇటీవలి ప్రపంచ బ్యాంకు నివేదికను ప్రస్తావిస్తూ .. గత 12 నుంచి 13 ఏళ్లలో భారతదేశంలో సుమారు 50 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని ప్రధానమంత్రి అన్నారు. పరిమితులను అధిగమించి, ఒకప్పుడు అసాధ్యంగా భావించిన వాటిని సాధించగలమనే దృక్పథం ఫలితమే ఇది అని చెప్పారు. ఒకప్పుడు స్వేచ్ఛ, స్వయం పరిపాలన ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిన ఐఐటి ఖరగ్‌పూర్ చారిత్రాత్మక గడ్డ, నేడు ఆత్మనిర్భరత దిశగా భారతదేశ సంకల్పానికి సాక్ష్యంగా నిలుస్తోందని అన్నారు. దశాబ్దాలుగా దేశ నిర్మాణానికి ఐఐటి ఖరగ్‌పూర్ చేసిన కృషిని ప్రశంసించారు. భారతదేశ ఆవిష్కరణల స్వరూపాన్ని తీర్చిదిద్దడంలో ఈ సంస్థ పోషిస్తున్న కీలక పాత్రను అభినందించారు. జాతీయ ప్రగతిని సాధించడానికి మనమే విధించుకున్న పరిమితులను అధిగమించాలని యువతకు పిలుపునిచ్చారు. 'దేశమే ప్రథమం' అనే దృక్పథంతో ముందుకు సాగాలని విద్యార్థులను కోరారు. ఈ విధానం వారికి కొత్త అవకాశాలను సృష్టిస్తుందని, అలాగే దేశానికి కూడా ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని మోడి ప్రసంగించారు.

కొత్త ఎయిర్‌లైన్స్‌కు భోగాపురం కేంద్రస్థానం కావాలి

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: కొత్తగా వచ్చే విమానయాన సంస్థలకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాన స్థావరంగా (బేస్) మారాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. దేశవ్యాప్తంగా విమానయాన రంగాన్ని విస్తరించే క్రమంలో మరిన్ని కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రం వద్ద పరిశీలనలో ఉన్నాయని ఆయన వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్‌లో ఎయిర్‌పోర్టుల నెట్‌వర్క్ విస్తరణపై మాట్లాడిన కేంద్రమంత్రి... కుప్పం, పలాస ప్రాంతాల్లో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఆయా ప్రాంతాల ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సుల గురించి ప్రస్తావిస్తూ... వైజాగ్‌కు సీఐఐ సమ్మిట్‌లు కొత్తేమీ కాదని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఇప్పుడే కాకుండా, గతంలోనూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీఐఐ సమ్మిట్‌తో పాటు అనేక అంతర్జాతీయ సదస్సులను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారని గుర్తుచేశారు. ఆ సదస్సుల ద్వారానే ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించగలిగామని ఆయన పేర్కొన్నారు.ఇటీవల విశాఖలో నిర్వహించిన సీఐఐ సదస్సు దేశంలోనే ఇంతకుముందెన్నడూ జరగని రీతిలో అత్యంత ఘనంగా జరిగిందని, ఇది రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎంతగానో దోహదపడుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

కుమార్తె పెళ్లికి షర్మిళ ఆహ్వానిస్తే రోత రాతలా?

రాజకీయంగా భిన్నాభిప్రాయాలు, వైరుధ్యాలు ఉన్నప్పటికీ తమ మధ్య మానవ సంబంధాలు ఎప్పుడూ దెబ్బతినలేదని చెప్పారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత సంబంధాలకు ముడిపెట్టకూడదని, ప్రజా జీవితంలో ఉన్నవారు కనీస మర్యాద, హుందాతనం పాటించాలని అన్నారు. ఒక కుటుంబంలో జరిగే శుభకార్యానికి ఆహ్వానించడం వంటి సాధారణ మానవీయ అంశాలను కూడా వివాదాస్పదం చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు ప్రజల కోసం పనిచేయాలి తప్ప వ్యక్తిగత వివాదాలు, కక్ష సాధింపుల కోసం కాదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విలువలు, సంస్కారం, హుందాతనం ఉండాలని, ప్రజా సమస్యలపై పోరాడటం, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడటమే రాజకీయ పార్టీల బాధ్యత అని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే, దాన్ని ఓర్చుకోలేక గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారానికి దిగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి సహకరించకపోగా, పెట్టుబడులు రాకుండా అడ్డంకులు సృష్టించడం, రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించడమేంటని మండిపడ్డారు. రాష్ట్రానికి ద్రోహం చేసే విధంగా గొడ్డలి పార్టీ వ్యవహరిస్తోందన్నారు. కియా మోటార్స్, దాని అనుబంధ సంస్థలు ఏపీకి వస్తుంటే మళ్లీ అడ్డుపడే ప్రయత్నాలు చేస్తున్నారని... తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం, పరిశ్రమలు విస్తరించడం, యువతకు ఉద్యోగాలు లభించడం వారికి ఇబ్బందిగా మారిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం పెట్టుబడిదారుల్లో విశ్వాసం కల్పిస్తూ ముందుకు వెళ్తుంటే, మరోవైపు గొడ్డలి పార్టీ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతోందని అన్నారు. విధ్వంసమే గొడ్డలి పార్టీ చరిత్రగా మారిందని విమర్శించారు. ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం... రాష్ట్ర ప్రయోజనాలకే విఘాతం కలిగించేలా వ్యవహరించడం సరికాదని ముఖ్యమంత్రి హితవు పలికారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావడం, పెట్టుబడులు పెరగడం అందరికీ ప్రయోజనకరమని, రాజకీయాలకు అతీతంగా వాటిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు.

పొరుగు రాష్ట్రాలతో అభివృద్ధిలోనే పోటీ

కియా మోటార్స్ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి, తన కార్యకలాపాలను విస్తరిస్తున్న నేపథ్యంలో దాని అనుబంధ సంస్థలు కూడా ఏపీకి వస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. దీనిపై కొందరు కావాలనే అపోహలు సృష్టిస్తున్నారని, తమిళనాడులోని కొన్ని రాజకీయ పార్టీలు కూడా ఈ అంశంపై అనవసరంగా వివాదం సృష్టించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కియా సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో ఉందని, హోండా సంస్థ తమిళనాడులో ఉందని గుర్తు చేశారు. రాష్ట్రాల మధ్య పరిశ్రమల విషయంలో పోటీ ఉన్నా, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వాల బాధ్యత కావాలని ముఖ్యమంత్రి అన్నారు. పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను గత ప్రభుత్వంలో మాదిరిగా పెండింగ్‌లో పెట్టకుండా, ఇప్పుడు ఎస్క్రో ఖాతా విధానం ద్వారా పారదర్శకంగా అందిస్తున్నామని వివరించారు. పారిశ్రామికవేత్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం ద్వారా పెట్టుబడులకు భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. గత పాలనలో పారిశ్రామిక రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశారని చంద్రబాబు విమర్శించారు. జాకీ వంటి సంస్థలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయని, అమర్ రాజా బ్యాటరీస్ సంస్థను కూడా రాష్ట్రం నుంచి తరిమేసే పరిస్థితులు కల్పించారని అన్నారు. పెట్టుబడిదారుల్లో భయాందోళనలు సృష్టించి పరిశ్రమలు వెళ్లిపోయేలా చేసిన గత పాలకులు, ఇప్పుడు కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి వస్తుంటే వాటిపైనా తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. గతంలో విధ్వంసంతో పరిశ్రమలను తరిమేసిన వారు, ఇప్పుడు పెట్టుబడుల రాకను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర యువత భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలు, ఆర్థికాభివృద్ధి కంటే రాజకీయ ప్రయోజనాలే వారికి ముఖ్యమయ్యాయని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలని, విధ్వంసకర రాజకీయాలను పక్కనపెట్టి ప్రజాహితం కోసం పనిచేయాలని చంద్రబాబు హితవు పలికారు. ఇలా వ్యవహరించని వారిని రాజకీయంగా దూరం పెట్టాల్సిన బాధ్యత ప్రజలదేనన్నారు.

అమరావతి క్వాంటం వ్యాలీలో సరికొత్త అధ్యాయం

ఇది ప్రపంచంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తొలి విశ్వవిద్యాలయ క్యాంపస్‌గా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మద్దతుతో అమరావతిలో నీలిట్ ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తోంది. అమరావతి క్వాంటం వ్యాలీలో నైపుణ్యాభివృద్ధికి ఈ విశ్వవిద్యాలయం కేంద్రంగా నిలవడంతో పాటు, అత్యాధునిక సాంకేతిక రంగాలకు అవసరమైన నిపుణులను తయారు చేయనుంది. శాశ్వత క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యే వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఇది కార్యకలాపాలు నిర్వహిస్తుంది. తద్వారా కొత్త భవనాల నిర్మాణం కోసం వేచి చూడకుండా రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, శిక్షణ వెంటనే అందుబాటులోకి వచ్చింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో క్యాంపస్

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి కలిగిన శాస్త్రీయ సంస్థ నీలిట్‌కు 'ఇన్‌స్టిట్యూషన్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ (డిస్టింక్ట్ కేటగిరీ)' హోదా లభించింది. కేంద్ర పరిధిలో ఉన్న ఏకైక విశ్వవిద్యాలయం ఇదే. పంజాబ్‌లోని రూపార్‌లో ప్రధాన క్యాంపస్ ఉండగా, దేశవ్యాప్తంగా 11 అనుబంధ క్యాంపస్‌లు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వేగవంతమైన భాగస్వామ్యంతో అమరావతి క్యాంపస్ ఏర్పాటు సాధ్యమైంది. 2026 ఫిబ్రవరి 20న న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నీలిట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఒప్పందం కుదిరిన తొమ్మిది నెలల్లోనే క్యాంపస్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. మొదటి దశలో భాగంగా తాత్కాలిక క్యాంపస్‌లో రూ.47 కోట్ల వ్యయంతో నాలుగు అత్యాధునిక ప్రయోగశాలలను నీలిట్ ఏర్పాటు చేస్తోంది. క్వాంటం కంప్యూటింగ్ ల్యాబ్, క్వాంటం కమ్యూనికేషన్ ల్యాబ్, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ ల్యాబ్, AI, కంప్యూటింగ్ ల్యాబ్ అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ ప్రయోగశాలల ద్వారా ప్రపంచంలోని ప్రముఖ టెక్నాలజీ సంస్థలు ఉపయోగిస్తున్న అత్యాధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు వినియోగించుకునే అవకాశం లభిస్తుంది. వీటి ద్వారా విద్యార్థులకు ప్రాథమిక పరిజ్ఞానంతో పాటు అధునాతన సాంకేతిక నైపుణ్యాలు, ప్రాక్టికల్ అనుభవం కల్పిస్తారు. క్వాంటం, AI, అనుబంధ సాంకేతిక రంగాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా తాత్కాలిక క్యాంపస్‌లో వివిధ కోర్సులను వచ్చే జనవరి నుంచి ప్రారంభించనున్నారు. ఆన్‌లైన్‌తో పాటు, తరగతి గదిలోనూ శిక్షణ అందిస్తారు. రెండు నుంచి మూడు నెలల వ్యవధి కలిగిన పది అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ కోర్సులను అందించనున్నారు. వీటిలో క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్, సైన్స్, ఇంజినీరింగ్‌లో ఏఐ వినియోగం, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఐఓటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్...వీటితో పాటు ప్రాచుర్యం పొందిన 'హ' లెవెల్ ప్రోగ్రామ్‌లను కూడా నిర్వహిస్తారు. అదనంగా 16 స్వల్పకాలిక కోర్సులను అందించనున్నారు. వీటిలో ఎూూ×, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్, బ్యాటరీ మేనేజ్‌మెంట్, బ్లాక్‌చైన్, సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్టింగ్ (ATMP), క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలు ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో బోధించే అధ్యాపకులకు ఈ నైపుణ్యాలను అందించేందుకు పది విభాగాల్లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తారు.

అమరావతిలో 8.5 ఎకరాల్లో శాశ్వత క్యాంపస్

దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా అమరావతిలో నీలిట్ శాశ్వత క్యాంపస్‌ను రూ.730.70 కోట్లతో ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి ఈ ఏడాది ఆగస్టులో ఆమోదం తెలిపారు. ఇందుకోసం అమరావతిలోని నిడమర్రు వద్ద 8.5 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. రాబోయే ఐదేళ్లలో ఈ క్యాంపస్ ద్వారా సుమారు 8,250 మందికి శిక్షణ అందించాలన్నది లక్ష్యం. ఇందులో సుమారు 1,650 మందికి డిగ్రీ కోర్సుల ద్వారా, మరో 6,600 మందికి నైపుణ్యాభివృద్ధి, సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా శిక్షణ కల్పిస్తారు. భూమిని రాష్ట్ర ప్రభుత్వం అందించగా, భవనాల నిర్మాణం, ప్రయోగశాలల ఏర్పాటు, నిర్వహణ ఖర్చులను నీలిట్, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ భరించనున్నాయి. క్వాంటం టెక్నాలజీ, AI, సెమీకండక్టర్లలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్, డిప్లొమా కోర్సులను అందించనున్నారు. అమరావతి క్వాంటం వ్యాలీలోని ఐబీఎం క్వాంటం కంప్యూటర్‌పై పనిచేసే అరుదైన అవకాశం కూడా ఈ విశ్వవిద్యాలయ విద్యార్థులకు లభించనుంది. శాశ్వత క్యాంపస్ సిద్ధమైన వెంటనే ప్రస్తుతం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉన్న ప్రయోగశాలలు, అధ్యాపకులు, విద్యార్థులను ఎలాంటి అంతరాయం లేకుండా కొత్త క్యాంపస్‌కు తరలిస్తారు. అమరావతితో పాటు రాయలసీమ ప్రాంతంలోనూ నీలిట్ కార్యకలాపాలను విస్తరించనున్నారు. ప్రస్తుతం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని తాత్కాలిక వసతి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న చీ×జూ× తిరుపతిని సొంత శాశ్వత క్యాంపస్‌కు తరలించనున్నారు. ఈ మేరకు మూడు ఎకరాల భూమి కేటాయింపు ప్రతిపాదనను సమర్పించగా, ఎస్వీ విశ్వవిద్యాలయం ఇప్పటికే ఎన్వోసీ జారీ చేసింది. తిరుపతి క్యాంపస్‌లో ఎలక్ట్రానిక్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, సెమీకండక్టర్ నైపుణ్యాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలోని వివిధ వర్గాల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, అధ్యాపకులు, పరిశ్రమలకు ప్రయోజనం చేకూర్చనుంది. దీంతో పెట్టుబడులకు మరింత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ ఎదగనుంది. నీలిట్ క్యాంపస్ ద్వారా శిక్షణ పొందిన నిపుణులు, పరిశోధకులు అమరావతి క్వాంటం వ్యాలీ వ్యవస్థలో భాగస్వాములు కానున్నారు. దీంతో భారతదేశంలో క్వాంటం టెక్నాలజీకి ప్రముఖ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ స్థానం మరింత బలోపేతం కానుంది. జాతీయ క్వాంటం మిషన్, ఇండియా ఏఐ మిషన్, ఇండియా సెమీకండక్టర్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. నీలిట్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపస్ ప్రారంభంతో అత్యాధునిక సాంకేతిక రంగాలకు అవసరమైన సంపూర్ణ నైపుణ్య వ్యవస్థకు పునాది పడింది. నేటి ఉద్యోగావకాశాలకే కాకుండా, భవిష్యత్తులో ఆవిర్భవించనున్న పరిశ్రమలకు కూడా రాష్ట్ర యువతను సిద్ధం చేయడంలో ఈ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించనుంది.

"భారత్‌ను చూసి నేర్చుకోండి..ఫెడ్‌కు ట్రంప్ క్లాస్ !"

భారత్ తక్కువ వడ్డీ రేట్లతోనే 7 శాతం వృద్ధి సాధిస్తుంటే, అమెరికా ఎందుకు అంతకంటే ఎక్కువ వృద్ధిని సాధించలేదని ప్రశ్నించారు. వడ్డీ రేట్లు తగ్గిస్తే అమెరికా జీడీపీ వృద్ధి 14 నుంచి 15 శాతానికి, చివరకు 20 శాతానికి కూడా చేరుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారత్ బాటలో అమెరికా నడవాలన్న ట్రంప్ ! శుక్రవారం వైట్‌హౌస్‌లో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నప్పటికీ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని గుర్తు చేశారు. అదే విధానాన్ని అమెరికా అనుసరిస్తే మరింత మెరుగైన ఆర్థిక ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ మంచి పనితీరు కనబరుస్తున్నప్పటికీ అధిక వడ్డీ రేట్లు వృద్ధికి అడ్డంకిగా మారుతున్నాయని అన్నారు. అయితే అమెరికా జీడీపీ వృద్ధి 20 శాతానికి చేరుతుందన్న ట్రంప్ వ్యాఖ్యలకు నిర్దిష్ట ఆర్థిక ఆధారాలు లేవు. ఇది ఆయన వ్యక్తం చేసిన అంచనా మాత్రమే. ఫెడ్‌పై రాజకీయ విమర్శలు వడ్డీ రేట్ల విషయంలో ఫెడరల్ రిజర్వ్ అనుసరిస్తున్న విధానం పై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతున్న సమయంలోనూ వడ్డీ రేట్లను అధికంగా కొనసాగించడం వల్ల అభివృద్ధి అవకాశాలు దెబ్బతింటున్నాయని విమర్శించారు. ఫెడ్ నిర్ణయాల్లో రాజకీయ ప్రభావం కనిపిస్తోందని ఆరోపించారు. గతంలో ఫెడరల్ రిజర్వ్ చైర్మన్‌గా పనిచేసిన అలన్ గ్రీన్‌స్పాన్ నిర్ణయాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ పరిస్థితులకు అనుగుణంగా వడ్డీ రేట్లను తగ్గించే నిర్ణయాలు తీసుకునేవారని ప్రశంసించారు. వడ్డీ రేట్లలో ఒక్క శాతం మార్పు అమెరికా ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలపై సుమారు 650 బిలియన్ డాలర్ల ప్రభావం చూపుతుందని ట్రంప్ పేర్కొన్నారు. వడ్డీ రేట్లు తగ్గితే ప్రభుత్వ రుణాలపై చెల్లించాల్సిన వడ్డీ భారం తగ్గడంతో పాటు వ్యాపారాలు, పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుందని ఆయన వాదన. సుంకాలతో పరిశ్రమలకు ఊతం.. ట్రంప్ వాదన దిగుమతి సుంకాల విధానాన్ని కూడా ట్రంప్ సమర్థించుకున్నారు.

కూటమిగా నిలిచాం...ఐక్యంగా గెలిచాం

వైసీపీ పట్ల ప్రజల్లో ఆదరణ తగ్గిందని ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయని అన్నారు. కూటమి సాధించిన విజయంతో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడిందని సీఎం వ్యాఖ్యానించారు.

చెప్పాం..చేశాం..చేస్తాం : కూటమి ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమం, చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సుపరిపాలనను ప్రజలు గుర్తించారని ముఖ్యమంత్రి అన్నారు. చెప్పినవి చేస్తున్నాం.. చేయాల్సినవి చేస్తామని స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన విషయంలో ఎక్కడా రాజీ పడబోమన్నారు. ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజం నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను


ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
ఆదివారం, నవంబర్ 22, 2026

నైపుణ్య శిక్షణతో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

❖ సరికొత్త ఉపాధికి బాటలు వేసేలా నిరంతర చొరవ
❖ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
❖ రైజ్ కేంద్రంలో 120 మంది మహిళలకు కంప్యూటర్ ఎంబ్రాయిడరీ వర్క్‌షాప్



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
గ్రామీణ ప్రాంత మహిళలకు ఆధునిక నైపుణ్యాలు అందించి స్వయం ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకోవడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా వివిధ శిక్షణ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో శనివారం స్వయం సహాయక సంఘాలకు చెందిన 120 మంది మహిళలకు కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ యంత్రాల వినియోగంపై నిర్వహించిన వర్క్‌షాప్‌ను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పరిశీలించారు. యూఎంఈ కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ యంత్రాల ద్వారా వస్త్రాలపై ఆకర్షణీయమైన డిజైన్లు, వివిధ రకాల ఎంబ్రాయిడరీ పనులను నాణ్యతతో, తక్కువ సమయంలో రూపొందించే విధానాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షకురాలు శ్రేయా గుప్తా మహిళలకు యంత్రాల పనితీరు, వాటి నిర్వహణ, డిజైన్ల తయారీ, ఎంబ్రాయిడరీ ప్రక్రియలో పాటించాల్సిన మెళకువలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ ద్వారా తయారు చేయగల ఉత్పత్తులు, వాటికి మార్కెట్లో ఉన్న డిమాండ్, యూనిట్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన పెట్టుబడి, యంత్రాల నిర్వహణ ఖర్చులు, ఉత్పత్తి సామర్థ్యం, ప్రభుత్వ మద్దతు, విక్రయ అవకాశాలు తదితర అంశాలను వివరించారు. కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ నైపుణ్యాన్ని వినియోగించుకొని మహిళలు ఇంటి వద్దనే ఉపాధి పొందడంతో పాటు చిన్న తరహా వ్యాపార యూనిట్లను ఏర్పాటు చేసుకునే అవకాశముందని తెలిపారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను ఆచరణలో పెట్టి నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా డిజైన్లను రూపొందించడం ద్వారా ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం ద్వారా వారిలో స్వయం ఉపాధి పట్ల ఆసక్తిని పెంపొందించి, ఆర్థిక స్వావలంబన దిశగా ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.



దుర్గగుడి ఈవో ఆకస్మిక తనిఖీలు

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ



విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో భక్తులకు అందుతున్న సేవలు, భద్రతా ఏర్పాట్లపై తనిఖీలు నిర్వహించారు. చెప్పుల స్టాండ్, స్కానింగ్ పాయింట్, ఓం టర్నింగ్, లడ్డూ కౌంటర్ వద్ద ఆకస్మికంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భద్రతా నిబంధనలను పక్కాగా అమలు చేయాలని, భక్తులకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

రహదారి ఆక్రమణల తొలగింపునకు ట్రాఫిక్ పోలీసుల చర్యలు

ట్రాఫిక్ అంతరాయాలకు చెక్.. వాహనదారులు, పాదచారులకు ఊరట



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:
మచిలీపట్నం పట్టణంలో ట్రాఫిక్ అంతరాయాలను నివారించి, వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేలా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు బందరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నున్న రాజు ఆధ్వర్యంలో శుక్రవారం చేపల మార్కెట్ ప్రాంతం, మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో రహదారుల ఆక్రమణలను తొలగించే చర్యలు చేపట్టారు.పట్టణంలోని ప్రధాన రహదారులపై కొందరు వ్యాపారులు వస్తువులను ఉంచడం, రహదారులను ఆక్రమించడం, అనధికారికంగా అడ్డంకులు ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా చేపల మార్కెట్, మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలకు ఉపక్రమించారు.ఈ క్రమంలో రహదారులకు అడ్డంగా ఉన్న ఆక్రమణలు, ఇతర అడ్డంకులను తొలగిస్తూ ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. వ్యాపారులు, చిరు వ్యాపారులు తమ వస్తువులను రహదారులపై ఉంచకుండా, వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించకుండా వ్యవహరించాలని సూచించారు. ప్రజా రహదారులను ఆక్రమించడం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలగడమే కాకుండా, ప్రమాదాలకు కూడా ఆస్కారం ఉంటుందని హెచ్చరించారు.ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, పాదచారులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా చూడటమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. రహదారులు ప్రజలందరి వినియోగం కోసం ఉన్నాయని, వాటిని వ్యక్తిగత అవసరాలకు వినియోగించి ఇతరులకు ఇబ్బందులు కలిగించరాదని స్పష్టం చేశారు.పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చేపడుతున్న చర్యలకు వ్యాపారులు, స్థానిక ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు. నిబంధనలు పాటిస్తూ రహదారులను ఆక్రమణలకు దూరంగా ఉంచినప్పుడే ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నున్న రాజు, ఎస్ఐ డొక్కు శేషగిరిరావు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక ద్వాదశి పర్వదినం సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:
శ్రీ మహిషాసుర మర్ధిని సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం (గాంధీ బొమ్మ శివాలయం)నందు శనివారం కార్తీక మాస ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 80 మంది దంపతులతో సామూహికంగా శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వారి వ్రతములు మరియు దామోదర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా శ్రీ గణపతి దత్త సాయి సేవ సంఘం వారి ఆధ్వర్యంలో వ్రతంలో పాల్గొన్న 80 మంది దంపతులకు భక్తిపూర్వకంగా కానుకలు అందజేశారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ స్థానాచార్యులు జొన్నలగడ్డ వాసు,జొన్నలగడ్డ సాయి, ఆలయ ప్రధాన అర్చకులు చేబ్రోలు సాయి రామ్ కుమార్, కందుకూరి చిట్టిబాబు, గట్టుపల్లి సాయిచరణ్ శర్మ లు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు తమ్మన రాధాకృష్ణ మూర్తి, ఎండూరి సురేష్, చేబ్రోలు నాగలక్ష్మి గాయత్రి, నంబుల వాసు, కొల్లిపర బాలాజీ దుర్గా ప్రసాద్, తమ్మన పాండురంగ నారాయణ, నంబూరి శ్రీనివాస్, దేసు సూర్యప్రకాశరావు, పువ్వాడ నాగ వెంకట సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.అనంతరం ఈ పవిత్ర కార్యక్రమాన్ని పురస్కరించుకొని మధ్యాహ్నం 12:30 గంటల నుండి కార్తీక మహా అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధనలో భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.భక్తి, ఆధ్యాత్మికత, సేవాభావం, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమాలు ఆలయంలో అత్యంత వైభవంగా జరగడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు.





పదవికి వన్నె తెచ్చేలా ప్రజాసేవ సాగించాలి

గూడూరు ఎంపీపీ బొల్లా రాజేష్‌కు లంకిశెట్టి బాలాజీ హితవు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:
ప్రజలు, పార్టీ నాయకులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, నీతి నిజాయితీలతో ప్రజాసేవ సాగించి పదవికి వన్నె తీసుకురావాలని న్యాయవాది లంకిశెట్టి బాలాజీ గూడూరు మండల పరిషత్ అధ్యక్షుడు బొల్లా రాజేష్‌కు సూచించారు.గూడూరు మండల పరిషత్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొల్లా రాజేష్‌ను శనివారం మచిలీపట్నంలోని తన కార్యాలయంలో లంకిశెట్టి బాలాజీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన స్వగ్రామమైన ఆకుమర్రుకు చెందిన బొల్లా రాజేష్ గూడూరు మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. చిన్న వయసులోనే రాజకీయాల్లోకి ప్రవేశించి, ప్రజల ఆదరణతో అత్యధిక మెజారిటీ సాధించి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టడం ఆయనపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాజేష్ తన పదవీకాలంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, నీతి నిజాయితీలకు ప్రాధాన్యత మివ్వాలని బాలాజీ ఆకాంక్షించారు. రాబోయే ఐదేళ్లలో గూడూరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఇతర మండలాలకు ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. ఆకుమర్రు గ్రామానికి మండల పరిషత్ అధ్యక్ష పదవి దక్కేలా సహకరించిన ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గోపి నాగబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పదవికి గౌరవం తెచ్చేలా పనిచేస్తా

సన్మానానికి స్పందించిన గూడూరు ఎంపీపీ బొల్లా రాజేష్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పదవికి వన్నె తెచ్చేలా శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. మండల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గోపి నాగబాబు మాట్లాడుతూ.. ఆకుమర్రు గ్రామానికి ఎంపీపీ పదవి దక్కడం గ్రామ ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. పార్టీని మరింత బలోపేతం చేస్తూ, మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఆకుమర్రు మాజీ గ్రామ రెవెన్యూ అధికారి లంకిశెట్టి సాయిబాబు మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో మెలిగిన బొల్లా రాజేష్ మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం నేటి యువతకు ఆదర్శప్రాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలి సుమన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏఎంసీ డైరెక్టర్ మనుమరాళ్లకు ఎమ్మెల్యే ఆశీస్సులు

నాగాయలంక, ప్రజాభూమి ప్రతినిధి:
దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్ కారాని సరస్వతి మనుమరాళ్ల నూతన వస్త్రాల బహూకరణ వేడుక శనివారం నాగాయలంక మండలం సొర్లగొంది గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు ఆశీస్సులు అందించారు.కారాని సరస్వతి ఆహ్వానం మేరకు విచ్చేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో పాటు జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు మండలి వెంకట్రామ్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, ఏఎంసీ డైరెక్టర్ ఉప్పల ప్రసాద్ చిన్నారులను ఆశీర్వదించి, వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో వేడుక సందడిగా సాగింది.

గొర్రెల వ్యాన్ బోల్తా.. ఒకరు మృతి

టైరు పంక్చర్ కావడంతో ప్రమాదం.. ఇనుగుదురుపేటకు చెందిన కరీముల్లా దుర్మరణం



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:
కృష్ణా జిల్లా మచిలీపట్నం సమీపంలోని పర్ణశాల వద్ద గొర్రెలను తరలిస్తున్న వ్యాన్ బోల్తా పడిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వ్యాన్ టైరు పంక్చర్ కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం.ఈ ఘటనలో మచిలీపట్నంలోని ఇనుగుదురుపేటకు చెందిన ఎండీ కరీముల్లా మృతి చెందినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టిన అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

జనసేనలోకి పెరుగుతున్న చేరికలు

సొర్లగొందిలో వైసీపీ నాయకులు జనసేనలో చేరిక
కండువాలు కప్పి స్వాగతించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్

నాగాయలంక, ప్రజాభూమి ప్రతినిధి:
గ్రామపంచాయతీ ఎన్నికల వేళ నాగాయలంక మండలంలో జనసేన పార్టీకి మద్దతు పెరుగుతోంది. మండలంలోని సొర్లగొంది గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంతో గ్రామంలో జనసేన శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.సొర్లగొంది గ్రామంలో ఏఎంసీ డైరెక్టర్ కారాని సరస్వతి, జనసేన పార్టీ నాయకుడు కారాని ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీకి చెందిన కొక్కిలిగడ్డ నాంచారయ్య, కొప్పునాతి నాగరాజు, కొప్పునాతి చిన్న మల్లేశ్వరరావు తదితరులు జనసేన పార్టీలో చేరారు.



ఈ సంద ర్భంగా ఎమ్మె ల్యే మండలి బుద్ధప్ర సాద్, జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్ నూతనంగా పార్టీ లో చేరిన వారికి జనసేన కండు వాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా ప్రజల కు సేవలందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయా లని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబుతో పాటు పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల సందడి!



రెండో రోజూ అమ్మవారి సన్నిధికి పోటెత్తిన భక్తులు!
జై భవానీ.. జై జై దుర్గా

నినాదాలతో మార్మోగిన కొండ!

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ
శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న శ్రీ భవానీ మం డల దీక్షల స్వీకరణ కార్యక్రమం రెండవ రోజు శనివారం వైభవంగా కొనసాగింది. వంద లాది మంది భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి, మహామండపం ఆరవ అంతస్తులో కొలువుదీరిన శ్రీ భవానీ అమ్మవారి సన్నిధిలో గురుభవానీల సమక్షంలో శాస్త్రోక్తంగా దీక్షా మాలధారణ గావించారు. శనివారం సెలవు దినం మరియు దీక్షల స్వీకరణ నేపథ్యంలో తెల్లవారుజాము నుండే ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ నెలకొంది. ఘాట్ రోడ్డు మరియు లిఫ్ట్ మార్గాల ద్వారా భక్తులు విశేష సంఖ్యలో కొండపైకి విచ్చేసి శ్రీ కనక దుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు.భక్తుల రద్దీ నేపథ్యంలో సౌకర్యాలను పర్యవేక్షించేందుకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ ఘాట్ రోడ్డు పరిసర ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దర్శనం టికెట్ కౌంటర్లు, ప్రసాదం టికెట్ కౌంటర్లు, చెప్పుల స్టాండ్ మరియు క్లోక్ రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా టికెట్ కౌంటర్ సిబ్బంది మరియు స్కానింగ్ పాయింట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కీలక ఆదేశాలు జారీ చేశారు. టికెట్ల జారీలో మరియు స్కానింగ్ ప్రక్రియలో అత్యంత అప్రమత్తతతో, పారదర్శకంగా విధులు నిర్వహించాలని, భక్తుల సేవలో ఎటువంటి అలక్ష్యం చూపవద్దని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని దేవస్థానం సిబ్బందిని ఈవో హెచ్చరించారు.





ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

ఆదివారం 22 నవంబర్ 2026

మేయర్ రెడ్డి అప్పలనాయుడుకు ఆర్యవైశ్య సంఘం ఘన సన్మానం

ప్రజాభూమి ఏలూరు

నగర మేయర్‌గా భారీ మెజారిటీతో విజయం సాధించిన రెడ్డి అప్పలనాయుడుకు ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అభినందన సభ నిర్వహించారు. సంఘం అధ్యక్షులు నంగులూరి సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక అగ్రహారంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మ వారి సత్రంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్ర మానికి జిల్లా టీడీపీ అధ్యక్షులు,ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ (చంటి), మేయర్ రెడ్డి అప్పలనాయుడు, కార్పొరేటర్లు తవ్వా అరుణకుమారి,చలువాది రూపకళాశ్రీ,మాజీ డిప్యూటీ మేయర్ శిరివల్లి శివరామకృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథులుగా



హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.మేయర్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ సాధారణ హమాలీ కార్మికుడిగా తన జీవితాన్ని ప్రారంభించి ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు.తన రాజకీయ ప్రస్థానంలో కార్మిక వర్గం అందించిన సహకారం మరువలేనిదని,వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.తన విజయానికి సహకరించిన ఆర్యవైశ్య సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఏలూరు నగర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు,కుల పెద్దలు,మహిళలు, జనసేన,టీడీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వట్టిగుడిపాడు సర్పంచ్ అభ్యర్థిగా ఎలికే గంగరాజు నామినేషన్

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి



వట్టిగుడిపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కూటమి బలపరిచిన ఎలికే గంగరాజు శనివారం పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయ కమిటీ సభ్యుడు బండారు శివ, టీడీపీ ఎంపీటీసీ జ్యోతి నాగమణి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పిన్నిబోయిన చింతారావు, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ చింతబట్టల చక్రధర్ రావు, జనసేన నాయకుడు దరివేజుల రాము తదితరులతో పాటు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గతంలో గంగరాజు తండ్రి జమలయ్య గ్రామ సర్పంచ్‌గా సేవలందించారు. మంత్రి కొలుసు పార్థసారథి అండదండలు ఉండటం, ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడం వంటి అంశాలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. మరోవైపు వైసీపీ తరఫున అనంతనేని రాంబాబు సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో నిలుస్తుండటంతో గ్రామంలో ఎన్నికల సందడి నెలకొంది.

కే.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

“కథా సాహిత్యంపై అతిథి ఉపన్యాసం”

ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట

స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయబాబు సూచనల మేరకు మరియు కళాశాల ఉన్నత విద్య అకడమిక్ క్యాలెండర్ ప్రకారం నేడు కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో “కథా సాహిత్య నిర్మాణ రీతులు” అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు పాఠ్యాంశ పరిజ్ఞానంతో పాటు ఆచరణాత్మక అవగాహన కల్గిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన కే.ఎల్ యూనివర్సిటీకి చెందిన డా. అద్దంకి ప్రజాపతి కథా సాహిత్యంలోని నిర్మాణ పద్ధతులు, కథలోని పాత్ర చిత్రణ వంటి అంశాలను విశదీకరించారు. అలాగే కథా రచనలో సామాజిక స్పృహ, మానవీయ విలువలు, సృజనాత్మకత ప్రాధాన్యతను



వివరించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ప్రజాప్రతి ని ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు , తెలుగు అధ్యాపకులు డాక్టర్ జి శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు కె శంకర్ నారాయణ, బి రాజు, ఎస్ సుశ్యలత, ధారావతు మల్లేష్, ఎస్ జ్యోతి, ఎం విజయకృష్ణ, పి కల్పనతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీవారి సన్నిధిలో ఏలూరు జడ్పీ చైర్మన్, దెందులూరు ఎమ్మెల్యే

- ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం
- వేదాశీర్వచనం అందజేసిన ఆలయ వేద పండితులు

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లా పరిషత్ నూతన ఛైర్‌పర్సన్‌గా శుక్రవారం ప్ర మాణ స్వీకారం చేసిన చింతమనేని సాయి నవ్య శ్రీ, దెందు లూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శనివారం ఉదయం కు టుంబ సమేతంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల (చిన్న తిరుపతి) శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించు కున్నారు. పదవీ ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా వారు స్వామివారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ తూర్పు గోపురం వద్దకు చేరుకున్న జడ్పీ ఛైర్‌పర్సన్ సాయి నవ్యశ్రీ దంపతులు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దంపతులు, వంకినేని భాను ప్రకాష్ దంపతులు మరియు కుటుంబ సభ్యులకు ఆలయ అధి కారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా ఆలయ మర్యాద లతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శన అనం తరం, ఆలయ మండపంలో అర్చకులు వారికి స్వామివారి శేషవస్త్రాలను కప్పి, వేద మంత్రోచ్చారణలతో వేద ఆశీర్వ చనం అందజేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా ప్రజలందరిపై స్వామివారి ఆశీస్సులు ఉండాలని, జిల్లా మరింత అభివృద్ధి పథంలో పయనించాలని శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు, అయ్యప్ప స్వాములు మరియు స్థానిక నాయకులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జడ్పీ ఛైర్‌పర్సన్ సాయి నవ్యశ్రీ లను కలిసి శు భాకాంక్షలు తెలిపారు.

విద్యా ప్రమాణాల పెంపునకు

ఉపాధ్యాయులకు దిశానిర్దేశం




ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఆదేశాల మేరకు శనివారం ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలల సముదాయ సమావేశాలు నిర్వహించారు. ఆగిరిపల్లి, నూజివీడు మండలాలకు చెందిన మొత్తం 85 మంది ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు మెరుగైన బోధన అందించడం, హాజరు శాతం పెంపు, సకాలంలో పాఠ్యాంశాల పూర్తి, పరీక్షల ఫలితాల విశ్లేషణ, పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక అధ్యయన వేళల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు మేకతోటి వెంకటప్పయ్య మాట్లాడుతూ 2027 మార్చి పదో తరగతి పరీక్షల లక్ష్యంగా రూపొందించిన ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం జిల్లా మధ్యాహ్న భోజన పథకం సమన్వయకర్త గౌస్ మొహిద్దీన్ పాఠశాలలో భోజన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు బి.వి.ఎస్. లక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు మాదాసి సత్యనారాయణ, కొవ్వలి ఆనంద్ కుమార్, ఉపాధ్యాయ శిక్షకులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక...ఘన సన్మానం

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా.

ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి టి. శివశంకర్ ని ఏలూరు నగర మేయర్ రెడ్డి అప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్మన్ కొరికాన భవాని, శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొరికాన రవికుమార్ దంపతులు ఏలూరు నగర మేయర్ రెడ్డి అప్పలనాయుడుని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు కొరికాన రవికుమార్, కొరికాన భవాని దంపతులను



శాలువాలతో ఘనంగా సత్కరించి, నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ట్రిపుల్ ఐటీలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోటీలు

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2026-27 కార్యక్రమంలో భాగంగా ‘మై భారత్ ఏలూరు’ విభాగం ఆధ్వర్యంలో ఆర్జీయూకేటీ నూజివీడు ఎన్ఎస్ఎస్ విభాగం వారి సంయుక్త నిర్వహణలో యూత్ పార్లమెంట్ 2026-27 పోటీలు కార్యక్రమాన్ని స్థానిక ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్ లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మై భారత్ ఏలూరు విభాగ డిప్యూటీ డైరెక్టర్ అయిన రాహుల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పోషించాలని వక్తలు, న్యాయ నిర్ణేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఏలూరు జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని ‘నషా ముక్త్ భారత్ యువ ఫర్ వికసిత్ భారత్’ అనే అంశంపై విద్యార్థులు తమ సందేశాలను అందించారు. యూత్ పార్లమెంట్ పోటీల్లో పాల్గొనే దాదాపు 80 మంది విద్యార్థుల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఈ కార్యక్రమంలో పాల్గొని మొదటి మూడు స్థానాలను సాధిం చిన విద్యార్థులకు నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య గోపాల రాజు అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చిన ఎన్ఎస్ఎస్ విభాగాన్ని, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిం చిన వివిధ కళాశాలల ఆచార్యులను పరిపాలనాధికారి డా బి. లక్ష్మణరావు తమ అభినందనలను తెలిపారు. మొదటి మూడు స్థానాలను సాధించిన విద్యార్థులకు డీన్ అకడమిక్స్ డా. ఎస్. చిరంజీవి, డా. శ్రీనాథ్ తమ చేతుల మీదుగా బహుమతులను మరియు ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావని, డాక్టర్ శరత్, డాక్టర్ సలీం తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గోపవరం టిడిపి సర్పంచ్ అభ్యర్థి నామినేషన్



ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

మండలంలోని పలు గ్రామాలలో సర్పంచుల అభ్యర్థులు, వార్డ్ నెంబర్ల అభ్యర్థులు నామినేషన్ల దాఖలు శనివారం అట్టహాసంగా సాగింది. వార్డు సభ్యుల నామినేషన్లు 47 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను అధికారులకు అందజేశారు. అవి కాక సర్పంచ్ అభ్యర్థులు ఐదుగురు కాగా,మిగతా అభ్యర్థులు వార్డు సభ్యులు 47 మంది అని ముసునూరు ఎండిఓ పి. ఏసుబాబు తెలియ జేశారు.అట్టహాసంగా గోపవరం టిడిపి సర్పంచ్ అభ్యర్థి ముసునూరు మండలం గోపవరం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి టిడిపి తరఫున ఉప్పలపాటి గణేష్ తన నామినేషన్ను అధికారులకు అందజేశారు. తెలుగు తమ్ముళ్లు పెద్ద ఎత్తున ఈ నామినేషన్ దాఖలకు భారీ ర్యాలీ నిర్వహించారు.

చిన్నారులతో భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు

- జెడ్పీ చైర్‌పర్సన్ నవ్యశ్రీ



ప్రజాభూమి ఏలూరు

బాల్యం ప్రతి ఒక్కరి జీవితంలో అమూల్యమైన వరమని, చిన్నారులను భిక్షాటన వంటి పనులకు దూరంగా ఉంచి వారి భవిష్యత్తును కాపాడాలని ఏలూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ చింతమనేని సాయి నవ్యశ్రీ పేర్కొన్నారు.ద్వారకాతిరుమల ఆలయ సమీపంలో గాంధీ వేషధారణలో భిక్షాటన చేస్తున్న ముగ్గురు చిన్నారులను,వారితో భిక్షాటన చేయిస్తున్న మహిళను గమనించిన జెడ్పీ చైర్‌పర్సన్ నవ్యశ్రీ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సంబంధిత అధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.దీంతో స్పందించిన ణజ్ఞాఖ,చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 అధికారులు చిన్నారులను గుర్తించి ఏలూరుకు తరలించారు.వారికి శుభ్రం చేసి, కౌన్సెలింగ్ నిర్వహించారు.చిన్నారులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు.పిల్లలతో భిక్షాటన చేయించడం చట్టరీత్యా నేరమని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

మూడో విడత గ్రామపంచాయతీ

ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా లో శనివారం మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పర్వం ప్రారంభమైంది. లంకల కోడేరులో సర్పంచ్ అభ్యర్థి సత్యనారాయణ రాజు ఏ ఏం సి చైర్మన్ కోడి విజయభాస్కర్ సమక్షంలో నామినేషన్ దాఖలు చేశారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్సీ కూడా పాల్గొన్నారు.ఎన్నికల ప్రక్రియను లంకలకోడేరు గ్రామంలో ఎంపీడీవో ఎన్ ఎన్ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో డిఎస్ పద్మజి రావు, పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నామినేషన్ కార్యక్రమాలు 23 వరకు ఉంటాయని, 24,25తేదీల్లో పరిశీలన 26 స్క్రూట్ ని 27న ఫైనల్ లిస్టు పెట్టడం జరుగుతుందని, డిసెంబర్ 2న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.



సర్పంచి స్థానాలకు 20, వార్డు సభ్యులుగా 51 నామినేషన్లు

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి



ఆగిరిపల్లి మండలంలో డిసెంబర్ 2న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి శనివారం సర్పంచి స్థానాలకు 20, వార్డు సభ్యుల స్థానాలకు 51 నామినేషన్లు దాఖలైనట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి అబ్దుల్ సలాం తెలిపారు. నామినేషన్ల దాఖలుకు ఆదివారం, సోమవారం రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నందున పోటీ చేయాలనుకునే అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుని, నిర్ణీత గడువులోగా సంబంధిత నామినేషన్ కేంద్రాల్లో నామినేషన్లు దాఖలు చేయాలని ఆయన సూచించారు.

చదరంగం పోటీల నందు చాంబర్స్ విద్యార్థుల ప్రతిభ

- బహుమతులు అందజేత

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో అంతర కళాశాలల పురుషుల చదరంగం పోటీలో ఛాంబర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు నాలుగవ స్థానాన్ని సాధించారు. అని కళాశాల చైర్మన్ కె.వి.ఆర్ నరసింహారావు తెలియజేశారు. ఈ బహుమతులు సాధించిన విద్యార్థులు కళాశాలలోప్రథమ, ద్వితీయ, సంవత్సరం బిఎస్సి, బిసిఎ చదువుతున్న టి. యేసు, కె. లక్ష్మీ నారాయణ, ఏ. కార్తీక్, ఆర్. తరుణ్ జి.చందు, సీహెచ్. చైతన్య ది. 19న ఈ పోటీలు భీమవరం డాక్టర్ బి.వి రాజు డిగ్రీ కళాశాలలో నిర్వహించబడినవని ఈ పోటీలు నందు ప్రావీణ్యం సాధించిన వారిని ఆదికవి నన్నయ



విశ్వవిద్యాలయ తరపున సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషులు చదరంగం పోటీలకు పంపించబడునని అన్నారు. తమ విద్యార్థులు విశ్వవిద్యాలయ స్థాయిలో నాలుగవ స్థానం సాధించుట అత్యంత సంతోషదాయకంగా ఉందని భవిష్యత్తు లో మరిన్ని బహుమతులు గెలుచుకోవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులు ఆల్రౌండ్ డెవలప్మెంట్ లక్ష్యంగా అధ్యాపక బృందం పనిచేయటం వల్ల ఒకపక్క అకాడమిక్ గాను మరొక ప్రక్క సాంస్కృతికంగా, క్రీడ అంశాలలో ముందంజలో నిలుస్తున్నారని బహుమతి గెలుచుకున్న విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బండారు అప్పారావు ని అభినందించారు. తదుపరి బహుమతి గెలుచుకున్న విద్యార్థులను కళాశాల యాజమాన్యం పుష్పగుచ్ఛం మరియు గెలుచుకున్న మెమెంటోలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కేవీ సీతారామరాజు, ట్రెజరర్ ప్రవీణ్ భాను, అధ్యాపకులు ఎన్ రవికుమార్ రాము, రాంబాబు, జానకి రామయ్య, ఉషశ్రీ, సత్యవేణి, రంజిని తదితరులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
కోనసీమ
5
ఆదివారం 22 నవంబర్ 2026

కూటమి గెలుపుతోనే పాలకొల్లు సమగ్ర అభివృద్ధి

- మంత్రి నిమ్మల విస్తృత ప్రచారం

ప్రజాభూమి ప్రతి నిధి,పాలకొల్లు

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుతోనే పాలకొల్లు పట్టణ సమగ్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగాలంటే మున్సిపాలిటీలో కూటమి పాలకవర్గం ఏర్పడటం అవసరమని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పాలకొల్లు పట్టణంలోని 33, 32,41, 10,11,12,16 వార్డుల్లో ఎస్సీ ప్రాంతాల్లో మంత్రి నిమ్మల రామానాయుడు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ రెండేళ్లలో ఆయా ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధితోపాటు టిడిపి ప్రభుత్వంలో తాను చేసిన తాను చేసిన అభివృద్ధి పనులను. వివరిస్తున్నారు. కూటమి



ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎస్సీల అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నానని చెబుతున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. పాలకొల్లులో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అనేక అభివృద్ధి పనులు జరిగాయని, గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఖర్చు చేయలేదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి చేయలేని వైసీపీ నాయకులు ఇప్పుడు చేస్తామంటూ చెబుతున్న మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. అభివృద్ధి పనుల కోసం కోట్లాది రూపాయల నిధులు తీసుకొస్తూ, ఆదివారం, సెలవు రోజులు అనే తేడా లేకుండా రాత్రింబవళ్లు కష్టపడుతున్నానని తెలిపారు. మంత్రి పదవిలో ఉన్నప్పటికీ ప్రజలకు సేవకుడిగానే పనిచేస్తున్నానని నిమ్మల అన్నారు. పనిచేసే ప్రభుత్వానికి, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే నాయకుడికి, గతంలో పనిచేయని వైసీపీ నాయకులకు మధ్య ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థి ఆబోతుల ఉషారాణితో పాటు కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను ఓటు వేసి గెలిపించాలని కోరారు. మున్సిపాలిటీలో విలీనమైన ఏడు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని, అక్కడి సమస్యలను దశలవారీగా ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైసీపీకి ఓటు వేస్తే అది సముద్రంలో వేసినట్టేనని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. పాలకొల్లు పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజలు కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి వెంట కౌన్సిలర్ అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచి స్థానాలకు 14, వార్డు సభ్యులుగా 29 నామినేషన్లు

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి



ఆగిరిపల్లి మండలంలో డిసెంబర్ 2న జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా శనివారం సర్పంచి స్థానాలకు 14 మంది, వార్డు సభ్యులుగా 29 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి అబ్దుల్ సలాం తెలిపారు. సర్పంచి స్థానాలకు అమ్మవారిగూడెం, ఈదర, నరసింగపాలెం, వడ్లమాను గ్రామాల నుంచి ఒక్కొక్కరు, గొల్లగూడెం, పోతవరప్పాడు, ఎస్.ఏ.పేట గ్రామాల నుంచి ఇద్దరేసి, వట్టిగుడిపాడు నుంచి నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు. వార్డు సభ్యులుగా అమ్మవారిగూడెం నుంచి నలుగురు, గొల్లగూడెం, నరసింగపాలెం నుంచి ఆరుగురేసి, పోతవరప్పాడు నుంచి ఐదుగురు, ఎస్.ఏ.పేట నుంచి ఎనిమిది మంది నామినేషన్లు వేశారు. ఇంకా ఆదివారం, సోమవారం రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నందున అభ్యర్థులు అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకుని సమీప నామినేషన్ కేంద్రాల్లో నామినేషన్లు దాఖలు చేయాలని అబ్దుల్ సలాం సూచించారు.

జిల్లా యువజన ఉత్సవాల్లో సత్తా చాటిన

ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు

- ఐదు విభాగాల్లో 8 బహుమతులు - రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక.

ప్రజాభూమి ప్రతినిధి పెదపాడు.

సెట్ వెల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా యువజన ఉత్సవాలు--2026 పోటీలు ఏలూరులోని సెయింట్ థెరిస్సా కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో ఏలూరు సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ మొత్తం ఐదు విభాగాల్లో 8 బహుమతులు సాధించారు. దీంతోపాటుగా విజేతలు రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న పోటీలకు ఎంపిక కావడం విశేషం.

బహుమతులు సాధించిన విద్యార్థుల వివరాలు:

జానపద నృత్యం గ్రూపు- బి. సత్య - మొదటి సంవత్సరం బి.సి.ఏ - ద్వితీయ బహుమతి, జానపద గీతం సత్య బృందం - ద్వితీయ బహుమతి, చిత్రలేఖనం- జి. దివ్యశ్రీ - రెండవ సంవత్సరం బి.సి.ఏ డేటా సైన్స్ -ప్రథమ బహుమతి, ధామని నాయక్ - రెండవ సంవత్సరం డేటా సైన్స్ - తృతీయ బహుమతి, కవిత్వం- చి. లక్ష్మీ భార్గవి -- రెండవ సంవత్సరం బి.బి.ఏ -ద్వితీయ బహుమతి,- బి. పెద్దయ్య - - మొదటి సంవత్సరం బి.బి.ఏ - తృతీయ బహుమతి, శాస్త్రీయ నృత్యం- కె. వర్షిణి -- మొదటి సంవత్సరం -



ద్వితీయ బహుమతి, ఎం. జోతిక -- రెండవ సంవత్సరం డేటా సైన్స్ -- తృతీయ బహుమతులు పొందారు. ఈ జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆదిత్య డిగ్రీ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ వంగ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. విజేతలందరినీ అభినందిస్తూ, రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబరిచి కళాశాలకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లాస్థాయిలో విజయాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు కళాశాల యాజమాన్యం శుభాకాంక్షలు తెలిపింది.



కాలువలోకి దూసుకెళ్లిన కారు

నలుగురికి గాయాలు

ప్రజాభూమి ప్రతినిధి నూజీవీడు

నూజీవీడు పట్టణంలోని తిరువూరు రోడ్డులో గల స్మశాన వాటిక సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కాలువ బ్రిడ్జి వద్ద అదుపుతప్పిన కారు నేరుగా కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాద సమయంలో కారులో నలుగురు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ప్రమాదంలో వారంతా గాయపడినట్లు తెలుస్తోంది.క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

మేయర్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని

జయప్రదం చేయండి

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా



23 న , సోమవారం ఉదయం గం! 10.35 లకు ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగే మేయర్ రెడ్డి అప్పల నాయుడి పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు, అభిమానులు కార్మికులు, కేఎస్ఎస్ టీమ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జాతీయ జూట్ కార్మిక సంఘాల అధ్యక్షులు పులి శ్రీరాములు కోరారు.కార్మిక నాయకునిగా ఉన్న అప్పలనాయుడు మేయర్ గా భారీ మెజారిటీ తో విజయం సాధించటం కార్మిక లోకానికి గర్వకారణమని పులి శ్రీరాములు పేర్కొన్నారు.రెడ్డి అప్పలనాయుడు భవిష్యత్తు లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని పులి శ్రీరాములు ఆకాంక్షించారు

కాజులూరులో 664 నామినేషన్లు సక్రమం

- సర్పంచ్ 106, వార్డు మెంబర్లకు 558 నామినేషన్లు



ప్రజాభూమి ప్రతినిధి,కాజులూరు

కాజులూరు మండల పరిధిలో 26 గ్రామపంచాయతీల పరిధిలో ఎన్నికలకు సంబంధించి మండలంలో 5 నామినేషన్లు కేంద్రాల ద్వారా దాఖలైన నామినేషన్లు స్క్రూట్ ని అనంతరం 664 నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని ఎంపీడీవో జె.రాంబాబు పేర్కొన్నారు.కాగా మొత్తం 684 నామినేషన్లుకు గాను స్క్రూటినీలో 20 నామినేషన్లు తిరస్కరణకు గురి కాగా అనంతరం సర్పంచ్ పదవికి ,వార్డు మెంబర్లకు సంబంధించి 664 మంది ఆయా చోట్ల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని ఎంపీడీవో జె.రాంబాబు పేర్కొన్నారు. అలాగే సర్పంచి పదవిగాను 122 నామినేషన్లు ఆయాచోట్ల దాఖలు కాగా వీటిలో శనివారం స్క్రూట్ని అనంతరం 106 నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని పేర్కొన్నారు.అదేవిదంగా మండల పరిధిలో 26 గ్రామపంచాయతీలకు గాను వార్డు మెంబర్లకు 562 నామినేషన్ దాఖలు కాగా 4 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా 558 నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని ఎంపీడీవో పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా ఆదివారం నుండి ఈ నెల 24వ తేదీ వరకు పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరైనా తమ తమ నామినేషన్లు ఉపసంహరించుకునే అవకాశం ఉందని ఈసందర్భంగా తెలియజేశారు.

రేపే నూతన మేయర్లు, చైర్‌పర్సన్ల ప్రమాణ స్వీకారం!

- 94స్థానాల్లో కూటమిజెండా

రీజనల్ బ్యూరో ప్రజాభూమి

ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార ఎన్డీయే కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరిగిన 100 పట్టణ స్థానిక సంస్థల్లో (13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలు) ఏకంగా 94 పీఠాలను కూటమి కైవసం చేసుకోగా, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం 4 స్థానాలకే పరిమితమైంది. గెలుపొందిన నూతన మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు సోమవారం, నవంబర్ 23న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పార్టీల వారీగా బలాబలాలు (మొత్తం 100 స్థానాలు)కార్పొరేషన్లలో 'కూటమి' హవా (12--1 తేడాతో విజయం) రాష్ట్రంలోని 13 ప్రధాన నగరాల్లో కూటమి విజయదుందుభి మోగించింది: తెలుగుదేశం పార్టీ (10 మేయర్ పీఠాలు): విశాఖపట్నం, విజయనగరం, మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, కర్నూలు కార్పొరేషన్లలో టీడీపీ అభ్యర్థులు ఘనవిజయం సాధించారు. జనసేన పార్టీ (2 మేయర్ పీఠాలు): విజయవాడ (వంగవీటి రాధాకృష్ణ), ఏలూరు (రెడ్డి అప్పల నాయుడు) కార్పొరేషన్లలో జనసేన అభ్యర్థులు మేయర్లుగా ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ (1 మేయర్ పీఠం): 13 కార్పొరేషన్లలో వైసీపీకి దక్కిన ఏకైక స్థానం అనంతపురం. ఇక్కడ వైసీపీ అభ్యర్థి బి.సి. రమేష్ గౌడ్ మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు.

2. మున్సిపాలిటీలు నగర పంచాయతీల తీర్పు

87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో నామినేషన్ల ఉపసంహరణ రోజే 17 స్థానాలు కూటమికి ఏకగ్రీవమయ్యాయి (ఇందులో టీడీపీ 15, జనసేన 1, బీజేపీ 1 చొప్పున గెలుచుకున్నాయి).

మిగిలిన 70 స్థానాలకు జరిగిన పోలింగ్‌లో సైతం కూటమి తన జోరు కొనసాగించింది: వైఎస్సార్‌సీపీ గెలిచిన 3 మున్సిపాలిటీలు: రాష్ట్రవ్యాప్తంగా పోటీ జరిగిన 70 మున్సిపాలిటీల్లో వైఎస్సార్‌సీపీ కేవలం నందికొట్కూరు, బేతంచర్ల (నంద్యాల జిల్లా), నాయుడుపేట (తిరుపతి జిల్లా) స్థానాల్లో మాత్రమే చైర్‌పర్సన్ పదవులను దక్కించుకోగలిగింది. గోదావరి & కోస్తాలో జనసేన ముద్ర: పిఠాపురం, తెనాలి, అమలాపురం, నరసాపురం, నిడదవోలు, సామర్లకోట, తుని వంటి కీలక మున్సిపాలిటీల్లో జనసేన అభ్యర్థులు చైర్‌పర్సన్లుగా విజయం సాధించారు. బీజేపీ ఖాతాలో 4 స్థానాలు: ఎలమంచిలి, గిద్దలూరు, ఎర్రగుంట్ల సహా 4 చోట్ల బీజేపీ అభ్యర్థులు చైర్‌పర్సన్ పీఠాలను కైవసం చేసుకున్నారు.

వార్డుల వారీగా చూస్తే...

మొత్తం 3,942 వార్డులకు గాను కూటమి ఏకంగా 3,234 వార్డులను (82%) గెలుచుకోగా (టీడీపీ 2,594, జనసేన 487, బీజేపీ 153), వైఎస్సార్‌సీపీ 561 వార్డులతో (14.2%) రెండో స్థానంలో నిలిచింది.

?సోమవారం ప్రమాణ స్వీకార ఏర్పాట్లు

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నవంబర్ 23, సోమవారం ఉదయం 11 గంటలకు ఆయా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల కార్యాలయాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, నూతన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. మరోవైపు పెండింగ్‌లో ఉన్న 23 పట్టణ స్థానిక సంస్థలకు ఈ నెల 26న పోలింగ్ జరగనుంది.

నామినేషన్ల వేళ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు!

- 144 సెక్షన్ అమల్లో ఉంది.. అభ్యర్థులు, రాజకీయ నాయకులు పోలీసు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి : ఎస్పై వి. సురేష్ హెచ్చరిక

ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలో డిసెంబర్ 2న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులు, వారికి తోడుగా వచ్చే రాజకీయ నాయకులు, కార్యకర్తలు పోలీసు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆగిరిపల్లి ఎస్పై వి. సురేష్ హెచ్చరించారు. శని, ఆది, సోమవారాల్లో నామినేషన్ల దాఖలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా మండలవ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, 11 నామినేషన్ కేంద్రాల వద్ద 22 మంది కానిస్టేబుళ్లను భద్రత కోసం నియమించినట్లు తెలిపారు. 144 సెక్షన్ అమల్లో ఉన్న సమయంలో నలుగురికి మించి వ్యక్తులు ఒకచోట గుమిగూడటం నిషేధమని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో ర్యాలీలు నిర్వహించాలన్నా, మైకులు వినియోగించాలన్నా ముందస్తుగా పోలీసుల అనుమతి



తప్పనిసరిగా పొందాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద అనవసరంగా గుంపులుగా చేరడం, ఇతర అభ్యర్థులకు ఇబ్బందులు కలిగించడం, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించడం వంటి చర్యలను సహించేది లేదన్నారు. ప్రతి అభ్యర్థి ఎన్నికల నియమావళిని గౌరవించాలని, ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు, బెదిరింపులకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. పోలీసు ఆదేశాలను ఉల్లంఘించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పై వి. సురేష్ స్పష్టం చేశారు.

గిరి ప్రదక్షిణతో పులకించిన శోభనగిరి

- గోవింద నామస్మరణలతో మార్మోగిన ఆలయ పరిసరాలు.. పల్లకీ సేవలో పాల్గొన్న మాలధారులు, భక్తజనం
- భక్తి పారవశ్యంలో శోభనగిరి ప్రదక్షిణ

ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

ఆగిరిపల్లి శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కార్తీక శుద్ధ ద్వాదశి పర్వదినమైన శనివారం నిర్వహించిన శ్రీవారి శోభనగిరి ప్రదక్షిణ భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. గోవింద నామస్మరణలు, లక్ష్మీనరసింహ నామజపం, విష్ణు సహస్రనామ పారాయణంతో శోభనగిరి పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి వారిని పల్లకిపై విశేషంగా అలంకరించి ఊరేగించగా అయ్యప్ప, భవానీ, గోవింద, శివమాలధారులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి వెంట గిరి ప్రదక్షిణ చేశారు. 'గోవిందా గోవిందా.. లక్ష్మీనరసింహ గోవిందా' అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో కొండ పరిసరాలు మార్మోగాయి. పలువురు మహిళా భక్తులు స్వామివారికి నీరాజనాలు సమర్పిస్తూ



భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం స్వామివారికి నిత్యపూజలు, విశేషార్చనలు, సుదర్శన మూలమంత్ర శాంతి హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మాలధారులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం శ్రీ రాజ్యలక్ష్మీ అమ్మవారికి అష్టోత్తర శత పుష్పార్చన, నిత్యహోమం, నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో దివ్యంగా అలంకరించిన స్వామివారు భక్తులకు కనువిందు చేయగా ఆలయ ప్రాంగణం భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంతో అలరారింది.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
ఆదివారం 22 నవంబరు 2026

ఆర్ఎంపీలు చట్ట పరిధిలో వైద్య సేవలు అందించాలి

-పరిధికి మించి వైద్య సేవలు చేస్తే కఠిన చర్యలు --నకిలీ వైద్యుల నిరోధక కమిటీ సభ్యులు డాక్టర్ ఏవి సుబ్బారెడ్డి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఆర్ఎంపీ వైద్యులు చట్ట పరిధిలో నిర్దేశించిన వైద్య సేవలు మాత్రమే నిర్వహించాలని, మరిదికి మించి వైద్య సేవలు చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఏపీ మెడికల్ కౌన్సిల్ నకిలీ వైద్యుల నిరోధక కమిటీ సభ్యులు డాక్టర్ ఏవి సుబ్బారెడ్డి హెచ్చరించారు. శనివారం ఏవి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ బృందం సభ్యులు హిందూపురం పట్టణంలో ఫిర్యాదులు అందిన ఆసుపత్రులు, క్లినికల్ ల్యాబ్ లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో తనిఖీల పూర్తి సమాచారాన్ని రికార్డు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ, తనిఖీల పూర్తి సమాచారాన్ని ఏపీ మెడికల్ కౌన్సిల్ లో చర్చించి సంబంధిత అధికారులకు అందించి చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ గత జూన్ నెలలో బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నకిలీ వైద్యులను నిరోధించడం కోసం చట్ట పరిధిలో ఏపీఎంసీ సెక్షన్ 20 ఎన్ఎంసి సెక్షన్ 34 లకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో మెడికల్ కౌన్సిల్ లో సుదీర్ఘంగా చర్చించి ఒక ఆచరణ సాధ్యమైన, ప్రతిష్టాత్మకమైన, నకిలీ వైద్యులను నిరోధించడానికి ఉపయోగపడే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ను తయారు చేసుకొని దాని ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా అనుమానం ఉన్నచోట్ల తనిఖీలు నిర్వహించి అక్కడ ఏదైనా నకిలీ వైద్యం జరుగుతున్నట్లుగా ఆధారాలు దొరికితే కఠిన చర్యలు తీసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ నూతన కమిటీ పూర్తిగా సన్నద్ధమైందని పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో దాడులు నిర్వహించి తనిఖీలు చేసి తప్పు చేసిన వారిపైన చట్ట ప్రకారం జిల్లా వైద్యాధికారి, జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు, ప్రాంతీయంగా ఉన్న పోలీసులతో సమన్వయం చేసుకొని, చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు ఇంజక్షన్ చేయకూడదని, యాంటీబయాటిక్స్ వ్రాయకూడదని, సెలైన్లు ఎక్కించరాదని, పనిచేసే చోట బెడ్స్ వేసి అడ్మిషన్లు చేయకూడదని, అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు కేవలం ఆన్ టేబుల్ డ్రగ్స్ మాత్రమే ఇవ్వాలని, జ్వరంతో వచ్చిన పేషెంట్ కు టెంపరేచర్ చూసి కేవలం పారాసెటమాల్ మాత్రమే ప్రిస్క్రైబ్ చేసి, సంబంధిత అర్హత కలిగిన డాక్టర్లకు రెఫర్ చేయాలని, ఎటువంటి రక్త పరీక్షలు, స్కానింగ్, మరే విధమైన వైద్య పరీక్షలు చేయించడానికి అర్హులు కాదని సుబ్బారెడ్డి తెలియజేశారు.



కాగా ఆర్ఎంపీలు, పీఎంపీలు గాయాలకు కుట్లు వేయడం, ఏదైనా ఆపరేషన్లు చేయడం, డెలివరీలు చేయడం, చిన్నపిల్లలకు, గర్భిణీలకు వైద్యం చేయడం లాంటివి చేయకూడదని, ఒకవేళ అటువంటివి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ దృష్టికి వస్తే దాడులు నిర్వహించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ లో నకిలీ వైద్యాన్ని నిరోధించడానికి తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. క్వాలిఫైడ్ వైద్యులు కూడా అన్ని విధాలా చట్టాలకు లోబడి వైద్యం చేయాలని సూచించారు. నిబంధనలకు లోబడి వైద్యం చేస్తున్న అర్హత కలిగిన డాక్టర్లకు అన్ని విధాలా సేవలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సిద్ధంగా ఉందని డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. ఇటీవల కాలంలో వయస్సు పైబడిన డాక్టర్లకు తమ రిజిస్ట్రేషన్ రెన్యువల్ కు నిర్దేశించబడిన క్రెడిట్ అవర్స్ ను తగ్గించడం, విజయవాడకు రావడానికి ఇబ్బందిగా ఉన్న వాళ్ల కోసం జిల్లా హెడ్ క్వార్టర్లకే పూర్తిస్థాయి సిబ్బంది, పరికరాలతో వెళ్లి అక్కడే రిజిస్ట్రేషన్ రెన్యువల్, అన్ని రకాల మెడికల్ కౌన్సిల్ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. మెడికల్ కౌన్సిల్‌కు వచ్చిన డాక్టర్ల సౌకర్యార్థం జిరాక్స్ మిషన్ ను ఏర్పాటు చేయడం, అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయడం, పూర్తి సమయం కాపీ మిషన్ ను ఏర్పాటు చేయడం, ఎక్కువసేపు నిరీక్షణ చేయకుండా త్వరితగతిన పారదర్శకంగా మెడికల్ కౌన్సిల్ కు వచ్చిన డాక్టర్లకు సంబంధించిన సేవలను అందిస్తూ డాక్టర్ ఫ్రెండ్లీ మెడికల్ కౌన్సిల్ గా పనిచేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా విదేశాలలో వైద్య విద్య పూర్తి చేసుకొని వస్తున్న ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ కు సంబంధించిన సర్టిఫికెట్లను అత్యంత సమర్థవంతంగా తనిఖీ చేసి, అర్హులైన వారిని మెడికల్ గ్రాడ్యుయేట్స్ అందరికీ ఎటువంటి జ్ఞాపకం లేకుండా ఇంటర్నిప్ ఇవ్వడం, పర్మనెంట్ రిజిస్ట్రేషన్లు ఇవ్వడం, భవిష్యత్తులో వాళ్ళు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఉండే విధంగా డాక్యుమెంట్స్ వారికి అందించడం జరుగుతుందన్నారు. ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ కు సంబంధించిన అన్ని రకాల సమస్యలను తోటి సభ్యుల సహకారంతో సంపూర్ణంగా శాశ్వతంగా పరిష్కరించి వారికి సంబంధించిన ఒక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ను తయారు చేయడం జరిగిందని సుబ్బారెడ్డి వివరించారు.

మంచి నిర్ణయాలతో ఉజ్వల భవిష్యత్తు

-హక్కుల తో పాటు బాధ్యతలు గుర్తించాలి -అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, మంచి నిర్ణయాలు తీసుకుని క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకెళితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అదనపు జిల్లా జడ్జి వి. వెంకటేశ్వరరావుఖ సూచించారు. ప్రతి ఒక్కరూ తమకు ఉన్న హక్కుల తో పాటు బాధ్యతలను కూడా గుర్తించాలన్నారు. శనివారం మహాత్మా గాంధీ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో సురక్షిత బచపన్ అభియాన్ లో భాగంగా న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ నందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు అవగతంబు చేసుకోవడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ప్రతి మానవుడి మనుగడ చట్టంతో ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. చట్టాలపై కనీస స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.ఖు ముఖ్యంగా ఎక్కడైనా లైంగిక వేధింపులకు గురవుతుంటే వెంటనే అలాంటి విషయాలను తల్లిదండ్రులు, లేదా సంబంధిత సంస్థల పెద్దలు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధితుల రక్షణ కోసం ఫోక్సా చట్టం అమలులో ఉందన్నారు. దీనికి తోడు 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే అలాంటి విషయాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని న్యాయమూర్తి తెలిపారు. 14 సంవత్సరాల లోపు బాలబాలికల అందరికీ నిర్బంధ విద్యా చట్టం అమలులో ఉందన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను ఎవరైనా పనుల్లోకి పెట్టుకుంటే తప్పకుండా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. హక్కులను పరిమితికి దాటి ఉపయోగిస్తే అనర్థాలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్, న్యాయవాది ఆశ, ఉపాధ్యాయులు నూర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

-మూడు మండలాలకు వైకాపా సర్పంచ్ అభ్యర్థులు ఖరారు -సమన్వయకర్త దీపికా వేణురెడ్డి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

వైకాపా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సర్పంచ్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణురెడ్డి సూచించారు. శనివారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలకు సంబంధించిన వైకాపా సర్పంచ్ అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ మేరకు ఖరారైన అభ్యర్థుల జాబితాను దీపిక విడుదల చేశారు. హిందూపురం రూరల్ మండల పరిధిలోని బాలంపల్లికి జయరామ్, బీరేపల్లికి శారద, బేవినహళ్లికి డి.విద్య, చలివెందులకు అజయ్ రెడ్డి, చౌళూరుకు శిల్పా, కగ్గల్లుకు కే.శివప్రసాద్, కిరికెరకు కే.మనోజ్ కుమార్, కొటిపికి హెచ్.బి. బసిరెడ్డి, మలుగూరుకు ఆర్.సరోజమ్మ, మణేసముద్రంకు ఏ.శైలజ, పూలకుంటకు ఎం.సౌజన్యల అభ్యర్థిత్వాలను ఖరారు చేసినట్లు తెలిపారు. అదే విధంగా చిలమత్తూరు మండలానికి సంబంధించి చిలమత్తూరు పంచాయతీ ఎం. లక్ష్మీనారాయణ, కోడూరు పంచాయతీకి డి. శోభమ్మ, దేమకేతేవల్లి పంచాయతీకి నరష్, టేకులోడు పంచాయతీకి శ్రీనివాసులు, కొడికొండ పంచాయతీకి ఈ. శారదమ్మ, మరసనపల్లి పంచాయతీకి సుధాకర్ రెడ్డి, వలగలవల్లి పంచాయతీకి నరసమ్మ, వీరాపురం పంచాయతీకి సాయిలీల, సోమఘట్ట పంచాయతీకి లక్ష్మీపతి రెడ్డి, శెట్టిపల్లి పంచాయతీకి చామంతి, దిగువపల్లి తాండ పంచాయతీకి రంజిత్ నాయక్, చాగలేరు పంచాయతీకి లక్ష్మీపతి రెడ్డిలను ఖరారు చేసినట్లు తెలిపారు. దీనికి తోడు లేపాక్షి మండలానికి సంబంధించి బిసలమానేంపల్లికి సరోజమ్మ, చోళసముద్రంకు జి.వెంకటరత్నమ్మ, కల్లూరుకు బి.హరి, కంచిసముద్రంకు సురేష్ రెడ్డి, కొండూరుకు కే. అవర్ణ, లేపాక్షికి బి. శ్రీలత, మానేంపల్లికి శంకరప్ప, మైదుగోళంకు యశోద, నాయనపల్లికి కేశవమూర్తి, పులమతికి నాగమణి, శిరివరంకు గౌనివారి ప్రభాకర్ పేర్లను ఖరారు చేసినట్లు దీపికా వివరించారు.



నార్పలలో నామినేషన్ల స్క్రూటినీ పరిశీలన

సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల పరిశీలనపై జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఆరా

ప్రజా భూమి – నార్పల:



నార్పల గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ నుయుష్ కుమార్ ఐఏఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్క్రూటినీ జరుగుతున్న తీరును ఎన్నికల అధికారి చిన్న వీరస్వామి, ఎంపీడీఓ మమతా దేవి, డిప్యూటీ ఎంపీడీఓ శ్యామలలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ పత్రాల పరిశీలన, ఎన్నికల నిబంధనల అమలు తదితర అంశాలపై అధికారులతో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ ఎన్నికల అధికారులకు సహకరించాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. నార్పల గ్రామపంచాయతీ పరిధిలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు చేపడుతున్న చర్యలను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ పర్యవేక్షించారు.

ఖైదీల సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఉపకారాగారంలో ఖైదీలు సమస్యలు ఎదుర్కొంటుంటే వాటిని తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అదనపు జిల్లా జడ్జి వి.వెంకటేశ్వరరావుఖ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఉపకారాగారాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలు ఏఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు, న్యాయవాదులు ఉన్నారా, బెయిల్ మంజూరయిందా, జామీనుదారులను ఉన్నారా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ,ఱూ ఉపకారాగారంలో సిబ్బంది వివక్షత ప్రదర్శిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. భోజనం, వైద్య సౌకర్యాలు తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని రిమాండ్ ఖైదీలు తెల్లకాగితంపై దరఖాస్తు చూసుకుంటే అర్హతను పరిశీలించి త్వరితగతిన న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అర్హత ఉన్న వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. కారాగారం నుండి బయటకు వెళ్లిన తర్వాత మార్పుతో ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగారాధికారి హనుమప్ప, న్యాయవాది ఆశ, లోక్ అదాలత్ రాజా, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సామరస్యంతో కేసులు పరిష్కరించుకోవాలి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

కక్షిదారులు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా సామరస్యంతో ఇరువర్గాలు పరస్పరం చర్చించుకుని రాజీమార్గంలో కేసులుక పరిష్కరించుకోవాలని అదనపు జిల్లా జడ్జిఖ వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం అదనపు జిల్లా కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి హేమలత, జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ హారికఖ కోటతో పాటు చెక్ బౌన్స్ కేసుల ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులతో చర్చించి కేసులను పరిష్కరించారు. చెక్ బౌన్స్ కేసు పరిష్కరించి బాధితుడికి రూ.14.80 లక్షలు ఇప్పించారు. అనంతరం న్యాయమూర్తిఱు మాట్లాడుతూ, రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఎలాంటి మనస్పర్థలు ఉండమన్నారు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు కూడా తలెత్తవని తెలిపారు. ప్రధానంగా చెక్ బౌన్స్ కేసుల విషయంలో రాజీమార్గం ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నాగరాజు, గూండాచారి, అనిల్ కుమార్, అంజనమ్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

16 సర్పంచ్, 18 వార్డు సభ్యుల నామినేషన్లు

-ఆరు పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు

-రెండు పంచాయతీల్లో వార్డు సభ్యుల నామినేషన్ల దాఖలు

-నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీఓ దామోదరమ్మ

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం రూరల్ మండలంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజు ప్రశాంతంగా ప్రారంభమైంది. శనివారం మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 34 నామినేషన్లు దాఖలైనట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) దామోదరమ్మ వివరించారు. ఇందులో సర్పంచ్ స్థానాలకు 16, వార్డు సభ్యుల స్థానాలకు 18 నామినేషన్లు నమోదైనట్లు తెలిపారు. సర్పంచ్ స్థానాలకు చౌళూరు గ్రామ పంచాయతీలో 3, కిరికెరలో 2, కొటిపిలో 4, మణేసముద్రంలో 2, పూలకుంటలో 2, తూముకుంటలో 3 నామినేషన్లు దాఖలయ్యాయి. మిగిలిన బాలంపల్లి, ఎం.బీరేపల్లి, బేవినహళ్లి, చలివెందుల, గోళ్లాపురం, కగ్గల్లు, మలుగూరు, సంతేబిదనూరులో తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అదే విధంగా వార్డు సభ్యుల స్థానాలకు కిరికెరలో 6, కొటిపిలో 12 నామినేషన్లు నమోదయ్యాయి. మిగిలిన గ్రామ పంచాయతీల్లో వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు చేపట్టిన ఏర్పాట్లను ఎంపీడీఓ దామోదరమ్మ, ఈఓఆర్డీలు శివకుమార్, నారాయణలతో కలిసి వివిధ నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రక్రియ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. తొలిరోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

గణపతి సచ్చిదానంద స్వామిజీని ఆహ్వానించిన వేణుగోపాల్ రావు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



మైసూరు అవధూతం దత్తపీఠం పరమ పూజ గణపతి సచ్చిదానంద స్వామీజీని లేపాక్షి దేవాలయ చైర్మన్, బిజెపి నేత, దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత వరిగి వేణుగోపాల్ రావు కలిశారు. ఈ సందర్భంగా స్వామీజీ ఆశీస్సులను పొందడంతో పాటు లేపాక్షి చరిత్రను సచ్చిదానంద స్వామికి వివరించి లేపాక్షికి రావాలని ఆహ్వానించారు. దీనికి తోడు దత్త విజయానంద (శ్రీ బాల స్వామీజీ) ని సైతం వేణుగోపాలరావు మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందడంతో పాటు లేపాక్షికి ఆహ్వానించారు.

తులసి రెడ్డికి శుభలేఖ పంపిన షర్మిల రెడ్డి

ధ్రువ కుమార్ రెడ్డి ద్వారా కుమార్తె వివాహ ఆహ్వానం, బహుమతి అందజేత

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి ద్వారా తన కుమార్తె అంజలి రెడ్డి వివాహ శుభలేఖను, బహుమతిని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డికి పంపిన ఏపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి.ధ్రువ కుమార్ రెడ్డి తులసి రెడ్డిని కలిసి శుభలేఖను, బహుమతిని అందజేసి వివాహానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు దేశభక్తిని కలిగి ఉండాలి

ఏపీ జేయు రాష్ట్ర కార్యదర్శి అల్లం రంగనాయకులు రాయల్

ప్రజాభూమి, పులివెందుల



విద్యార్థులు ప్రతి ఒక్కరు దేశభక్తిని అలవర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ,సీనియర్ జర్నలిస్ట్ అల్లం రంగనాయకులు రాయల్ పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ జిల్లా శారీరక ప్రముఖ్ శ్రీకాంత్, అందుల వీరనారాయణ ఆశ్రమ నిర్వాహకులు రామ్మోహన్ల ఆధ్వర్యంలో కౌన్సిలర్ డాక్టర్ కిషోర్, హితేష్ ల సహకారంతో శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో నిర్వహించిన కార్తీక దీప సహ బంతి భోజనం కార్యక్రమం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ఉపన్యసించారు. ఈ



సందర్భంగా రంగనాయకులు రాయల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజానికి ప్రతి విద్యార్థి నైతిక విలువలను కలిగి దేశానికి, సమాజానికి ఉపయోగపడే విధంగా క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. ఆర్ఎస్ఎస్ జిల్లా శారీరక్ ప్రముఖ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కష్టపడి పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి కుటుంబం ,సమాజం, ధర్మం, దేశం అనే నాలుగు అంశాల పైన దృష్టి సారించాలన్నారు పొరుగువారికి సాయపడే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లీలాధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి అంశం లోను దైవత్వాన్ని చూడాలని సూచించారు. దైవ త్వంతో సేవాగుణం, మంచి అలవాట్లు అలవాడతాయని సూచించారు. విద్యార్థి దశ నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల లో శ్రీ వీరనారాయణ స్వామి అందుల ఆశ్రమ నిర్వాహకులు రామమోహన్, రిటైర్డ్ జవాన్ నాగిరెడ్డి, కౌన్సిలర్, డాక్టర్ కొంగనపల్లె కిషోర్, హితేష్ రాయల్, ఆలయ అర్చకులు తలముడిపి న వెంకట నవీన్ కుమార్ శర్మ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్తీకదీవ నహ బంతి భోజనం

శ్రీ రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో భరతమాత చిత్రపటశీ వద్ద కార్తీక దీవ కార్యక్రమాన్ని విద్యార్థుల చేత నిర్వహించారు. అనంతరం కార్తిక దీప వెలుగులలో సహబంతి6 భోజన కార్యక్రమం కార్తీక భోజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక మాస విశిష్టత కార్తీక మాస భోజన విశిష్టతను విద్యార్థులకు పలు పలువురు వివరించారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
ఆదివారం 22 నవంబరు 2026

ఘనంగా అయ్యప్ప స్వామి అంగుళం, పడి పూజ

ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మండలం పరిధిలోని ఈ కొత్తపల్లి గ్రామంలో శనివారం అయ్యప్ప స్వామి అంబులంపూజ,పడిపూజ కార్యక్రమాన్ని గురుస్వాములు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి అంబులం పూజను పురస్కరించుకుని గ్రామంలో అరటి బెరడులతో ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి, వాటిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. మండపాలలో అయ్యప్ప స్వామి, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి చిత్రపటాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురు స్వామి శ్రీరాములు, పులివెందుల గురుస్వామి వెంకటరామిరెడ్డి, టైలర్ శివారెడ్డి, సుబ్బరాయుడు,



ప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి పడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప మాల ధరించిన భక్తులు పడిపూజ పాట పాడుతూ భక్తి పరవశంలో మునిగిపోయారు. అనంతరం ప్రత్యేక అలంకరణతో స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. అయ్యప్ప భక్తులు నిర్వహించిన భజనలు, భక్తిగీతాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం భక్తులందరికీ బిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో నిర్వహించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అయ్యప్ప స్వామి అంబలం పడిపూజ ఈ కొత్త పల్లె గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది.

62 వేలు పలికిన అయ్యప్ప స్వామి లడ్డు

కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన అంబులం పూజలో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పాట ఉత్కంఠభరితంగా సాగింది. లడ్డూను దక్కించుకునేందుకు గ్రామస్తులు ఉత్సాహంగా వేలంలో పాల్గొన్నారు. హోరాహోరీగా సాగిన వేలం పాటలో ఈ.కొత్తపల్లి గ్రామానికి చెందిన రవితేజ యాదవ్ అత్యధికంగా 62 వేల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు.లడ్డూను 62 వేల రూపాయలకు సొంతం చేసుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. భక్తి, సంప్రదాయాలు, కోలాటం ప్రదర్శనలు, లడ్డూ వేలం పాటతో ఈ.కొత్తపల్లి అంబుల పూజ వేడుకలు గ్రామోత్సవ శోభను సంతరించుకున్నాయి. గ్రామస్తుల ఉత్సాహం నడుమ అంబుల పూజ కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి.

సామర్థ్య ఆధారిత బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ



ప్రజాభూమి, సిద్దవటం: సిద్దవటం మండలంలోని ఉపాధ్యాయులకు సామర్థ్య ఆధారిత బోధనా పద్ధతులపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సిద్దవటం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ క్లస్టర్ సమావేశంలో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి ఒక్కొక్క ఉపాధ్యాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీసోర్స్ పర్సన్స్ ప్రసాద్‌రెడ్డి, కుమార్‌రెడ్డి సామర్థ్య ఆధారిత బోధనా విధానాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి, శిక్షణ అందించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సునీత శిక్షణ తరగతులను ప్రారంభించి, ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా బోధన కొనసాగించాలని సూచించారు.

పుత్తా నరసింహారెడ్డికి తులసి రెడ్డి అభినందనలు

- వేసవిలో తాగునీటి సమస్య నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

ప్రజాభూమి, వేంపల్లె



కడప జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికైన పుత్తా నరసింహారెడ్డికి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఫోన్‌లో నరసింహారెడ్డితో మాట్లాడి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తులసి రెడ్డి సూచించారు. తాగునీటి సమస్య నివారణకు తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని తులసి రెడ్డి కోరారు.

గండి క్షేత్రంలో ప్రారంభమైన వార్షిక పవిత్రోత్సవాలు

- అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ సహాయ కమిషనర్, చైర్మన్



ప్రజాభూమి, చక్రాయపేట

ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రం శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు కేసరి ఆధ్వర్యంలో పవిత్రోత్సవాల్లో భాగంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ సి. విశ్వనాథ్, ఆలయ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ పండితులు రామానుజాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా రమేష్ స్వామి, ఆలయ వేద పండితులు పాల్గొన్నారు. పవిత్రోత్సవాల ప్రారంభం సందర్భంగా శనివారం సాయంత్రం అంకురార్పణ, అనుజ్ఞ, విష్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధన ధారణ, ఋత్విక్ వరణం, మృత్సంగ్రహణం, వాస్తు హోమం, గోష్ఠి తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ పవిత్రోత్సవాలు అత్యంత విశిష్టమైనవని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పవిత్రోత్సవాల్లో పాల్గొని శ్రీ స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

సిద్దవటం అభివృద్ధే జనసేన లక్ష్యం

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం: అతికారి కృష్ణ



ప్రజాభూమి, సిద్దవటం: సిద్దవటం ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయబోమని రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు. సుమారు 40 ఏళ్లుగా ప్రజలు తమ మద్దతుదారులను సర్పంచులుగా గెలిపిస్తూ ఆదరిస్తున్నారని తెలిపారు. ఈసారి సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుల స్థానాలు కూడా ఏకగ్రీవం కావడం సంతోషంగా ఉందన్నారు. తమ కుటుంబం తరఫున ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ షేక్ గౌస్ బాషాకు శుభాకాంక్షలు తెలిపారు. సౌమ్య స్వభావం, సేవాభావం కలిగిన వ్యక్తిని సర్పంచ్‌గా ఎన్నుకున్నామని పేర్కొన్నారు. సిద్దవటం గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రజల సహకారంతో అంకితభావంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఎసీ అధ్యక్షుడు బండారు రాజగోపాలయ్య, మాజీ సర్పంచ్ భవనాశి ఓబులయ్య, మాజీ ఉపసర్పంచ్ సయ్యద్ హిదాయతుల్లా, మాజీ సర్పంచ్ శ్రీనివాస రాజు, బీసీ నాయకులు సిద్దయ్య, శ్రీనలంద, పాఠశాలల కరస్పాండెంట్లు బాలు గారి వెంకట సుబ్బయ్య, పోలు వెంకట సుబ్బయ్య, ఏఎంసీ డైరెక్టర్ మహబూబ్ బాషా (బాబి), జనసేన నాయకులు సుబ్బరామయ్య, ఆవుల నాగేంద్ర, ఆవుల సుధ, ఆవుల రాజా, అక్కిశెట్టి కవిత, శ్రీకంఠం మాధవి, మోడెం బుజ్జి, గంగయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందా గోవిందా నామస్మరణతో మార్మోగిన కళ్యాణ వెంకటరమణ ఆలయం

భక్తిశ్రద్ధలతో శ్రీ గోవింద కళ్యాణ మహోత్సవం - తీర్థప్రసాదాలతో భక్తులకు అన్నదానం

ప్రజాభూమి, పులివెందుల



పట్టణంలోని శ్రీ పద్మావతి సమేత కళ్యాణ వెంకటరమణ స్వామి దేవస్థానంలో శనివారం శ్రీ గోవింద కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గోవింద మాల ధరించిన భక్తబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గోవింద కళ్యాణంలో ఆలయ అర్చకుడు వరదాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కళ్యాణ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో కన్నుల పండువగా కొనసాగాయి.గోవింద కళ్యాణ ఉత్సవానికి భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.గోవింద నామస్మరణలు, భక్తుల గోవింద నామజపంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కళ్యాణోత్సవంలో భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, గోవింద మాల బృందం సభ్యులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

చైర్ పర్సన్ దంపతులకు ఘన సన్మానం

ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని గుడ్ మార్నింగ్ మిత్రుల విజ్ఞప్తి



ప్రజాభూమి, పులివెందుల

ఇటీవల జరిగిన పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో చైర్ పర్సన్ గా విజయం సాధించిన తూగుట్ల గీతా కుమారి, ముప్పై ఐదో వార్డు కౌన్సిలర్ గా ఎన్నికైన తూగుట్ల మధుసూదన్ రెడ్డి దంపతులకు గుడ్ మార్నింగ్ మిత్రుల సమూహం ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఆలూరు మునిబాబు, అంగడి నాగేంద్ర, సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన తూగుట్ల దంపతులకు దుశ్శాలువాలతో , గజమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చైర్ పర్సన్ తో కేక్ కట్ చేయించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా పూల మొక్కలను అందజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సభ్యులు కోరారు. ముఖ్యంగా తాగునీటి సమస్య పరిష్కారం, వార్డుల్లో విద్యుత్ దీపాల కొరత లేకుండా చూడటం, పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడం వంటి అంశాలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా దశలవారీగా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జనార్దన్ బాబు, శంకర్ నాయక్, రాజేశ్వరరెడ్డి, మనోహర్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, రాజారెడ్డి, బాలకృష్ణ, కృష్ణ కిషోర్ రెడ్డి, బాలచంద్రారెడ్డి, నారాయణ స్వామి, శ్రీనివాస్ రెడ్డి, రవిశంకర్, రంగనాయకులు, రమణారెడ్డి, నాగిశెట్టి, ఫ్రాన్సిస్, సురేష్, గౌతమ్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి గొప్ప సంఘసంస్కర్త, మహిమాన్వితుడు

- కులమత భేదాలు, మూఢనమ్మకాలను వ్యతిరేకించిన మహనీయుడు

- ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాని మాత్రమే కాకుండా గొప్ప సంఘసంస్కర్త, మహిమాన్వితుడని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పట్టణంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి 418వ జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె సమీపంలోని రవ్వలకొండ గుహల్లో తపస్సు చేసి భవిష్యత్తులో జరగబోయే సామాజిక, రాజకీయ, ప్రకృతి మార్పులను వివరిస్తూ తాళపత్రాలపై కాలజ్ఞానాన్ని రచించారని తెలిపారు. సుమారు 400 ఏళ్ల క్రితం ఆయన చెప్పిన అనేక విషయాలు నిజమయ్యాయని పేర్కొన్నారు. కులమత భేదాలు, మూఢనమ్మకాలను వీరబ్రహ్మేంద్రస్వామి తీవ్రంగా వ్యతిరేకించారని, దూదేకుల సిద్దయ్య, హరిజనుడైన కక్కయ్యను శిష్యులుగా స్వీకరించారని తెలిపారు. పితృస్వామ్య వ్యవస్థ ఉన్న కాలంలోనే మాతృస్వామ్య భావనకు ప్రాధాన్యతనిస్తూ తన కుమార్తె వీరనారాయణమ్మ సంతతివారిని మఠాధిపతులుగా నియమించారని వివరించారు. నీటితో దీపాలు వెలిగించడం, మాంసాన్ని పూలుగా మార్చడం, చనిపోయిన వారిని బతికించడం వంటి మహిమలను ప్రదర్శించారని అన్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జీవసమాధి అయిన కందిమల్లాయపల్లె (బ్రహ్మంగారిమఠం)ను మరింత అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని తులసి రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, వెంకటేశు, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, రమణ, వేమయ్య, బద్రీనాథ్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వైసిపి వర్గాల మధ్య ఘర్షణ

- పోలీసుల లాఠీఛార్జ్




ప్రజాభూమి, ఎర్రగుంట్ల

కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం కలమల్ల నామినేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ల విషయమై టీడీపీ – వైసిపి వర్గీయుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పోలీసులు లాఠీఛార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. మరోఘటనలో ముద్దనూరు మండలం చింతకుంట నామినేషన్ కేంద్రం వద్ద ఘర్షణ చోటుచేసుకుంది. టీడీపీ – వైసిపి వర్గీయులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టారు.

చెక్ బౌన్స్ కేసుల్లో స్పెషల్ లోక్ అదాలత్.. నాలుగు కేసుల పరిష్కారం

రూ.2.10 లక్షల విలువైన కేసులకు రాజీ ద్వారా ముగింపు



ప్రజాభూమి పులివెందుల

పులివెందుల న్యాయస్థాన పరిధిలోని చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి శనివారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్‌లో నాలుగు కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కేసులకు సంబంధించి రూ.2.10 లక్షల విలువైన వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎం. చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు .ఈ స్పెషల్ లోక్ అదాలత్‌కు పులివెందుల కోర్టు చైర్మన్ కం జూనియర్ సివిల్ జడ్జి ఎం. చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించారు. అడ్వకేట్లు, కోర్టు సిబ్బంది పాల్గొని కేసుల పరిష్కారానికి సహకరించారు.ఈ సందర్భంగా జడ్జి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 12 న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అడ్వకేట్లు, పోలీసు అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, ప్రజలు సహకరించి తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవా లని కోరారు. రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతాయని తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించిన కేసులకు చట్టపరమైన ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్. రామ్మోహన్, డి. శివరాజ్, కోర్టు క్లర్కులు కరీం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీటీసీ మహమ్మద్ హిదయతుల్లాకు ఘన సన్మానం

- శాలువా కప్పి పూలమాలతో సత్కరించిన తిరుమల రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

నూతనంగా ఎంపీటీసీగా ఎన్నికైన మహమ్మద్ హిదయతుల్లాను స్థానిక పట్టణంలో తిరుమల రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహమ్మద్ హిదయతుల్లా ఎంపీటీసీగా ఎన్నిక కావడం సంతోషకరమన్నారు. ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ఎంపీటీసీగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట రామిరెడ్డి, ఇస్మాయిల్, ఎద్దుల రాము, వెంకటశివ, అంజి, నాగేష్, షఫీ, మధు, రాఘవ, సుబ్బయ్య, కిషోర్, రాజా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వాసవి ఆలయంలో కార్తీక గౌరమ్మకు ప్రత్యేక పూజలు

- క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా పూజా కార్యక్రమాలు - ఐదు రోజుల పాటు శ్రీ గౌరీదేవి ఉత్సవాలు



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా మహిళా మండలి ఆధ్వర్యంలో పసుపుతో తయారు చేసిన కార్తీక గౌరమ్మ ప్రతిమను ప్రతిష్ఠించి గౌరీదేవికి, తులసి మొక్కకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా ఐదు రోజుల పాటు శ్రీ గౌరీదేవి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నాలుగు రోజుల పాటు పూజా కార్యక్రమాలు, లక్ష దీపోత్సవం నిర్వహించి, చివరి రోజు గౌరీదేవి నిమజ్జనం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గౌరీదేవి సౌభాగ్యం, సంతానం, శాంతి, సిరిసంపదలకు ప్రతీకగా నిలుస్తుందని, అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని మహిళలు విశ్వసిస్తారని తెలిపారు. వివాహిత మహిళలు గౌరీదేవిని పూజించడం వల్ల భర్తకు ఆయురారోగ్యాలు, అఖండ సౌభాగ్యం కలుగుతాయని, అవివాహిత యువతులు పూజించడం వల్ల మంచి జీవిత భాగస్వామి లభిస్తాడని పెద్దలు చెబుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్



ప్రజాభూమి, కడప అర్బన్

నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యురాలు మాధవి.తెలుగుదేశం పార్టీ జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి శనివారం 'ప్రజా దర్బార్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ డివిజన్లు, గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలు. టిడిపి శ్రేణుల నుండి వారు వినతిపత్రాలను స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యను అడిగి తెలుసుకున్నరు, పలు సమస్యల పరిష్కారం నిమిత్తం అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 8
ఆదివారం 22 నవంబరు 2026

నాన్న ఆశయ సాధన కోసం కృషి చేస్తాం

- ప్రముఖ పారిశ్రామిక వేత్త దీపక్



ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రాపురం

నాన్న దివంగత పులిపాటి భాస్కర్ నాయుడు ఆశయా సాధన కోసం కృషి చేస్తామని ప్రముఖ పారిశ్రామికవేత్త పులిపాటి దీపక్ అన్నారు. శనివారం పారకాల్వ లో టాటా క్యాన్సర్ కేర్ హాస్పిటల్ ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి, కమ్మపల్లి పి హెచ్ సి, ఆయుష్ ఆధ్వర్యంలో ఉదయ భాస్కర్ నాయుడు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు చేతి కర్రలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన స్వగ్రామానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు తన తండ్రి కళ్యాణ మండపాన్ని, సిద్దేశ్వర ఆలయ పునరుద్ధరణ చేసి గ్రామానికి అంకితం చేసినట్లు చెప్పారు ఈ కార్యక్రమంలో ఏపీ ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ చినబాబు, వడమాల పేట ఎంపీపీ ధనంజయలు నాయుడు, కార్యనిర్వహకులు మధుసూదనరావు సూరిబాబు రావిళ్ళ గిరిబాబు ముని చంద్ర నాయుడు నాదముని నాయుడు హరి, చందు తిరుపతి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కేవీ చౌదరి గారు, తిరుపతి పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు జేవి కృష్ణయ్య గారు, కోశాధికారి స చెన్నుపాటి చక్రపాణి గారు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు

అంబూరు సర్పంచ్‌గా టీ. కౌసల్య ఏకగ్రీవ ఎన్నిక

ఏకగ్రీవానికి సహకరించిన గ్రామ ప్రజలకు నందకిషోర్ రెడ్డి కృతజ్ఞతలు



ప్రజా భూమి ప్రతినిధి:- వరదయ్యపాలెం

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం అంబూరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా టీ. కౌసల్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారుగ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు వచ్చి ఏకగ్రీవ ఎన్నికకు సహకరించడం పట్ల గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ టీ. కౌసల్యకు సింగిల్ విండో చైర్మన్ నందకిషోర్ రెడ్డి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని గ్రామ ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా ఏకమై సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేయడం అభినందనీయమన్నారు.ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రజల మధ్య ఐక్యత, పరస్పర సహకారం ఎంతో అవసరమని నందకిషోర్ రెడ్డి పేర్కొన్నారు. అంబూరు గ్రామ ప్రజలు ఐకమత్యంతో తీసుకున్న నిర్ణయం గ్రామ ప్రగతికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన గ్రామ పెద్దలు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన సర్పంచ్ టీ. కౌసల్య గ్రామ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు

ప్రజా సమస్యలపై పోరాటమే సీపీఎం లక్ష్యం

-9, 17 వార్డుల్లో అభ్యర్థుల ప్రచారం

ప్రజా భూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తి మున్సిపాలిటీలోని 9, 17 వార్డుల్లో సీపీఎం అభ్యర్థులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుని తమ పార్టీ విధానాలు, ప్రజా సమస్యలపై సాగిస్తున్న పోరాటాలను వివరించారు. సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్మికులు, కర్షకులు, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా సీపీఎం నిరంతరం పోరాడుతోందని నాయకులు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉపాధి సమస్యలు, పేదలకు ఇళ్ల స్థలాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ప్రజల తరపున ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు అందుబాటులో ఉంటూ, పాలకులపై ఒత్తిడి తీసుకురావడమే తమ రాజకీయ కార్యాచరణలో భాగమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించే ఉద్యమ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ ప్రచారంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, 9వ వార్డు అభ్యర్థి భారతి, 17వ వార్డు అభ్యర్థి ఉస్మాన్ బాషా, పెనగడం గురవయ్య, వెంకటేష్, మూర్తి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

9వ వార్డులో ఏకగ్రీవ విజయం.సోలా మల్లికార్జునరెడ్డికి ఘన సత్కారం!



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలంలో 9వ వార్డు సభ్యుడిగా సోలా మల్లికార్జునరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి చేతుల మీదుగా ఆయన ధృవీకరణ పత్రాన్ని స్వీకరించారు.ఏకగ్రీవ విజయంతో సోలా మల్లికార్జునరెడ్డిని పలువురు కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సోలా మల్లికార్జున రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఏకగ్రీవ ఎన్నికతో మల్లికార్జునరెడ్డి వర్గీయుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

ప్రకృతి వ్యవసాయ విస్తరణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

-:రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



రైతులకు అదనపు ఆదాయం, పశువులకు పచ్చిమేత, కుటుంబాలకు పోషకాహారం అందించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావులతో సమావేశమై జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విస్తరణ, రైతుల ఆదాయ వృద్ధి, పశుపోషణ, ఉద్యాన పంటల్లో అంతర పంటల సాగు, ఆరోగ్య మరియు పోషణ కార్యక్రమాల అమలుపై చర్చించారు. వివిధ లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అనంతరం జేసి, డిఆర్ఓ లతో కలసి వివిధ లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులతో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో అంతర పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులకు ప్రధాన పంటతో పాటు అదనపు ఆదాయ మార్గాలు కల్పించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారికి సూచించారు. ముఖ్యంగా మామిడి తోటల్లో మార్కెట్ ధరలు, దిగుబడుల కారణంగా రైతులకు ఆశించిన ఆదాయం లభించని పరిస్థితుల్లో, అంతర పంటల సాగును చేపట్టి రైతుల ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా చేపడుతున్న పిఎండిఎస్ సాగు ద్వారా పశువులకు అవసరమైన పచ్చిమేతను అందుబాటులోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో పశువులకు సరిపడా పచ్చిమేత లభించే విధంగా పిఎండిఎస్ సాగు ప్రణాళికలు రూపొందించాలని పశు సంవర్ధక శాఖ అధికారికి సూచించారు.వరి సాగులో కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ డ్రై ప్యాడీ పొలాల్లో పప్పుజాతి పంటలు, ఆకుకూరలు, కూరగాయలను సాగు చేయాలని సూచించారు. నీటి వసతి ఉన్న వరి పొలాల్లో గట్లను సుమారు ఐదు అడుగుల వెడల్పుతో ఎల్-ఆకారంలో అభివృద్ధి చేసి, వాటిపై కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతి, తీగజాతి పంటలు, పండ్ల మొక్కలను పెంచుకోవాలని తెలిపారు. తద్వారా రైతు కుటుంబాలకు అవసరమైన పోషకాహారం అందడంతో పాటు మిగులు ఉత్పత్తుల విక్రయం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. వరి సాగులో కలుపు నివారణకు నాట్లు వేసిన 15 రోజుల తర్వాత నూకలు చల్లే విధానాన్ని పరిశీలించి అమలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారికి సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న బీడు భూములను వినియోగంలోకి తీసుకువచ్చి హాఫ్ మూన్ మోడల్, డ్రాట్ ప్రూఫింగ్ మోడల్, వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అమలు చేయాలని సూచించారు. భూమిలో తేమ సంరక్షణ, వర్షపు నీటి వినియోగం, పచ్చదనం పెంపు ద్వారా గ్లోబల్ వార్మింగ్ ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణాభివృద్ధి శాఖద్వారా ప్రతి ఇంటి వద్ద పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. తద్వారా ప్రతి కుటుంబం తమ అవసరాలకు సరిపడా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను స్వయంగా పండించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం ఐదు మండలాల్లో ఆరోగ్య మరియు పోషణ కార్యక్రమం అమలవుతోందని, ప్రతి మండలంలో ఐదు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో, రాబోయే రోజుల్లో ఆయా మండలాల్లోని అన్ని గ్రామాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని సెర్ప్ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు సూచించారు. కుటుంబాల్లో ఆహార వైవిధ్యం, పోషకాహార ప్రాధాన్యత, పెరటి తోటల పెంపకం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం కేవలం సాగు విధానం మాత్రమే కాకుండా రైతుల ఆదాయ వృద్ధి, పశువుల పోషణ, కుటుంబ ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే సమగ్ర వ్యవస్థగా అభివృద్ధి చెందాలని, ఇందుకోసం అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తిరుపతి జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జేడి, డ్వామా పిడి, పశు సంవర్ధక శాఖ పి డి, డి ఆర్ డి ఏ, ఉద్యాన శాఖ అధికారులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బి.ఎన్. కండ్రిగ మండలంలో పంచాయతీ ఎన్నికల సందడి

8 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం.. 20 స్థానాలకు ఎన్నికలు-5 వార్డు స్థానాలు ఏకగ్రీవం.. 7 స్థానాల్లో నామినేషన్లు శూన్యం

ప్రజా భూమి ప్రతినిధి
- బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా, బి.ఎన్. కండ్రిగ మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి నెలకొంది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ గడువు ముగియడంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల తుది వివరాలను అధికారులు వెల్లడించారు. ఈ మేరకు బి.ఎన్. కండ్రిగ మండల ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఒక ప్రకటనలో ఎన్నికల వివరాలను తెలియజేశారు. మండలవ్యాప్తంగా మొత్తం 28 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు గాను 8 స్థానాలు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీవో వెల్లడించారు. మిగిలిన 20 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ స్థానాలకు సంబంధించి మొత్తం 55 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారని, ఎక్కడా నామినేషన్ల దాఖలు కాకుండా సర్పంచ్ స్థానం ఖాళీగా లేదని పేర్కొన్నారు.అదేవిధంగా మండలంలోని మొత్తం 236 వార్డు సభ్యుల స్థానాలకు గాను 95 స్థానాలు ఏకగ్రీవమైనట్లు తెలిపారు. మరో 7 వార్డు స్థానాలకు ఎలాంటి నామినేషన్ల దాఖలు కాలేదని వెల్లడించారు. మిగిలిన 134 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని, ఈ స్థానాల్లో మొత్తం 280 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు వివరించారు.ఎన్నికల ప్రక్రియలో భాగంగా



ఏకగ్రీవమైన స్థానాలు మినహా మిగిలిన గ్రామ పంచాయతీలు, వార్డు స్థానాల్లో అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. అభ్యర్థులు ఓటర్లను కలుస్తూ తమకు మద్దతు ఇవ్వాలని కోరేందుకు కార్యాచరణ రూపొందించుకుంటున్నారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేపడుతున్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏకగ్రీవమైన స్థానాలు, ఎన్నికలు జరగనున్న స్థానాల వివరాలను ఎంపీడీవో వెంకటరత్నమ్మ అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించారు.

స్ఫూర్తిదాయకమైన రాజకీయాలు నడిపిన గొప్ప వ్యక్తి సోనియా గాంధీ

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీ ఖాన్...

ప్రజాభూమి, కడప , అర్బన్ :



నవ సమాజానికి ఆదర్శప్రాయమైన రాజకీయాలు నడిపిన గొప్ప నాయకురాలు సోనియా గాంధీ అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. శనివారం కడపలోని వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్‌లో ఏఐసీసీ సభ్యురాలు సోనియా గాంధీ రచిం చిన "బిలాంగింగ్ : ది జర్నీ అఫ్ లవ్ " పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సోనియా గాంధీ తన జీవిత ప్రయాణం, కుటుంబ అనుబంధాలు, రాజకీయ అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్లను ఈ పుస్తకంలో వివరించారని తెలిపారు. బయటి ప్రపంచంలో తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలకు వాస్తవాలను తెలియజేసే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు పేర్కొన్నారు. రాజీవ్ గాంధీతో పరిచయం, ప్రేమ, వివాహం, కుటుంబ జీవితంలో ఎదురైన పరిస్థితులు, ఇద్దరు ప్రధానమంత్రుల మరణాలతో తాను అనుభవించిన భయానక పరిస్థితులను ఇందులో పొందుపరిచారని వివరించారు. 2004 లో ప్రధానమంత్రి పదవి చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ, రాజకీయ విమర్శలు, వివిధ వర్గాల అభ్యంతరాల నేపథ్యంలో ఆ పదవిని త్యాగం చేసి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు అవకాశం కల్పించడం సోనియా గాంధీ రాజకీయ విలువలకు నిదర్శనమని మహమ్మద్ అలీ ఖాన్ అన్నారు. పదవుల కంటే ప్రజాస్వామ్య విలువలు, దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చిన నాయకురాలిగా ఆమె నిలిచారని కొనియాడారు. ఈ పుస్తకం తక్కువ సమయంలోనే విస్తృతంగా అమ్ముడవడం విశేషమని, ప్రజలు, ప్రస్తుత రాజకీయ నాయకులు దీనిని చదివి సోనియా గాంధీ జీవిత ప్రయాణం, రాజకీయ ఆలోచనలు, దేశం పట్ల ఆమెకున్న నిబద్ధతను అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలు, దేశ పరిస్థితులను బట్టి నాయకులు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, సమ సమాజ స్థాపనతో పాటు దేశ అభివృద్ధికి ఎలా కృషి చేయాలనే విషయాలను ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు.కార్యక్రమంలో మైనార్టీ జిల్లా నాయకులు రహమతుల్లా ఖాన్, హమీద్, కమల్ భాష, దినకర్ రెడ్డి, ముజాయుద్దీన్, జహీర్ ఖాన్ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు స్ఫూర్తి టిప్పుసుల్తాన్

-టిప్పుసుల్తాన్ వారసుడు సయ్యద్ మన్సూర్ అలీ టిప్పు, రవిశంకర్ గురూజీ

ప్రజాభూమి, హిందూపురం టౌన్



దేశ సమైక్యత, మతసామరస్యం, సోదరభావం కోసం మహావీరుడు షహీద్ టిప్పుసుల్తాన్ చేసిన పోరాటం, ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని టిప్పుసుల్తాన్ ఏడో తరం వారసుడు సయ్యద్ మన్సూర్ అలీ టిప్పు, మహా ఆచార్య శ్రీ రవిశంకర్ గురూజీ పేర్కొన్నారు. హిందూ, ముస్లింల ఐక్యతతో పాటు వివిధ మతాల మధ్య పరస్పర గౌరవం, సహనం, ఐకమత్యం దేశాభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. శనివారం హిందూపురం పట్టణంలోని ఏఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మహావీరుడు షహీద్ టిప్పు సుల్తాన్ జయంతోత్సవాల్లో పాల్గొని ప్రసంగించారు. అఖిల భారత షహీద్ టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కల్లూరు ఉమర్ ఫరూఖ్ ఖాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మైసూరు షహీద్ టిప్పుసుల్తాన్ ఏడో తరం వారసుడు, తెహ్రిక్-ఎ-ఖుదాదాద్ జాతీయ అధ్యక్షుడు సాహెబ్జాదా సయ్యద్ మన్సూర్ అలీ టిప్పు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశిష్ట అతిథిగా మహా ఆచార్య రవిశంకర్ గురూజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ మన్సూర్ అలీ టిప్పుకు షహీద్ టిప్పుసుల్తాన్ జాతీయ పురస్కారం--2026ను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవిశంకర్ గురూజీ, సయ్యద్ మన్సూర్ అలీ టిప్పు మాట్లాడుతూ, మాతృభూమిని బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేయడానికి టిప్పుసుల్తాన్ రాజీలేని పోరాటం సాగించారని గుర్తుచేశారు. హిందూ ముస్లిం ఐక్యతకు ఆయన ప్రాధాన్యత ఇచ్చారని, శృంగేరి శారదా మాత పీఠాన్ని రక్షించి పునఃప్రతిష్ఠకు సహకరించారని తెలిపారు. వందలాది దేవాలయాలకు సహాయ నహకారాలు అందించడంతో పాటు దేవాలయాలకు వేలాది ఎకరాల భూములను కేటాయించారని పేర్కొన్నారు. మతసామరస్యం, పరమత సహనం, సోదరభావం, వసుధైక కుటుంబ భావన వంటి విలువలకు ఆయన జీవితం నిదర్శనమన్నారు. నేటి సమాజంలో మతాల మధ్య ఐక్యతను కాపాడుకుంటూ భారతదేశ అభివృద్ధి, జాతీయ సమైక్యత, దేశ సుస్థిరత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జేవీ అనిల్ కుమార్, డీఈ రమేష్ కుమార్, చేనేత కార్మిక నాయకుడు ఏసీ నాగరాజు, క్రైస్తవ సంఘం పెద్దలు నాగేంద్ర కుమార్, సిక్కు సంఘం పెద్దలు బల్వేందర్ సింగ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు జేవీకే రాము, గిరిజన సంఘం నాయకులు, సున్నీ జమాత్ మౌలానా షాబుద్దీన్, అహ్లే హదీస్ మౌలానాలు ఇస్మాయిల్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో 300 మంది విద్యార్థులు టిప్పుసుల్తాన్ వేషధారణ పోటీల్లో పాల్గొనగా, మరో 200 మంది వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం తదితర పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులను అతిథులు అభినందించి పురస్కారాలు అందజేశారు.

మహిళా సంఘాల బలోపేతానికి సమష్టి కృషి చేయాలి

-సభ్యులకు సూచనలు, మార్గదర్శకాలు అందించిన డి ఎం సి గంగులయ్య

ప్రజాభూమి, హిందూపురం టౌన్



మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ, వాటి అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని అధికారులు సూచించారు. హిందూపురం పట్టణ పరిధిలోని మేళాపురం వెన్నెల మురికివాడ స్థాయి సమాఖ్య కార్యవర్గ సభ్యుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యకలాపాలు, మహిళా సంఘాల అభివృద్ధి, సభ్యుల భాగస్వామ్యం, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి సిఓ నాగేంద్ర సభ్యులకు పలు సూచనలు, మార్గదర్శకాలు అందించారు. మహిళా సంఘాల ద్వారా సభ్యులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేలా కృషి చేయాలని సూచించారు. సంఘాల కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సభ్యులందరిని భాగస్వాములను చేయాలని తెలిపారు. మహిళా సంఘాల ఐక్యత, సమష్టి కృషితో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
ఆదివారం 22 నవంబరు 2026

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్కౌటింగ్ దోహదం

- యూనిట్ లీడర్లు రోల్ మోడల్స్‌గా ఎదగాలి,


- స్కౌట్ మాస్టర్ల శిక్షణా శిబిరాన్ని సందర్శించిన ఏపీసీ డాక్టర్ అనురాధ

ప్రజాభూమి, మదనపల్లె



విద్యార్థులను క్రమశిక్షణ కలిగిన, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలక పాత్ర పోషిస్తోందని సమగ్ర శిక్ష అన్నమయ్య జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) డాక్టర్ అనురాధ పేర్కొన్నారు. మదనపల్లె లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో అన్నమయ్య జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో స్కౌట్ మాస్టర్లకు నిర్వహిస్తున్న బేసిక్, అడ్వాన్స్‌డ్ శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. శిక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స, వివిధ రకాల బ్యాండేజీలు కట్టడం, తాళ్లతో వివిధ రకాల ముడులు వేయడం, పయోనీరింగ్ నిర్మాణాలు తదితర ప్రాక్టికల్ శిక్షణా కార్యక్రమా లను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనురాధ మాట్లాడుతూ స్కౌట్ మాస్టర్లు, యూనిట్ లీడర్లు విద్యార్థులకు ఆదర్శంగా నిలిచేలా రోల్ మోడల్స్‌గా ఎదగాలని సూచించారు. స్కౌటింగ్ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, సమయపాలన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం పెంపొందుతాయని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ, మరింత మంది విద్యార్థులను స్కౌటింగ్ ఉద్యమంలో భాగస్వాములను చేయాలని ఆమె సూచించారు. విద్యార్థుల సర్వతోము ఖాభివృద్ధికి స్కౌటింగ్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, లీడర్ ట్రైనర్లు కమల్ కన్నన్, కొలిశెట్టి శివప్రసాద్, వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ చంద్రశేఖర్, జిల్లా హెడ్‌క్వార్టర్స్ కమిషనర్ హర్షవర్ధన్ రెడ్డి, రిసోర్స్ పర్సన్లు మోహన్ బాబు, ప్రసాద్, మహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్మన్ పుత్తా నరసింహారెడ్డికి అభినందనలు...



ప్రజాభూమి, కడప

కడప జిల్లా పరిషత్ చైర్మన్‌గా పుత్తా నరసింహారెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కడపలోని బిల్డప్ సమీపంలోని ఆయన కార్యాలయంలో కడప అసెంబ్లీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి వి.ఎస్. అమీర్ బాబు మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పుత్తా నరసింహారెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వి.ఎస్. అమీర్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పుత్తా నరసింహారెడ్డిని జిల్లా పరిషత్ చైర్మన్‌గా నియమించడం శుభపరిణామమని అన్నారు. ఆయన నాయకత్వంలో జిల్లాలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు, పార్టీ శ్రేణులకు ఆయన సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా సీనియర్ నాయకులు ఆమూరి బాలదాసు, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అఫ్రఖ్ అలీఖాన్, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి సి.ఎస్. నాసర్ అలీ తదితరులు పాల్గొని పుత్తా నరసింహారెడ్డిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

బ్రహ్మంగారిమఠం జడ్పీటిసిగా ప్రమాణ స్వీకారం చేసిన నాగిపోగు పుల్లయ్య



ప్రజాభూమి, బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం మండలం తెలుగుదేశం పార్టీ జడ్పీటిసి నుంచి పోటీ చేసి గెలిచిన నాగిపోగు పుల్లయ్య నేడు కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి జెడ్పీటిసి సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అందులో భాగంగా బ్రహ్మంగారిమఠం మండల కేంద్రం నుంచి జెడ్పీటిసిగా నాగిపోగు పుల్లయ్య జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు.ఈ క్రమంలో కడప జిల్లా పరిషత్ కార్యాల యంలో నిర్వహించిన జిల్లా పరిషత్ చైర్మన్ ,వైస్ చైర్మన్ జెడ్పీటిసి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్ర మంలో మైదుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్, బ్రహ్మం గారిమఠం తెలు గుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముడుమాల పోలిరెడ్డి ఎస్సార్ శ్రీనివాసుల రెడ్డి, మాజీ మండల పరిషత్ ప్రెసిడెంట్ చిలేకాంపల్లె వీరనారాయణ రెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ యల్లటూరు సాంబశివారెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో ఎస్సీ సామాజిక వర్గం నుంచి నాగిపోగు పుల్లయ్య జెడ్పీటిసిగా ఎన్నిక కావడం ఎంత గర్వకారణం అని అలాగే చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేయాలని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని వారు ఆకాంక్షించారు. అనంతరం జడ్పీటిసి నాగిపోగు పుల్లయ్య మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ వారికి ప్రత్యేక హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మండలంలోని ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ప్రజాప్రతినిధులు,అధికారుల సమయంతో మెరుగైన పాలన అందిస్తానని వారు తెలిపారు. అలాగే నాకు అప్పగించిన ఈ కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జున్ రెడ్డి, తెదేపా నాయకులు పూజ శివ యాదవ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడిపి మండల మైనార్టీ కన్వీనర్ పదవికి తెలంగాణ వలి రాజీనామా

- కష్టపడిన కార్యకర్తలకు సముచిత గుర్తింపు లేదు



ప్రజాభూమి, వేంపల్లె

టిడిపి మండల మైనార్టీ కన్వీనర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలంగాణ వలి ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, సముచిత స్థానం కల్పించకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శనివారం స్థానిక పట్టణంలో విలేకరుల సమావేశంలో తెలంగాణ వలి మాట్లాడుతూ.. టిడిపి ఆవిర్భావం నుంచి ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా పార్టీనే నమ్ముకుని పనిచేస్తున్న తనకు తగిన గుర్తింపు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు సముచిత గుర్తింపు లేదని, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికి తగిన పదవులు, బాధ్యతలు అప్పగించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యున్నతి కోసం శ్రమించిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించకపోవడం తనను బాధించిందని పేర్కొన్నారు. అయితే పదవికి రాజీనామా చేసినప్పటికీ తెలుగు దేశం పార్టీకి దూరం కాబోనని తెలంగాణ వలి స్పష్టం చేశారు. టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి, మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో పార్టీలోనే కొనసాగుతూ కార్యకర్తగా టిడిపి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పదవులు ఉన్నా లేకపోయినా పార్టీ కోసం పనిచేస్తానని తెలంగాణ వలి పేర్కొన్నారు.

ప్రైవేటు పాఠశాలలో క్షుద్రపూజల కలకలం

- వైఎస్సార్ కడప జిల్లా బద్వేలులో ఘటన



ప్రజాభూమి, కడప

వైఎస్సార్ కడప జిల్లా బద్వేలులోని సుందరయ్య కాలనీలో ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహిస్తున్న క్షుద్రపూజల వ్యవహారం స్థానికంగా కలకలం రేపింది. దీన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి పాఠశాల యాజమాన్యాన్ని, మాంత్రికుడిని నిలదీయడంతో మాంత్రికుడితో పాటు ఆ విద్యాసంస్థ నిర్వాహకుడు పరారయ్యారు. శుక్రవారం దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. బద్వేలుకు చెందిన ఓ వ్యక్తి స్థలాన్ని లీజుకు తీసుకుని ఐదేళ్లుగా పాఠశాలను నిర్వహిస్తున్నారు. నెలరోజులుగా ఓ మాంత్రికుడిని పాఠశాలకు రప్పించి గుప్తనిధుల కోసం క్షుద్రపూజలు చేయిస్తున్నారు. కొందరు విద్యార్థుల ఫొటోలు, తలవెంట్రుకలను ఇందుకోసం సేకరించారు. పాఠశాలలోని ఆఫీసు గది తలుపులు మూసి రాత్రి సమయంలో క్షుద్రపూజలు చేసేవారు. ఆపై తవ్వకాలు చేపడుతుండగా.. వారం రోజుల క్రితం కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. ఈ స్థలం కొన్నామని, మరుగుదొడ్ల నిర్మాణానికి గుంత తీస్తున్నట్లు పాఠశాల నిర్వాహకుడు నమ్మబలికారు. అనుమానం వచ్చి కొందరు తల్లిదండ్రులు గురువారం అర్ధరాత్రి పరిశీలించారు. అక్కడ విద్యార్థుల తలవెంట్రుకలు, నిమ్మకాయలు, మాంసం, మద్యం తదితరాలను చూసి ఆందోళన చెందారు. క్షుద్రపూజల వ్యవహారంపై ఎంఈవో చిన్నయ్య విచారణ చేపట్టారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని, ఈ వ్యవహారంపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు.

శాంసన్‌ను పరామర్శించిన నగర మహిళా విభాగం అధ్యక్షురాలు దీప్తి



ప్రజాభూమి, కడప

మున్సిపల్ కార్పొరేషన్ నామినేషన్ల సందర్భంగా జరిగిన దాడిలో గాయపడి, మోకాలికి శస్త్రచికిత్స చేయించుకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శాంసన్‌ను కడప నగర మహిళా విభాగం అధ్యక్షురాలు బండి దీప్తి శనివారం పరామర్శించారు. నగరంలోని ఎంఎం ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న శాంసన్‌ను ఆమె స్వయంగా కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి ఆయనకు అందిస్తున్న వైద్య చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బండి దీప్తి మాట్లాడుతూ, దాడిలో గాయపడిన శాంసన్ త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఈ కష్ట సమయంలో పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు



ప్రజాభూమి, కడప

యూపీహెచ్‌సీ అక్కాయపల్లె-4 వరిధిలోని నున్నవుబట్టిలు అంగన్‌వాడీ కేంద్రం-1లో నిర్వహించిన ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా పి. యుగంధర్, జిల్లా ఇమ్యునై జేషన్ అధికారి డా ప్రవీణ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మునిరెడ్డి సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గర్భిణీ మహిళలు, చిన్నారులకు టీకాలు వేయించేందుకు వచ్చిన తల్లులతో అధికారులు మాట్లాడి, వారికి అందుతున్న టీకా సేవలు, మాతా శిశు ఆరోగ్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు మాతా శిశు ఆరోగ్యానికి సంబంధించిన నాలుగు ముఖ్య సందేశాలు, కిట్ల వినియోగం, ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్ పంపిణీ, వినియోగంపై పలు సూచనలు చేశారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులు సూచించారు.

చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు

- జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



ప్రజాభూమి, మదనపల్లి

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్దపోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ అక్రమ మద్యం, డబ్బు రవాణాను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి నేతృత్వంలో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఎన్నికల వేళ అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టేందుకు జిల్లాలోకి వచ్చే, వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు వాహనదారులు సరైన పత్రాలతో ప్రయాణిస్తూ పోలీసు తనిఖీలకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా అక్రమ రవాణా లేదా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం...



ప్రజాభూమి, కడప

జిల్లా కోర్టు ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ పాల్గొని, కోర్టు ప్రాంగణంలో పరిశుభ్రత మరియు పచ్చదనం పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారు కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని, మొక్కల సంరక్షణ మరియు పచ్చదనం పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యకరమైన సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. కోర్టు ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, పచ్చదనాన్ని కాపాడుకోవాలని కోర్టు సిబ్బందికి సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారితో పాటు న్యాయమూర్తులు మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు...

విద్యార్థులకు బహుమతుల ప్రదానం...



ప్రజాభూమి, కడప

జాతీయ న్యాయ సేవాధికార దినోత్సవాన్ని పురస్కరించుకొని గతంలో నిర్వహించిన వ్యాసరచన మరియు వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసేందుకు జిల్లా కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రామ గోపాల్ పాల్గొని, యోగి వేమన విశ్వవిద్యాలయం, కేవీఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల, బసవతారకం కళాశాల మరియు బసిరెడ్డి న్యాయ కళాశాల విద్యార్థులకు న్యాయ విజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు మరియు పౌరుల బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. యువత చట్టాలపై అవగాహన పెంపొందించుకొని సమాజంలో న్యాయం, సమానత్వం మరియు చట్టబద్ధమైన విలువలను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరంగతంలో నిర్వహించిన వ్యాసరచన మరియు వక్తృత్వ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు డీఎల్ఎస్ఏ చైర్మన్ జి.రామ గోపాల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లాన్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి-కం-సీనియర్ సివిల్ జడ్జి గౌరవ షేక్ బాబా ఫక్రుద్దీన్ ఆయా కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికి పూర్తి టీకాలు వేయించాలి- డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్



ప్రజాభూమి, కడప అర్బన్

ప్రతి చిన్నారికి నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం అన్ని వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయిం చాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. శనివారం కడప పట్టణంలోని సున్నపుబట్టీల-1 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీకాల కోసం వచ్చిన తల్లులు, గర్భిణులతో మాట్లాడారు. టీకాల ద్వారా పోలియో, క్షయ, కోరింత దగ్గు, ధనుర్వాతం, మీజిల్స్, రుబెల్లా, న్యుమోనియా, మెనింజైటిస్ తదితర ప్రమాదకర వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించవచ్చన్నారు. గర్భిణులు వైద్యుల సూచనల మేరకు అవసరమైన పరీక్షలు చేయించుకుని, టీకాలను సకాలంలో తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ టీకాలు తీసుకోవాల్సిన చిన్నారుల వివరాలతో డ్యూ లిస్టు సిద్ధం చేయాలని ఆదేశించారు. టీకాల తేదీని ముందుగానే ఆశా కార్యకర్తల ద్వారా తల్లిదండ్రులకు తెలియజేసి, అందరూ కేంద్రాలకు వచ్చేలా చూడాలన్నారు. మాతా శిశు సంరక్షణ కార్డుల్లో టీకాల వివరాలు నమోదు చేయడంతోపాటు ఆర్‌సీహెచ్, యూ-విన్ పోర్టళ్లలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. టీకాలు పొందని చిన్నారులను గుర్తించి వెంటనే టీకాలు వేయించాలన్నారు. తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి ఎన్ఆర్‌సీ కేంద్రాలకు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సీహెచ్ఓ మునిరెడ్డి, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 10

ఆదివారం 22 నవంబర్ 2026

మోడరన్ జూనియర్ కాలేజీలో స్ఫూర్తిదాయకంగా కెరీర్ గైడెన్స్ కార్యక్రమం

ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం.

రామచంద్రపురం జి.ఆర్.సి. మోడరన్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు శనివారం మోడరన్ కాలేజి ప్రాంగణంలో కెరియర్ గైడెన్స్ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. కాకినాడకు చెందిన జేఎన్టీయూ ఫార్మర్ వైస్ ఛాన్సలర్, ప్రముఖ ప్రొఫెసర్ డాక్టర్ కె.వి.ఎస్.జి మురళీకృష్ణ విద్యార్థులకు అనేక స్ఫూర్తిదాయక విషయాలను ఆసక్తికరంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన చారిత్రాత్మక, వైజ్ఞానిక, భౌగోళిక అంశాలను ఆకట్టుకునే రీతిలో విద్యార్థులకు బోధించారు. గణితంలో పలు మెలకువలు విద్యార్థులకు నేర్పించారు. పట్టుదలతో శ్రమిస్తే అసాధ్యం కూడా సుసాధ్యమవుతుందని విద్యార్థులకు ప్రేరణాత్మక భావన కలిగించారు. మాతృభాష మూలాలు మర్చిపోకుండా ఇతర భాషలలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. సమయాన్ని



సద్వినియోగం చేసుకుంటే అద్భుతమైన విజయాలు సాధించవచ్చని హితవు పలికారు. వ్యక్తిగత విజయమే లక్ష్యంగా కాకుండా సమాజ హితం కూడా కోరుకోవాలని పర్యావరణ పరిరక్షణ,దేశ ప్రగతిలో నేటి యువత కీలక భూమిక పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మురళీకృష్ణను మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి. రావు, ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సి.హెచ్.రాజేష్ మర్యాదపూర్వకంగా సత్కరించారు. ప్రొఫెసర్ మురళీకృష్ణ నేటి యువతకు గొప్ప మార్గదర్శకత్వం కలుగజేస్తున్నారని రావు అభినందించారు. విద్యార్థులకు నూతన ఉత్తేజం కలుగజేసేలా మురళీకృష్ణ చేస్తున్న రచనలు గొప్ప స్ఫూర్తిదాయకమని రావు కొనియాడారు.



ఆత్రేయపురం మండల ఐక్య క్రిస్మస్‌కు జడ్పీటీసీకి ఆహ్వానం

- శాలువా, పూలమాలతో సత్కారం

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఆత్రేయపురం జడ్పీటీసీ గూడపాటి శ్రీనివాసరావును మండల పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు శనివారం ర్యాలి గ్రామంలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఫెలోషిప్ గౌరవాధ్యక్షుడు వజ్రకుమార్ ఆధ్వర్యంలో శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డిసెంబరు 4న వద్దిపర్రులో నిర్వహించనున్న మండల ఐక్య క్రిస్మస్ వేడుకలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ మండల అధ్యక్షుడు షాలెంరాజు, గమానియేలు, పాముల ఏసన్న, కప్పల ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సర్పంచ్ ఎన్నికల నామినేషన్లు



ప్రజాభూమి ప్రతినిధి – చాట్రాయి

ఏలూరు జిల్లా లో నూజివీడు నియోజకవర్గం లో మూడో విడత సర్పంచ్, వార్డు నెంబర్ల ఎన్నికల నామినేషన్లు శనివారం ప్రారంభమైనాయి. ఈ నామినేషన్ లో ఇప్పటి వరకు చాట్రాయి మండలంలో 18 గ్రామ సర్పంచి అభ్యర్థులు, 65 వార్డు మెంబర్ల నామినేషన్లు వేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ తెలిపారు. చాట్రాయి గ్రామంలో గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి గడ్డం ప్రభాకర్ రెడ్డి, సర్పంచి అభ్యర్థిగా నామినేషన్ వేయడం జరిగింది. కాగా జనసేన స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికలు బరిలో నిలబడటం చర్చాల్సిన విధంగా మారింది. చాట్రాయి గ్రామంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి గడ్డం ప్రభాకర్ రెడ్డిని ఢీకొట్టాలని ఉద్దేశంతో వైసిపి పార్టీ బలపరిచిన అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ రెడ్డి చాట్రాయి సర్పంచి పదవిని కైవసం చేసుకోవాలని పట్టుదలతో ఉన్నట్లు విశ్వాసనీయ వర్గాల ద్వారా తెలుస్తుంది. ఈ ఎన్నికలలో అధికార పార్టీ అభ్యర్థి గెలుస్తాడా లేక వైసీపీ అభ్యర్థి గెలుస్తాడనేటువంటి ప్రజలలో, ఓటర్లలో ఉత్కంఠ తో ఎదురుచూస్తూ ఉన్నారు. దీనికి తోడు జనసేన పార్టీని గుర్తించలేదని మాకు అవకాశం ఇవ్వలేదని సర్పంచ్ ఎన్నికలు పోటీలో నిలవడం గమనహార్హం ఎవరు పోటీలను ఇస్తారు ఎవరు విజయం సాధిస్తారు ప్రజలే నిర్ణయిస్తారని వివిధ వర్గాల కుచెందిన ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారు.

రావులపాలెంలో సర్పంచ్ పోరు రసవత్తరం!

- ఇద్దరు నేతల నామినేషన్లతో రాజకీయ ఉత్కంఠ..
- చివరి రోజు ముగిసిన గడువు.



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

రావులపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కూటమి తరఫున ఎవరిని బరిలోకి దింపాలనే అంశం ఇంకా కొలిక్కి రాలేదు. కూటమి మద్దతు కోసం ఇద్దరు నేతలు పోటీ పడుతుండటంతో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. చర్చలు ఫలించకపోవడంతో ఇద్దరూ నామినేషన్లు దాఖలు చేశారు. కొత్తపేట నియోజకవర్గంలోని 57 గ్రామ పంచాయతీల్లో అత్యధికంగా 21,463 మంది ఓటర్లు, 20 వార్డులు కలిగిన రావులపాలెం పంచాయతీ ఎన్నికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పట్టణ స్థాయిలో విస్తరించిన ఈ పంచాయతీ భవిష్యత్తులో మున్సిపాలిటీగా మారే అవకాశం ఉందనే ప్రచారం నేపథ్యంలో ఈ ఎన్నిక ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన పట్టున్న రావులపాలెంలో ఇటీవల జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో కూటమి ఆరు ఎంపీటీసీ స్థానాలనూ గెలుచుకోవడం రాజకీయంగా కీలక పరిణామంగా నిలిచింది. దీంతో బీసీ జనరల్‌కు కేటాయించిన సర్పంచ్ స్థానంపై కూటమి ప్రత్యేక దృష్టి సారించింది. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి కూటమి తరఫున మాజీ వార్డు సభ్యుడు కోట సోమేశ్వరరావు (సోమేష్), వైసీపీ తరఫున మాజీ జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అయితే మండల పరిషత్ ఎన్నికల ఫలితాల అనంతరం రాజకీయ పరిణామాలు మారాయి. వైసీపీ మద్దతుతో పోటీ చేస్తారని భావించిన కుడుపూడి శ్రీనివాసరావు ఈ నెల 18న టీడీపీలో చేరడం అనూహ్య పరిణామంగా మారింది. దీంతో కూటమి అభ్యర్థిత్వం కోసం కోట సోమేశ్వరరావు, కుడుపూడి శ్రీనివాసరావు ఇద్దరూ ప్రయత్నించడంతో నాయకులకు అభ్యర్థి ఎంపిక సవాల్‌గా మారింది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు స్థానిక నాయకులు కె.వి. సత్యనారాయణరెడ్డి, చిలువూరి సతీష్‌రాజు, ఆకుల రామకృష్ణ తదితరులు మూడు రోజులుగా చర్చలు జరిపినా ఏకాభిప్రాయం కుదరలేదు. నామినేషన్ల గడువు శుక్రవారంతో ముగియడంతో ఇద్దరూ తమ నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో కూటమి తరఫున చివరకు ఎవరు బరిలో నిలుస్తారన్న ఉత్కంఠ కొనసాగుతోంది. పార్టీ మారిన కుడుపూడి శ్రీనివాసరావుకు కూటమి మద్దతు లభిస్తుందా? లేక కోట సోమేశ్వరరావుకే అవకాశం దక్కుతుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది. ప్రస్తుతం కోట సోమేశ్వరరావు వైపు నాయకత్వం మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు కుడుపూడి శ్రీనివాసరావు టీడీపీలో చేరడంతో వైసీపీ అప్రమత్తమై మాజీ వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్‌తో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయించింది. రావులపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి మొత్తం తొమ్మిది మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

దీపాల వెలుగుల్లో దివ్యక్షేత్రం..

భక్తి సేవలో బాలాజీ భక్తులు!

- షీలా నగర్ శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనం..
- విశేష పూజలు, దీపారాధన, విష్ణు సహస్రనామ పారాయణం..
- అన్న సమారాధనతో భక్తులకు అన్నప్రసాద వితరణ

ప్రజా భూమి ప్రతినిధి



తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని షీలా నగర్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిర్వహించిన ఆధ్యాత్మిక వేడుకలు భక్తిభావంతో వైభవంగా సాగాయి. ఏకాదశి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, పుష్పాలంకరణలు, దీపారాధన, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించగా, నేడు అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టి భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో సందడిగా మారి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారిని సుందరమైన పుష్పాలతో అలంకరించి ప్రత్యేక అర్చనలు, హారతులు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దివ్య అలంకరణలో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం భక్తులకు కనుల పండువగా నిలిచింది. స్వామివారి సన్నిధిలో భక్తులు దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తూ తమ మొక్కులు చెల్లించుకున్నారు. దీపాల వెలుగులు, పుష్పాల పరిమళాలు, భక్తుల నామస్మరణతో ఆలయమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. భక్తులు భక్తిభావంతో శ్రీ మహావిష్ణువు పవిత్ర నామాలను స్మరిస్తూ పారాయణంలో పాల్గొన్నారు. విష్ణు సహస్రనామ పారాయణంతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారగా, ప్రత్యేక పూజలు, దీపారాధన భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామివారి దివ్య దర్శనం భక్తులకు ప్రశాంతతను, ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించింది. ఏకాదశి వేడుకల్లో భాగంగా నేడు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందించారు. అన్నదానం మహాదానమనే పవిత్ర భావనతో భక్తులకు ప్రేమాభిమానాలతో భోజనాలు వడ్డించారు. పలువురు భక్తులు సేవాభావంతో అన్న సమారాధనలో పాల్గొని తమ వంతు సేవలందించారు. భక్తులకు అన్నప్రసాదం అందించే కార్యక్రమం ఆధ్యాత్మిక సేవకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

షీలా నగర్ శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిర్వహించిన తొలి ఏకాదశి వేడుకలు విశేష పూజలు, దీపారాధన, విష్ణు సహస్రనామ పారాయణం, అన్న సమారాధనతో భక్తి, సేవాభావం, ధార్మికతను చాటాయి. ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులకు విశేష ఆనందాన్ని పంచుతూ స్వామివారి వైభవాన్ని చాటిచెప్పింది.

అవకాశం ఇస్తే... అభివృద్ధి చేసి చూపిస్తా

- ఒకే ఇంటి పేరుతో మంజేరులో ఇద్దరు మహిళామణులు మధ్య ఆసక్తికర పోరు
- గ్రామస్తుల మద్దత్తుతో కాజులూరు సర్పంచ్ బరిలో సత్య మంగాదేవి.
- త్రాగునీరు, వైద్యం, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత
- పవన్ సిద్ధాంతాలతో గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా : సర్పంచ్ అభ్యర్థిని సత్యమంగాదేవి

ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు



కాజులూరు మండలం మంజేరు గ్రామ పంచాయితీ సర్పంచ్ గిరికి ఎన్నికలబరిలో జన సేనకు సంబంధించిన ఇద్దరు ఒకే ఇంటిపేరు గల జనసైనిక మహిళా మణులు మధ్య ఆసక్తికరంగా పోరు జరగనుందని మంజేరు గ్రామంలో గ్రామంలో ప్రచారం జోరందుకుంది. నామినేషన్ల ఘట్టం ముగిసిన నేపథ్యంలో ఇక్కడ గ్రామంలోని ఓటర్లను ఆకట్టుకునేందుకు సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు ఆ ఇద్దరు అభ్యర్థులు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి నాయకులు, గ్రామస్తుల మద్దత్తుతో సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచి తన అనుచరులతో గ్రామంలో ఓటర్లను ఆకర్షించేందుకు ఇంటింటికి తిరిగి తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతూ ప్రచారం కొనసాగిస్తున్నారు. ఈ పంచాయతీ సర్పంచ్ పదవికి జనరల్ కేటగిరీలో మహిళలకు కేటాయించిన నేపథ్యంలో ప్రస్తుతం నామినేషన్లు ఘట్టం పూర్తి కావడంతో ఇద్దరు అభ్యర్థులు గ్రామంలో తమ తమ వ్యూహాలు సిద్ధం చేసుకుని ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రచారం: మంగాదేవి

సర్పంచ్ పదవికి బరిలోకి ఉన్న గండి సత్యమంగాదేవి గ్రామాభివృద్ధే లక్ష్యంగా తన అనుచరులతో ప్రచారం కొనసాగిస్తూ ఓటర్ల ముందుకు వెళ్లి తనకు ఒక్క అవకాశం ఇస్తే గ్రామాభివృద్ధి చేసి చూపిస్తానని ముఖ్యంగా త్రాగునీరు, డ్రైనేజీ సమస్య, వైద్యం వంటి ప్రధాన అంశాలతో పాటు మంజూరు గ్రామానికి ఏపీఎస్ఆర్టీసీ సౌకర్యాన్ని సైతం కలుగజేసి శ్రీశక్తి పథకాన్ని మహిళలకు అందజేస్తానని హామీ ఇస్తూ ముందుకు సాగుతున్నారు. అలాగే మంగాదేవి భర్త శ్రీనివాస్ పాపారావు మాట్లాడుతూ తన తండ్రి హయాంలో గ్రామంలో మంచినీటి సౌకర్యం కోసం ట్యాంకు కట్టేందుకు సరైన స్థలము లేకపోవడంతో తన తాత పేరు మీద 20 సెంట్లు భూమిని త్రాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్ కోసం ఇవ్వడం జరిగిందని అయితే ఆశించిన మేరకు త్రాగునీరు సరఫరా జరగడంలేదని, శివారు ప్రాంతాలకు నీరు వెళ్ళటం లేదని తన భార్యను గెలిపిస్తే ప్రధానంగా నిత్యం అందుబాటులో ఉంటూ గ్రామంలో సమస్యల పరిష్కారానికి మంత్రి సుభాష్ సహకారంతో తన వంతు సహకారం చేస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని సందర్భంగా హామీ ఇచ్చారు మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు తో పాటు మంజేరు గ్రామంలో వంతెన నిర్మాణం కోసం తన తండ్రి నాడు పోషించిన పాత్రను గుర్తు చేశారు. ఏది ఏమైనా మంజేరు గ్రామంలో ఒకే ఇంటి పేరుతో గల ఇద్దరు మహిళా మణులు మధ్య సర్పంచ్ పదవికి పోరు ఆసక్తికరంగా మారనుంది

పార్టీ రహిత పంచాయతీ ఎన్నికలకు రాజకీయ రంగు ...!

- సర్పంచ్, వార్డు స్థానాలకు పార్టీ అభ్యర్థులుగా ప్రచారం
- నిబంధనలు అమలు చేయడంలో అధికారుల తీరు ప్రశ్నార్థకం
- పోటీలో ఉన్న అభ్యర్థుల్లో గందరగోళం.
- నామినేషన్ వేసేందుకు పార్టీ జెండాలతో భారీ ర్యాలీలు.
- గ్రామాల్లోనూ పార్టీ జెండాలతో వింత ప్రచారం
- కూటమి పార్టీ అభ్యర్థుల్లోనే గందరగోళం పరిస్థితులు

ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం



గ్రామీణ ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలవాల్సిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీల నేతలు జోక్యం పెరుగుతోందనే విమర్శలు జోరు అందుకున్నాయి. పార్టీ గుర్తులకు, రాజకీయ పార్టీల ప్రమేయానికి అతీతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాల్సిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు రాజకీయ రంగు పులమడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల్లో కూటమి పార్టీకి చెందిన వ్యక్తులే అధిక సంఖ్యలో పోటీ పడటం అందులో ప్రధానంగా సర్పంచి పోటీలో ఉన్న ఒక అభ్యర్థికి పార్టీ నేతలు ఏకపక్షంగా సపోర్టు చేయడంతో మరో పక్క పోటీలో ఉన్న అభ్యర్థులు ఆయోమయానికి గురవుతున్నారు.ప్రస్తుతం నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. ఎన్నికల బరిలో నిలుస్తున్న అభ్యర్థులను ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులుగా పేర్కొంటూ మునుపు ఎన్నడూ లేని విధంగా ప్రకటించి ప్రచారం చేయడం గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇందుకు పార్టీ నేతలు సైతం పబ్లిక్ గా సపోర్ట్ చేయడంతో గ్రామాల్లో జోరుగా చర్చించు కుంటున్నారు.గతంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్నామని అభ్యర్థులు చెప్పుకుంటూ ప్రచారం చేసేవారు. అయితే ప్రస్తుతం పరిస్థితి ఇందుకు భిన్నంగా మారింది, నేరుగా ఫలానా పార్టీ అభ్యర్థిగా పేర్కొంటూ ప్రచారం సాగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల గ్రామస్థాయి ఎన్నికల్లోనూ పార్టీ రాజకీయాలు చొరబడటమే కాకుండా ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు, ఫ్లెక్సీలకు ముసుగులు వేసి నిబంధనలను అమలు చేస్తున్న ఎన్నికల అధికారులు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల పేరుతో జరుగుతున్న ప్రచారంపై ఎందుకు దృష్టి సారించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు పార్టీ గుర్తులతో జరగనప్పుడు అభ్యర్థులను రాజకీయ పార్టీలకు చెందిన వారిగా చిత్రీకరిస్తూ పార్టీ జెండాలతో నామినేషన్ లో సైతం దాఖలు చేయడంతో పాటు గ్రామాల్లో ప్రచారం చేయడంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజకీయ విశ్లేషకులు సైతం అంటున్నారు. గ్రామాల్లో వ్యక్తిగత పరిచయాలు, అభ్యర్థుల సేవాభావం, స్థానిక సమస్యల పరిష్కారం సామర్థ్యం ఆధారంగా ఓటర్లు తమ ప్రతినిధులను ఎన్నుకునే పరిస్థితులు ఉండాలని ప్రజాస్వామ్యవాదులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ పార్టీల ప్రభావం కారణంగా గ్రామస్థాయి ఎన్నికల్లో విభేదాలు, వర్గ పోరాటాలు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎన్నికల అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ప్రచారంపై పరిశీలన చేపట్టాలని పలువురు కోరుతున్నారు. పార్టీ అభ్యర్థులుగా ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలకు నిబంధనల మేరకు అడ్డుకట్ట వేసి, ప్రతి ఓటరు ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులుతో పాటు ఆయా గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు.


ప్రజాభూమి
పోలవరం
11
ఆదివారం 22 నవంబరు 2026

పోలవరం జిల్లాలో మూడు గిరిజన సూపర్ బజార్లలో ధరణి బియ్యం విక్రయాలు

- ఆధార్ లేదా రేషన్ కార్డు చూపించి 26 కేజీల బియ్యం బ్యాగు కొనుగోలు చేయవచ్చు
- ప్రస్తుతం కేఎన్ఎం / ఆర్ఎన్ఆర్ రకం బియ్యం కిలో రూ.50 చొప్పున విక్రయం
- త్వరలో బీపీటీ రకం సన్న బియ్యం కిలో రూ.49కు అందుబాటులోకి
- జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి - రంపచోడవరం

పోలవరం జిల్లా పరిధిలోని గిరిజన ప్రాంత ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందుబాటు ధరలో అందించేందుకు మూడు ప్రాంతాల్లోని గిరిజన సూపర్ బజార్ల ద్వారా ధరణి బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ తెలిపారు.ప్రస్తుతం కేఎన్ఎం / ఆర్ఎన్ఆర్ రకం సన్న బియ్యం 26 కేజీల బ్యాగు రూ.1,300 ధరకు, అంటే కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఒక కుటుంబానికి నెలకు ఒకసారి ఒక ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు చూపించి 26 కేజీల బియ్యం బ్యాగును కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించినట్లు వివరించారు. అదేవిధంగా బీపీటీ రకం సన్న బియ్యం 26 కేజీల బ్యాగు కిలో రూ.49 చొప్పున త్వరలో విక్రయాలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. జిల్లాలోని రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి ప్రాంతాల్లో గిరిజన సూపర్ బజార్ కేంద్రాల ద్వారా ఈ విక్రయాలు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు. రంపచోడవరం పట్టణంలోని ప్రధాన రహదారిలో అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్న గిరిజన సూపర్ బజార్‌లో, అడ్డతీగల గ్రామంలో సచివాలయం సమీపంలోని ప్రాథమిక వ్యవసాయ



సహకార సంఘం వద్ద, రాజవొమ్మంగి గ్రామంలో నర్సీపట్నం రోడ్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమీపంలోని గిరిజన సూపర్ బజార్ కేంద్రాల్లో ప్రస్తుతం కేఎన్ఎం / ఆర్ఎన్ఆర్ రకం ధరణి బియ్యం అందుబాటులో ఉన్నాయని తెలిపారు.గిరిజన ప్రాంత ప్రజలు తమకు సమీపంలోని ఈ మూడు విక్రయ కేంద్రాలను సందర్శించి ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు చూపించి 26 కేజీల కేఎన్ఎం / ఆర్ఎన్ఆర్ బియ్యం బ్యాగును కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ధరణి బియ్యం విక్రయాలకు సంబంధించి మరింత సమాచారం లేదా సందేహాల నివృత్తి కోసం పోలవరం జిల్లా నియంత్రణ కేంద్రం నంబరు 9494088922 కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు.అదేవిధంగా రాజవొమ్మంగి గిరిజన సూపర్ బజార్ విక్రయ కేంద్రానికి సంబంధించిన వివరాల కోసం ఎల్. ప్రమీలాదేవిని 9493068047 నంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.గిరిజన ప్రాంత ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యంతో పాటు అవసరమైన నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచేందుకు గిరిజన సూపర్ బజార్ల ద్వారా తగిన ఏర్పాట్లు చేసినట్లు జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ తెలిపారు.

రంపచోడవరం జిల్లా కేంద్రం పరిధిలో ఉన్న
మరో 8 గ్రామాలకు 16 శాతం హెచ్ఆర్ఏ వర్తింపు

- తద్వారా మొత్తం 35 గ్రామాల ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం
- ఆమేరకు చర్యలు తీసుకోవాలని డి డి వో లకు, ట్రెజరీ అధికారులను ఆదేశాలు జారీ
- పెంచినా హెచ్.ఆర్.ఎ., ఆర్థిక ప్రయోజనాలు 01.08.2026 నుంచి వర్తిస్థాయి
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి రంపచోడవరం

పోలవరం జిల్లా రంపచోడవరం జిల్లా కేంద్రం సరిహద్దు నుంచి 8 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో పనిచేస్తున్న అర్హులైన అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 16 శాతం చొప్పున పెంచిన ఇంటి అద్దె భత్యం వర్తింపజేస్తూ మరో 8 గ్రామాలను అదనంగా చేర్చినట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.గతంలో 27 గ్రామాలకు 16 శాతం హెచ్ ఆర్ ఎ ., సదుపాయాన్ని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, మరికొన్ని గ్రామాలు నిర్దేశిత 8 కిలోమీటర్ల పరిధిలో ఉన్నప్పటికీ జాబితాలో చేరలేదని సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ఉద్యోగులు చేసిన విజ్ఞప్తుల మేరకు అధికారులు పునఃపరిశీలన చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ మేరకు రంపచోడవరం ఆర్ అండ్ బి సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తహశీల్దార్ నిర్వహించిన ధ్రువీకరణ ఆధారంగా సమర్పించిన సవరించిన నివేదికను పరిశీలించిన అనంతరం మరో 8 గ్రామాలను అదనంగా జాబితాలో చేర్చినట్లు కలెక్టర్ వెల్లడించారు.



16% హెచ్ ఆర్ ఏ పరిధిలోకి చేర్చిన గ్రామాలు:

చైనా బరంగి, పందిరిమామిడి, చీడిపాలెం, చెరువుపాలెం, ముసురుమిల్లి, సోకులగూడెం, దూరగూడెం, పెద్ద బీరంపల్లి అని తెలిపారు. దీంతో అర్హత కలిగిన గ్రామాల సంఖ్య మొత్తం 35కు చేరిందని వివరించారు.కొత్తగా చేర్చిన ఈ 8 గ్రామాల్లో పనిచేస్తున్న అర్హులైన ప్రభుత్వ ఉద్యోగులకు కూడా 01.08.2026 నుంచి బేసిక్ పేలో 16 శాతం చొప్పున పెంచిన ఇంటి అద్దె భత్యం వర్తిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. గతంలో 19.09.2026న జారీ చేసిన ఉత్తర్వులను ఈ మేరకు సవరిస్తూ ఆదేశాలు జారీ చేశామని, హెచ్ఆర్ఏకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలు యథాతథంగా వర్తిస్తాయని పేర్కొన్నారు.సంబంధిత జిల్లా శాఖాధిపతులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు అర్హులైన ఉద్యోగులకు పెంచిన హెచ్ఆర్ఏ చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా ట్రెజరీ అధికారి, సంబంధిత అసిస్టెంట్ ట్రెజరీ అధికారులు, సబ్ ట్రెజరీ అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

పంచాయితీ నామినేషన్ ముగింపు ..

- రెండు పంచాయతీలు ఏకగ్రీవం.
- 16 పంచాయతీలకు 76 నామినేషన్ దాఖలు చేశారు..
- వార్డు అభ్యర్థులు 39 నామినేషన్ దాఖలు చేశారు..

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం..

మండలంలోని ఎన్నికల హడావిడి మొదలైంది శుక్రవారం రాత్రి 12 గంటల వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది 76 సర్పంచ్ నామినేషన్ దాఖలు కాక వార్డు నెంబర్లు 309 మంది నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. అందులో సర్పంచ్ రెండు నామినేషన్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి అందులో ఒకటి కుటూరు నుండి సిపిఎం అభ్యర్థి నుపా రాజు ఎన్నిక కాగా రెండు సోడే రాశి టేకుబాక టిడిపి అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు అలాగే వార్డు నెంబర్ లో 309 గాను రెండు నామినేషన్లను తిరస్కరించడం జరిగింది ప్రస్తుతం 307 వార్డు నెంబర్లు నామినేషన్లు ఖరారు అయ్యాయి నేటి నుండి అప్పిల్ ప్రక్రియ మొదలవుతుంది 24వ తేదీన అభ్యర్థుల ఉపసంహరణ కార్యక్రమం జరుగుతుంది అ తర్వాత ఎంతమంది అభ్యర్థులు పోటీలో ఉంటారో తెలుస్తుందని రిటర్నింగ్ అధికారి తెలియజేశారు.

రైతులు తప్పనిసరిగా ఏపీఎఫ్ఆర్ నమోదు చేయించుకోవాలి

వ్యవసాయ శిక్షణ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

అడ్డతీగల మండలం వేటమామిడి ఆర్ఎస్కేలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎరువుల పంపిణీ ఎఫ్ఎఫ్ఎస్ విధానం ద్వారా జరుగుతోందని తెలిపారు. భూమి కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా ఏపీఎఫ్ఆర్ విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా అమలయ్యే పథకాలన్నీ ఈ గుర్తింపు సంఖ్యతో అనుసంధానం కానున్నాయని స్పష్టం చేశారు.ఏపీ సీడ్స్ అండ్ ఆర్గానిక్ ఫార్మింగ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రాబిన్ మాట్లాడుతూ, జీడిమామిడి తోటల్లో అంతర పంటగా పైనాపిల్ సాగు చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. ఈ పంటకు కోతుల బెడద కూడా తక్కువగా ఉంటుందని వివరించారు.రాజవొమ్మంగి వ్యవసాయ




అధికారి చక్రధర్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో మరింత అవగాహన పెంపొందించాలని, రాబోయే తరాలకు విషరహిత ఆహారాన్ని అందించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్ లో పరిశీలించిన ఐటీడీఏ పీవో నరేంద్ర పడాల్

శివాలయం పుష్కర్ ఘాట్ గోదావరి హారతికి ప్రపోజల్.

ప్రజా భూమి ప్రతినిధి-కునవరం

రానున్న సంవత్సరం గోదావరి పుష్కరాలకు మండలంలోని నాలుగు పుష్కర ఘాటులను ఐటిడిఏ పిఓ నరేంద్ర పడాల్ పరిశీలించడం జరిగింది. అందులో భాగంగా స్థానిక శివాలయం దగ్గర ఉన్న పుష్కరఘాట్ ను గోదావరి హారతి ఇచ్చే విధంగా ప్రభుత్వం ప్రపోజల్ పంపుతున్నట్లు అలాగే దానికి నిధులు ఎంత కేటాయించాలి ఎలా చేయాలని సంబంధిత



ఇరిగేషన్ అధికారులకు ఎస్టిమేషన్ (ఎంత నిధులు కావాలి) పంపించండి అని వారికి తెలియజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ ధర్మేందర్ ఎంపీడీవో ఆశీర్వాదం డిప్యూటీ ఎంపీడీవో జగన్నాధ ఆశీర్వాదం వెంకట్రావు ట్రైబల్ వెల్ఫేర్ డిఈ జెఈ పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధే లక్ష్యం.. అధికారం కోసం కాదు.. మన ఊరి భవిష్యత్తు మార్పు కోసమే నా పోటీ

లక్కొండ సర్పంచ్ అభ్యర్థిగా అన్నిక కాంచన విజ్ఞప్తి

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం



గంగవరం మండలం లక్కొండ గ్రామ పంచాయతి అభివృద్ధే నా ప్రధాన లక్ష్యం పదవులు అధి కారం కోసం కాదు మన ఊరి భవిష్యత్తును మార్చాలనే సంకల్పంతోనే మీ ముందుకు వస్తున్నాను అని వైఎస్సార్‌సీపీ బలపరిచిన లక్కొండ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి అన్నిక కాంచన అన్నారు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు గ్రామ ప్రజల ఆశీస్సులు ఆదరణ కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన ప్రజా సమస్యల పరిష్కారం ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయడమే తన ఆశయమని తెలిపారు నేను మీలో ఒకరిగా మీ కుటుంబంలో సభ్యురాలిగా మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే మనిషిగా ఉంటాను మీ సమస్యలను నా సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేస్తాను మన గ్రామ అభివృద్ధికి మీ అందరి సహకారం అవసరం ఈ ఎన్ని కల్లో మీ అమూల్యమైన ఓటును నాకు వేసి అఖండ మెజారిటీతో గెలిపించి ప్రజాసేవకు అవకా శం కల్పించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను అని అన్నిక కాంచన గ్రామ ప్రజలను అభ్యర్థిం చారు మీ ఓటు మన ఊరి భవిష్యత్తుకు బాట మీ ఆశీస్సులు గ్రామ అభివృద్ధికి అండ అనే నినాదంతో ఆమె ప్రజలను ఆకట్టుకునేలా విజ్ఞప్తి చేశారు.

కూటూరు పంచాయతీలో రాజకీయ పార్టీల ఐక్యతకు నాంది మూడు పార్టీల ఏకగ్రీవ తీర్మానంతో సీపీఎం అభ్యర్థికి సర్పంచ్...

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం



కూటూరు గ్రామ పంచాయతీలో గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీడీపీ, వైసీపీ, సీపీఎం పార్టీలు ఐక్యంగా ఒక మంచి నిర్ణయం తీసుకున్నాయి. మూడు పార్టీల నాయకులు పరస్పర చర్చల అనంతరం ఏకగ్రీవ తీర్మానం చేసి సీపీఎం పార్టీ అభ్యర్థిని సర్పం చిగా ఎంపిక చేయడం హర్షణీయమని సీపీఎం పార్టీ మండల కమిటీ పేర్కొంది.కేవలం రాజకీయ పదవుల కోసం కాకుండా గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం వంటి సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతం గా ఐక్యంగా పనిచేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని తెలిపింది.ఈ సందర్భంగా కూటూరు పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలకు, టీడీపీ, వైసీపీ, సీపీఎం పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, రాజకీయ నాయకులకు సీపీఎం పార్టీ మండల కమిటీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కూటూరు పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని సీపీఎం పార్టీ మండల కమిటీ తెలియజేస్తోంది.

పీహెచ్‌సీ ఆసుపత్రిలో ఏబీ ఫౌండేషన్ సేవా కార్యక్రమం.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ..

నిరుపేదలకు అండగా ఏబి ఫౌండేషన్ - చైర్మన్ కుంజ అనిల్..



ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఏబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఫౌండేషన్ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా ఏబీ ఫౌండేషన్ చైర్మన్ కుంజ అనిల్ మాట్లాడుతూ.. నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా నిలవడమే ఏబీ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి శనివారం ఏదో ఒక రూపంలో, ఎక్కడో ఒకచోట పేదలకు సహాయం చేస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి సహాయం చేయాలనే సంకల్పంతో ఫౌండేషన్ ముందుకు సాగుతోందని, నిరుపేదలకు చేయూతనివ్వాలనే ఆలోచన ఉన్నవారు ఏబీ ఫౌండేషన్‌కు తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏబీ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కె. కిరణ్ బాబు, టి. వినోద్, జల్లారపు రాము, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక

- పర్యాటక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లాలో ప్రకృతి అందాలు, జలపాతాలు, నదీ పర్యాటకం, అటవీ ప్రాంతాలు, గిరిజన సంస్కృతి, సాహస పర్యాటక అవకాశాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తూ జిల్లాను రాష్ట్రంలోనే ప్రత్యేక పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం రంపచోడవరంలోని ఐటీడీఏ కార్యాలయ కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా పర్యాటక అభివృద్ధి కమిటీ (డిస్ట్రిక్ట్ టూరిజం డెవలప్‌మెంట్ కౌన్సిల్) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకుని పోలవరం పేరును పర్యాటక రంగంలో ప్రత్యేక బ్రాండ్‌గా నిలబెట్టాలని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం, భద్రాచలం మార్గాల ద్వారా పర్యాటకులు సులభంగా జిల్లాకు చేరుకునే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని వీకెండ్ టూరిజం ప్యాకేజీలను రూపొందించాలని సూచించారు. జిల్లాలోని ప్రధాన పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు అవసరమైన సమాచారం, విశ్రాంతి, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌లు వంటి సౌకర్యాలను ఒకేచోట అందించేలా జిల్లా ప్రవేశ మార్గంలో రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం కనీసం అర ఎకరం స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని, అక్కడ పర్యాటక సమాచార కేంద్రం, బుకింగ్ సదుపాయం, విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రంప జలపాతాలు, గుడిస, జలధార, జలతరంగిణి వంటి పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ



మూడు రోజుల సమగ్ర పర్యాటక ప్యాకేజీల రూపకల్పనను పరిశీలించాలని పేర్కొన్నారు. భద్రాచలం వైపు నుంచి జిల్లాలోకి ప్రవేశించే పోల్స్‌పేట ప్రాంతంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయ కళలు ప్రతిబింబించేలా ఆకర్షణీయమైన జిల్లా ప్రవేశ ఆర్చ్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా మూడు ప్రధాన జంక్షన్లలో పర్యాటక ప్రచారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, డిజిటల్ ప్రచార మాధ్యమాల ద్వారా పోలవరం జిల్లా పర్యాటక విశేషాలను దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా పర్యాటక అభివృద్ధికి కలెక్టర్ సూచించిన అంశాలను ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తూ, సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. పర్యాటక ప్రాంతాల విశేషాలను జిల్లా ప్రవేశ ఆర్చ్ వద్ద ప్రదర్శించేలా ప్రముఖ పర్యాటక ప్రదేశాల జాబితాను సిద్ధం చేయాలని, పర్యాటక ప్రాంతాల్లో స్థానిక సంస్కృతి, ప్రకృతి అందాలు ప్రతిబింబించేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తుమ్మిలేరు ప్రాంతంలో సన్‌సెట్ వ్యూ పాయింట్, తాత్కాలిక బోటింగ్, క్యాంపింగ్, గ్లాంపింగ్ వంటి పర్యాటక కార్యకలాపాలకు ఉన్న అవకాశాలను పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు.
ఈ సమావేశంలో పర్యాటక శాఖ ద్వారా శాటిలైట్ ఫోన్లు, పైలట్ బోట్లు, కంట్రోల్ రూమ్ వ్యవస్థలు, వెయిటింగ్ రూములు, వాష్‌రూములు తదితర ఎస్ఓపీ నిబంధనల ప్రకారం కల్పించాల్సిన సౌకర్యాలపై సమీక్షించారు. అడ్వెంచర్ టూరిజం కార్యకలాపాలకు సింగిల్ విండో విధానం ఏర్పాటు, పర్యాటక బ్రాండింగ్‌కు వెండర్ ఎంపిక, రిసెప్షన్ కేంద్రం, గోదావరి హారతి నిర్వహణ, కల్చరల్ పార్కుల అభివృద్ధి, పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నియంత్రణ వంటి అంశాలపై చర్చించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. తుమ్మిలేరు ప్రాంతంలో తాత్కాలిక పర్యాటక సదుపాయాల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రతిపాదనలు సమర్పించాలని, గోదావరి హారతి నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, నిధుల సమీకరణపై కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. పర్యాటక అభివృద్ధికి సంబంధించి శాఖల మధ్య నిరంతర సమన్వయం కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, వెబ్ ఎక్స్ ద్వారా రంపచోడవరం సబ్ కలెక్టర్ డి. పృథ్వీరాజ్ కుమార్, చింతూరు సబ్ కలెక్టర్ చిట్టపులి నరేంద్ర పడాల్, జిల్లా పర్యాటక అధికారి దాసు, అటవీ, సమాచార, రెవెన్యూ, పర్యాటక, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్

ఆదివారం, నవంబర్ 22, 2026

12

రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో మచిలీపట్నం 55 వ డివిజన్

కార్పొరేటర్ విమల గాయత్రికి ఘన సత్కారం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.. బుల్లెట్ ధర్మారావు



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:

మచిలీపట్నం నగరంలోని 55వ డివిజన్ కూటమి కార్పొరేటర్‌గా ఎన్నికైన పల్లావుజుల విమల గాయత్రిని రాధా రంగా మిత్రమండలి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షుడు, జనసేన నాయకుడు బుల్లెట్ ధర్మారావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రాధా రంగా మిత్రమండలి రాష్ట్ర కోశాధికారి పి.వి. ఫణి కుమార్ సతీమణి అయిన విమల గాయత్రికి శుభాకాంక్షలు తెలియజేసి, సన్మానించారు.ఈ సందర్భంగా బుల్లెట్ ధర్మారావు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని అన్నారు. దివంగత వంగవీటి మోహనరంగా ఆశయాల స్ఫూర్తితో ప్రజాసేవకు అంకితమై పనిచేయాల న్నారు. విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ ఎన్నికతో పాటు పలువురు కార్పొరేటర్ల విజయానికి, మచిలీపట్నం మేయర్‌గా డాక్టర్ హసీమ్ బేగ్ సతీమణి అబ్దుల్ అబీద ఎన్నికకు రాధా రంగా మిత్రమండలి తన వంతు కృషి చేసిందని పేర్కొన్నారు.రాధా రంగా మిత్రమండలి రాష్ట్ర కోశా ధి కారిగా పి.వి. ఫణికుమార్‌ను నియమించుకోవడం తమకు గర్వకారణమని ధర్మారావు అన్నారు. విమల గాయత్రి విజయానికి మిత్రమండలి మహిళా కార్యకర్తలు విశేషంగా కృషి చేశారని తెలిపారు.

మూడు ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి...55వ డివిజన్ పరిధిలో ఉన్న డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య భవనం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవనం, తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపానికి సంబంధించిన సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని బుల్లెట్ ధర్మారావు సూచించారు. కులమతాలకు అతీ తంగా ప్రజా అవసరాలకు పెద్దపీట వేస్తూ ఈ సమస్యల పరిష్కారానికి పి.వి. ఫణి కుమార్, విమల గాయత్రికి తమ మిత్ర మండలి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం...పి.వి. ఫణికుమార్, కార్పొరేటర్ విమల గాయత్రి మాట్లా డుతూ.. తమపై నమ్మకంతో గెలిపించిన డివిజన్ ప్రజలకు, రాధా రంగా మిత్రమండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బుల్లెట్ ధర్మారావు సూచించిన మూడు అంశాల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమను ఘనంగా సత్కరించిన బుల్లెట్ ధర్మారావుకు, కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.తమ ఎన్నికకు సహకరించిన మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, కొనకళ్ల నారాయణరావు, గోపీచంద్‌తో పాటు కూటమి నాయకులంద రికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, సూరిశెట్టి హరికృష్ణ, మత్తి వెంకటేశ్వరరావు, విన్నకోట సుబ్బారావు, వన్నెంరెడ్డి ప్రసాదు, బడుగు ఉమాదేవి, ముంగండ బాలకుమారి, జూపూడి శాంతకుమారి, అమ్ముల కళ్యాణి, ఎడ్ల అప్పాయమ్మ, మట్ట దత్తుడు, నిడదవోలు శ్రీనివాసరావు, వెన్న నాగ పణిరాజ్, పద్మనాభుని శేఖర్, జరుగు వెంకట సుబ్బారావు, తోట బుజ్జి, ఇంటి రామారావు, అనభం సాయి, మహేంద్ర, మూర్తి, రంగారావు తదితర రాధా రంగా మిత్రమండలి నాయకులు, మహిళా విభాగం సభ్యులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

నేటి నుంచి మంగినపూడి బీచ్‌కు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

ది.24.11.2026 తేదిన "కార్తీక పౌర్ణమి" సందర్భంగా సముద్ర స్నానమాచరించే భక్తుల సౌకర్యార్థం ది.22.11.2026 ఆదివారం నుండి కృష్ణా జిల్లా పరిధిలోని అవనిగడ్డ, మచిలీపట్నం, గుడివాడ, గన్నవరం మరియు ఉయ్యూరు డిపోల నుండి మచిలీపట్నం మంగినపూడి బీచ్ వద్దకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయబడినవి. అన్ని డిపోలో నుండి అదేవిధంగా మచిలీపట్నం కోనేరు సెంటర్ నుండి బయలుదేరి మచిలీపట్నం ఆర్టీసీ బస్ స్టాండ్ మీదుగా మంగినపూడి బీచ్ వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడమయినది. కావున మంగినపూడి బీచ్ కు వెళ్ళు ప్రయాణీకులు ఆర్టీసి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను ఉపయోగించుకోవలసినదిగా ఏపిఎస్ఆర్టీసి, కృష్ణా జిల్లా ప్రజా రవాణా అధికారి కొడమంచిలి వెంకటేశ్వర్లు కోరారు.

హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యం..
విశ్వ హిందూ పరిషత్లో సభ్యత్వ ఆహ్వానం!

హిందూ సమాజ ఐక్యతే ధ్యేయం.. హితచింతకులుగా చేరండి! అయోధ్య రామమందిరం నుంచి హైందవ శంఖారావం వరకు.. విశ్వ హిందూ పరిషత్ సేవలు!



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

అయోధ్య రామమందిర నిర్మాణం,2025 జనవరి లో హైందవ శంఖారావం పేరుతో హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చే విధంగా సుమారుగా 5 లక్షలకు పైచిలుకు హిందువులు మరియు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి సాధు సంతులతో భారీ బహిరంగ సభను కృష్ణాజిల్లా గన్నవరం దగ్గర కేసరపల్లిలో నిర్వహించిన ఏకైక హిందూ ధార్మిక సంస్థ మన విశ్వ హిందూ పరిషత్, అలాగే ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితిని ఏర్పాటు చేసి గణేష్ మండపాలకు ప్రభుత్వంతో చర్చించి సింగిల్ విండో విధానం ద్వారా ఉచిత పర్మిషన్లు మరియు ఉచిత కరెంట్ విధానాన్ని హిందూ సమాజానికి ఏర్పాటు చేసిన ఘనత విశ్వ హిందూ పరిషత్ ది. 3 సంవత్సరాలకు ఒకసారి 15 సంవత్సరాలు వయసు పైబడిన ప్రతీ హిందువు కూడా విశ్వ హిందూ పరిషత్ సంస్థ యొక్క హితమును కాంక్షించే వారిగా 20/- లు చెల్లించి హితచింతకులుగా(సభ్యులు)చేరి ఈ మహత్తర భగవత్ కార్యాన్ని ముందుకు తీసుకు వెళ్ళవలసినదిగా ఆహ్వానిస్తున్నాము.ఈ కార్యక్రమంలో యక్కలి రాఘవులు అఖిలభారత విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ కార్యకారిణి సదస్యులు, యతిరాజా చార్యులు ప్రాంత కార్యాలయ ప్రముఖ్,విజయవాడ ఉపాధ్యాకులు బొలిశెట్టి శివకుమార్,కోశాధ్యక్షులు గంగారావు, సహ కార్యదర్శి కొంపెల్లి శ్రీనివాస్ మరియు భజరంగ్ దల్ కార్యకర్తలు ఈ ప్రెస్ మీట్ లో పాల్గొనటం జరిగింది.

అర్హులైన ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం





❖ ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి ❖ ఓటర్ల పునఃపరిశీల నలో రాజకీయ పార్టీలు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి ❖ ASDD జాబితాలోని ఓటర్లకు మరోసారి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీకి చర్యలు ❖ కృష్ణా–గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి డినోవో ఓటరు జాబితా తయారీపై ప్రత్యేక దృష్టి సారించాలి ❖ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాల పునఃప రిశీలనను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐఆర్ పురోగతి, ఓటర్ల వివరాల పునఃపరిశీలన, కృష్ణా–గుంటూరు ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి డినోవో ఓటరు జాబితా తయారీ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ –ఓటర్ల వివరాల పునఃపరిశీలన

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో 24,603 మంది శాశ్వ తంగా వలస వెళ్లినవారిగా, 21,970 మంది గైర్హాజరైనవారిగా గుర్తించినట్లు తెలిపారు. వీరందరి వివరాలను మరోసారి క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించనున్నట్లు వెల్లడించారు.ఈ ప్రక్రియ సక్రమంగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బందికి ఇప్పటికే ప్రత్యేక శిక్షణ అందిం చడంతో పాటు, నిర్దిష్ట ప్రొఫార్మా, మార్గదర్శకా లను జారీ చేసినట్లు తెలిపారు. స్వయంగా తన పర్యవేక్షణలో వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించిన ప్పటికీ, ఇంకా వంద శాతం పూర్తయిందని చెప్పే పరిస్థితి లేదన్నారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 15వ తేదీ వరకు పంపిణీ, సేకరణ ప్రక్రియకు గడువు ఉన్నందున, ఇప్పటివ రకు గుర్తించిన ASDD (Absent, Shifted, Duplicate and Dead) ఓటర్ల వివరాలను అన్ని రాజకీయ పార్టీలకు అందించినట్లు తెలిపారు. అవసరమైతే మరోసారి ఈ వివరాలను అందించేందుకు ఏర్పాట్లు చేశామని, రాజకీయ పార్టీలు కూడా వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ఓటర్లను తిరిగి ఓటరు జాబితాలో చేర్చేందుకు సహకరించాలని కోరారు.అదేవిధంగా, ASDD జాబితాలో గుర్తించిన ఓటర్లకు ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మరోసారి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపా రు. ఈ మేరకు ASDD జాబితాలో ఉన్న ప్రతి ఓటరుకు తిరిగి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, వాటిని సేకరించేందుకు అవసరమైన చర్యలు చేపడుతు న్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్ల వివరాలను మరోసారి ధ్రువీకరించి, ఎవరూ ఓటు హక్కు కోల్పోకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఒక వ్యక్తికి ఒకే చోట ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవడమే లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్క ఓటరును కూడా జాబితా నుంచి అనవసరంగా తొలగించకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రక్రియలో అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.కృష్ణా–గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజక వర్గం – డినోవో ఓటరు జాబితాఅనంతరం కృష్ణా–గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజ కవర్గానికి సంబంధించి డినోవో ఓటరు జాబితా తయారీపై కలెక్టర్ సమీక్షించారు.ప్రతి ఎమ్మెల్సీ ఎన్నికకు ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు జాబితాను కొత్తగా తయారు చేయడం ఆనవాయితీ అని, గతంలో ఉన్న ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకోకుండా అర్హు లైన ఉపాధ్యాయుల వివరాలతో కొత్త జాబితా రూపొందిస్తారని తెలిపారు. దీనినే డినోవో ఓటరు జాబితా తయారీగా పరిగణిస్తారని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం 2026 డిసెంబర్ 23 నుంచి 2027 జనవరి 12 వరకు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ దాఖలు చేసేందుకు అవకాశం కల్పించి నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అర్హులైన ఉపా ధ్యా యులెవరూ ఓటరు నమోదును కోల్పో కుండా రాజకీయ పార్టీలు తమ పరిధిలో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు – జిల్లా పురోగతి

జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 2,751 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిలో 2,324 ఆన్‌లైన్ ద్వారా, 427 ఆఫ్‌లైన్ ద్వారా వచ్చినట్లు వివరించారు.అందిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 1,065 దరఖాస్తులు ఆమోదిం చగా, 71 దరఖాస్తులు తిరస్కరించినట్లు తెలిపా రు. మిగిలిన 1,615 దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు.అర్హు లైన ప్రతి ఉపాధ్యాయుడికి ఓటు హక్కు కల్పిం చేందుకు రాజకీయ పార్టీలు, విద్యాసంస్థల యాజ మాన్యాలు, సంబంధిత అధికారులు సమ న్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచిం చారు.ఈ సమావేశంలో సీపీఎం పార్టీ తరపున కొడాలి శర్మ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున కె. చంద్రశేఖర్, బీఎస్పీ తరపున ఎస్. బాలాజీ, వైసీపీ పార్టీ తరపున పేర్ని నాని, బీజేపీ తరపున కె. శ్రీనివాసరావు, జనసేన పార్టీ తరపున గడ్డం రాజు, తెలుగుదేశం పార్టీ తరపున కె. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

"అంతర్జాలంలో భద్రత, అప్రమత్తం గా వ్యవహరించటం" పై అవగాహన సదస్సు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

కృష్ణా విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలే జ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అంత ర్జాలంలో జరుగుతున్న ఆర్థిక మోసాల గురించి, సామాజిక మాధ్యమాలలో యువ త తమని తాము ఎలా పరిర క్షించుకోవాలి అని విషయాలను కంప్యూటర్ సైన్స్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ ఆర్. విజయ కుమారి వివ రించడం జరిగింది. అంతర్జాలంలో మోసానికి గురికాకుండా ఉండుటకు 10 ప్రాథమిక సూత్రాలను పరిచయం చేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిం చారు. డా. సల్మా బేగం, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలి

పోతెపల్లి పంచాయతీ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ





ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు–2026 లో భాగంగా బందరు మండలం పోతెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శనివారం సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లు, అభ్యర్థులకు కల్పించిన సదుపాయాలు, నామినేషన్ పత్రాల పరిశీలన, అవసరమైన రికార్డుల నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, అభ్యర్థుల నుంచి నామినేషన్లను నిర్ణీత విధానంలో స్వీకరించాలని అధికారులకు సూచించారు. ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైన పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపా తంగా విధులు నిర్వహించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నామినేషన్ల దాఖలుకు వచ్చే అభ్యర్థులకు అవసరమైన సమాచారం, సహకారం అందిస్తూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు

బాలల హక్కులు, భద్రతపై న్యాయమూర్తి పాండురంగా రెడ్డి కీలక ప్రసంగం



అవనిగడ్డ, ప్రజాభూమి ప్రతినిధి:

విద్యార్థులకు బాలల హక్కులు, చట్టప రమైన రక్షణలపై అవగాహన కల్పించే లక్ష్యంతో అవనిగడ్డ మండల న్యాయ సేవల సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై న్యా య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు న్యాయమూర్తి పాండురంగారెడ్డి హాజరై విద్యార్థులకు చట్టంపై అవగాహన కల్పిస్తూ కీలక ప్రసంగం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలపై లైంగిక నేరాలను నిరోధించేందుకు పోక్సో చట్టం కీలకమైన రక్షణ కల్పిస్తుందని వివరించారు. బాలల హక్కులు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ పొందే మార్గాలు, ఇటువంటి ఘటనలు ఎదురైనప్పుడు అనుసరించాల్సిన చట్టపరమైన విధానాల గురించి విద్యార్థులకు తెలియజే శారు. తమకు ఎదురయ్యే అనుచిత ప్రవర్తనను నిర్భయంగా గుర్తించి, విశ్వసనీయమైన పెద్దలు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఎంఈఓ శివశంక రరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఏజీపీ బొప్పన సుబ్రహ్మణ్యేశ్వరరావు, అవనిగడ్డ కోర్టు మధ్యవర్తులు కె. ఈశ్వరరావు, తోట వీరబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.బాల్య దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరగడంతోపాటు బాలల భద్రతకు మరింత భరోసా కల్పించవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

చిట్టినగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్పొరేటర్ దంపతులు



ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ 55వ డివిజన్ కార్పొరేటర్ పెద్ది రమేష్ తన సతీమణి మీనాక్షితో కలిసి చిట్టినగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని సందర్శిం చారు. ఈ సందర్భంగా దంపతులిద్దరూ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి ఆశీ స్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అర్చకులు దంపతులకు వేద ఆశీర్వచనం అం దించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా రుక్మిణీ సమేత పాండురంగ స్వామి రథోత్సవం

భక్తజనుల జై పాండురంగ నామస్మరణతో మార్మోగిన మచిలీపట్నం పురవీధులు







మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:

కార్తీక మాస ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని చిలకలపూడి కీర పందిరిపు రంలో కొలువుదీరిన రుక్మిణీ సమేత శ్రీ పాండురంగ స్వామివారి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తుల జయజయధ్వానాలు, మంగళవాయిద్యాలు, సంప్రదాయ కళారూపాల నడుమ సాగిన రథ యాత్రతో మచిలీపట్నం పురవీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. చిలక లపూడి దేవ స్థానం నుంచి ప్రారంభమైన రథోత్సవం పరాసుపేట సెంటర్, రామానాయుడుపేట సెంటర్, కోటవారి తుళ్ల సెంటర్, కోనేరు సెంటర్, బస్టాండ్ సెంటర్, జిల్లా కోర్టు సెంటర్, లక్ష్మీ టాకీస్ సెంటర్ మీదుగా సాగి తిరిగి ఆల యానికి చేరుకుంది. రథయాత్ర సాగిన మార్గమంతా భక్తులు స్వామివారిని దర్శిం చుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వ హించారు. రథోత్సవంలో సన్నాయి మేళాలు, తాళాలు, బ్యాండ్ మేళాలు, సంప్రదాయ డప్పుల వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల కోలాట ప్రదర్శనలు, వివిధ విచిత్ర వేషధారణలు, కళారూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అడుగడుగునా భక్తుల సందడి నెలకొనగా, 'జై పాండురంగ' నామస్మరణతో నగర వీధులు మార్మోగాయి.నగరంలోని వివిధ ప్రాం తాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు రథోత్స వంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తజనుల రాకతో ఉత్సవ మార్గాలు కిక్కిరిశాయి. కార్తీక మాస ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన ఈ రథోత్సవం నగర ప్రజల్లో భక్తిభావాన్ని నింపింది.ఈ కార్యక్రమంలో రథోత్సవ కార్యనిర్వాహకులు గోల్డ్ ప్రిన్స్ నరసింహారావు, కార్పొరేటర్ హసీం బేగ్, బండి రామకృష్ణ, పలువురు కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు, భక్తుల సమక్షంలో రుక్మిణీ సమేత పాండురంగ స్వామివారి రథోత్సవం కనులపండువగా సాగింది.



ప్రజల వద్దకే కార్పొరేటర్..
సమస్యల పరిష్కారానికి అధికారు లకు ఆదేశాలు!

55వ డివిజన్లో పర్యటించిన కార్పొరేటర్ పెద్ది రమేష్.. పారిశుద్ధ్య సమస్యలపై ఆరా! మురుగునీరు, దోమల సమస్యలపై తక్షణ చర్యలు.. అధికారులకు పెద్ది రమేష్ ఆదేశం!

ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ

55 డివిజన్ లో అభివృద్ధి లక్ష్యంగా డివిజన్ ని మోడల్ డివిజన్ గా తీర్చిదిద్దా లని కార్పొరేటర్ పెద్ది రమేష్ రషీద్ బిల్డింగ్ ఏరియా కళావతి కొట్టు బీరువా కంపెనీ వీధిలో స్థానికుల ప్రజల దగ్గరికి వెళ్లి వారి యొక్క సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది వారి యొక్క సమస్యలు.కార్పొరేటర్ పెద్ది రమేష్ తెలియపరిచారుముఖ్యంగా అనేకమైన సమస్యలు సైడ్ కాలువలు ఖాళీ స్థలా లు శుభ్రత గురించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు మరియు మురుగు నీటి వల్ల వస్తున్న దోమలు గురించి తెలిపారు వెంటనే కార్పొరేటర్. తక్షణమే వి ఎం సి అధికారులతో మలేరియా అధికారులతో వివిధ అధికారుల తో మాట్లాడి ఈ సమస్యలు త్వరగా క్లియర్ చేయాలని వారికి ఆదేశాలు ఇవ్వటం జరిగింది ఈ కార్యక్రమంలో 55 56 క్లస్టర్ ఇంచార్జ్ దనేకుల వెంకట సుబ్బా రావు.మరియు 55వ డివిజ న్ అధ్యక్షులు పెద్ది న శ్యామ్ సుందర్ సీని యర్ నాయకుడు అధ్య క్షులు సందక సురేష్. తిలక్ రాం సింగ్. కే శేషారావు.యూనిట్



ఇంచార్జ్ కప్పిరెడ్డి రాజు కో యూనిట్ ఇంచార్జ్ షేక్ ఖాసిం గార్లపాటి పద్మాకర్ నాయుడు నక్కని దుర్గారావు తడసం శ్రీనివాస్ షేక్ ఇస్మాయిల్ వాకాడ శేను ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677

ప్రజాభూమి

జనరల్ 13

ఆదివారం 22 నవంబరు 2026

ఓటమితో ఆగని సేవా ప్రస్థానం ఏకగ్రీవంగా సర్పంచ్‌గా కన్నయ్య దొర

జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమి.. ప్రజాసేవకు గుర్తింపుగా గ్రామస్తుల ఏకగ్రీవ పట్టాభిషేకం

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం



ఎన్నికల్లో గెలుపోటములు సహజం కానీ ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకోవడం అంత సులభం కాదు పదవులు లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా దృక్పథంతో గ్రామ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్న వ్యక్తికి గ్రామస్తులు అరుదైన గౌరవాన్ని అందిం చారు గంగవరం మండలం జగ్గంపాలెం పంచాయతీకి చెందిన కోసు కన్నయ్య దొరను గ్రామ స్తులు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారు జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన ప్పటికీ ఆయన ప్రజా సేవ పట్ల చూపిన నిబద్ధత గ్రామ ప్రజలతో కొనసాగించిన అనుబంధం సేవా దృక్పథం గ్రామస్తుల మనసులను గెలుచుకున్నాయి ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ఉంటూ సేవ చేయాలనే ఆయన తపనకు గుర్తింపుగా గ్రామస్తులు ఏకాభి ప్రాయంతో సర్పంచ్ బాధ్యతలను అప్పగించేందుకు ముందుకొచ్చారు ఈ పరిణామం ప్రజాసేవ కు రాజకీయ పదవులు మాత్రమే ప్రామాణికం కాదని ప్రజల ఆదరణే అసలైన విజయమని నిరూపిస్తోంది జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ప్రజల విశ్వాసాన్ని కోల్పోకుండా గ్రామస్తుల అభిమానాన్ని సంపాదించుకున్న కన్నయ్య దొరకు ఈ ఏకగ్రీవ ఎన్నిక ఒక అరుదైన గుర్తింపుగా నిలిచింది ఎన్నికల్లో ఓడినా ప్రజల మనసుల్లో గెలిచారు పదవి కోసం ప్రజల వద్దకు వెళ్లలేదు ప్రజల అభిమానమే పదవిని తెచ్చిపెట్టింది జగ్గంపాలెం గ్రామస్తుల ఏకగ్రీవ నిర్ణయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

అడ్డతీగల మండలంలో ఎన్డీపీ కూటమి సర్పంచ్ అభ్యర్థుల ప్రకటన



ప్రజా భూమి ప్రతినిధి - అడ్డతీగల

అడ్డతీగల మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ కూటమి తరఫున బలపరిచే సర్పంచ్ అభ్యర్థుల జాబితాను రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ తరఫున వీరవరం నుంచి ఆగారి ఈశ్వర్ రెడ్డి, దుచ్చెత్తి నుంచి కొలికెల రాంబాబు, దాకోడు నుంచి వంతల చియమ్మ, ధాన్యంపాలెం నుంచి కేచల రాజమ్మ, డి. భీమవరం నుంచి కోట్ల రత్నకుమారి, సోమన్నపాలెం నుంచి గుంజిగడ్డ లక్ష్మి, తుంగమడుగుల నుంచి అన్నం రామలక్ష్మి, దొరమామిడి నుంచి మిరియాల నాగమణి, వేటమామిడి నుంచి బలుపు సత్యవతి, అడ్డతీగల నుంచి బీర వెంకటలక్ష్మి, బొడ్లంక నుంచి కాట్రు రాఘవ, ఎల్లవరం నుంచి కంద్రోజు శ్రీనివాసరెడ్డి, కోనలోవ నుంచి బండారి కృష్ణమ్మ, తిమ్మాపురం నుంచి కంచెం రాణి, పులిగోగులపాడు నుంచి ఏలూసూరి లక్ష్మీరత్నం, కిమ్మూరు నుంచి జర్తా రాఘవలను అభ్యర్థులుగా ప్రకటించారు. జనసేన పార్టీ తరఫున రాయపల్లి నుంచి బెకం సత్యవతి, భీముడుపాకలు నుంచి సింగోజి వీరలక్ష్మి, మట్లపాడు నుంచి మురల రామ్ కుమార్ రెడ్డి, గొంతు వానిపాలెం నుంచి చింతచి పైడమ్మలను బలపరిచారు. అదేవిధంగా బీజేపీ తరఫున డి. రామవరం నుంచి కురుసుం రాంబాబు, గోండోలు నుంచి బాతు శ్రవణ్ కుమార్‌లను అభ్యర్థులుగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి తరఫున ప్రకటించిన అభ్యర్థుల విజయానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. మూడు పార్టీల శ్రేణులు ఐక్యంగా ప్రచారం నిర్వహించి కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీల మధ్య సమన్వయం, నాయకులు, కార్యకర్తల ఐక్యతతో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

లక్ష్ముడు గూడెం పంచాయతీలో నాలుగు, ఐదు, ఆరు వార్డులు ఏకగ్రీవం.



ప్రజా భూమి ప్రతినిధి - బుట్టాయిగూడెం

బుట్టాయిగూడెం మండలం లక్ష్ముడుగూడెం పంచాయతీ ఎన్నికలలో 12 వార్డులకు 24 నామినేషన్లు , సర్పంచ్ పదవికి నాలుగు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు కాకుమాని శ్రీనివాసరావు, జాలపర్తి కిరణ్, రవికిషోర్ తెలిపారు. బుట్టాయగూడెం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయంలో శనివారం నామినేషన్ల ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు కార్యక్రమాన్ని ఎన్నికల అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు శ్రీనివాసరావు, జాలపర్తి కిరణ్, రవి కిషోర్ మాట్లాడుతూ లక్ష్ముడుగూడెం పంచాయతీలో 12 వార్డులకు 24 నామినేషన్లు దాఖలు అయ్యాయని వాటిలో ఇద్దరు తమ నామినేషన్ ఉపసంహరించుకోగా 4, 5, 6 వార్డులు ఏకగ్రీవం కాగా, మిగిలిన 9 వార్డులకు 19 మంది అభ్యర్థులు రంగంలో మిగిలినట్లు వివరించారు. సర్పంచ్ పదవికి నాలుగు నామినేషన్లు దాఖలు కాగా ఒక నామినేషన్ పరిశీలనలో తిరస్కరించడంతో ముగ్గురు అభ్యర్థులు రంగంలో మిగిలినట్లు స్పష్టం చేశారు. నాలుగో వార్డు నుండి కాళ్ల దుర్గా కళ్యాణి, ఐదవ వార్డు నుండి యడ్లపల్లి పద్మ, ఆరో వార్డు నుండి వంకా సింగరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

- ఐదుగురితో మొదలైన పోటీ..
- నామినేషన్ల ఉపసంహరణతో ఖరారైన త్రిముఖ పోరు..
- సర్పంచ్ పీఠం ఎవరికి

లక్కొండ పంచాయతీలో ముక్కోణపు పోరు..

ముగ్గురు మహిళా అభ్యర్థుల మధ్య హోరాహోరీ

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

గంగవరం మండలం లక్కొండ గ్రామపంచాయతీలో సర్పంచ్ ఎన్నికల సందడి ఊపందుకుంది గ్రామ పంచాయతీ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు సిద్ధమవుతుండగా నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీ స్వరూపం మారింది తొలుత ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా శనివారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ముగ్గురు అభ్యర్థులు బరిలో మిగిలారు ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అన్నిక కాంచన,ఇండిపెండెంట్ అభ్యర్థిగా కొండపల్లి దేవి,స్వతంత్ర అభ్యర్థిగా లోత భారతి సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నారు ముగ్గురు మహిళా అభ్యర్థులు గ్రామ సర్పంచ్ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా ప్రజల ముందుకు వస్తున్నారు



గ్రామాభివృద్ధే ప్రధాన ఎన్నికల అజెండా!

లక్కొండ గ్రామంలో తాగునీరు,రహదారులు, పారిశుధ్యం,వీధిలైట్లు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం ఈ ఎన్నికల్లో ప్రాధాన్యత సంత రించుకోనున్నాయి ప్రజలకు సేవలందిస్తామని గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని అభ్యర్థులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు ఐదుగురితో ప్రారంభమైన ఎన్నికల పోటీ ఇప్పుడు ముగ్గురి మధ్య త్రిముఖ పోరుగా మారడంతో గ్రామంలో రాజకీయ చర్చలు ఆసక్తికరంగా సాగుతున్నాయి పార్టీ మద్దతు వ్యక్తిగత పరిచయాలు ప్రజలతో ఉన్న అనుబంధం అభ్యర్థుల అభివృద్ధి హామీలు ఓటర్ల చర్చల్లో ప్రధాన అంశాలుగా నిలుస్తున్నాయి

ముగ్గురు మహిళలు.. ఒకే సర్పంచ్ పీఠం

లక్కొండ గ్రామ ఓటర్లు ఎవరికి మద్దతు తెలుపుతారు? పార్టీ అభ్యర్థికి పట్టం కడతారా స్వతంత్ర అభ్యర్థికి అవకాశం ఇస్తారా?అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది ముగ్గురు మహిళా అభ్యర్థుల్లో ప్రజల విశ్వాసాన్ని ఎవరు పొందుతారో గ్రామ సర్పంచ్‌గా ఎవరు బాధ్యతలు చేపడతారో ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి

- ఇంటింటి ప్రచారంలో వెల్లువెత్తిన స్పందన..
- అభ్యర్థి వెంట కదిలిన గ్రామస్తులు.. అభివృద్ధి కొనసాగింపునకు మరో అవకాశం ఇవ్వాలని వరలక్ష్మి విజ్ఞప్తి

గొల్లలపాలెంలో నగిరెడ్డి వరలక్ష్మి ప్రచారానికి జనజాతర.. అడుగడుగునా ప్రజా మద్దతు!

ప్రజాభూమి ప్రతినిధి-అనకాపల్లి



పరవాడ మండలం, కలపాక గ్రామపంచాయతీ: కలపాక గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి నగిరెడ్డి వరలక్ష్మి ఎన్నికల ప్రచారం రోజురోజుకూ జోరందుకుంటోంది. ప్రచారంలో భాగంగా గొల్లలపాలెంలో ఆమె నిర్వహించిన ఇంటింటి పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామంలోకి అభ్యర్థి అడుగుపెట్టగానే స్థానికులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆమె వెంట కదలడంతో వీధుల్లో ఎన్నికల సందడి నెలకొంది.ప్రతి ఇంటి గడపకు వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి ఆదరాభిమానాలను స్వీకరిస్తూ నగిరెడ్డి వరలక్ష్మి ప్రచారాన్ని కొనసాగించారు. గ్రామంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు, భవిష్యత్తులో మరిన్ని ప్రజోపయోగ పనులు చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తనకు మరో అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. గ్రామ ప్రజల ఆశీస్సులు, మద్దతు ఉంటే పంచాయతీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఆమె విజ్ఞప్తి చేశారు.వరలక్ష్మి ప్రచారానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తోడుగా కదలడం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుంటూ సాగిన ఇంటింటి ప్రచారంలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇప్పటివరకు జరిగిన అభివృద్ధిని కొనసాగిస్తూ, రానున్న రోజుల్లో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలుకావాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తూ ఆమెకు మద్దతు తెలిపారు.గొల్లలపాలెంలో లభించిన ప్రజా స్పందనతో అభ్యర్థి, పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ప్రజల ఆదరణే తన కొండంత బలమని భావిస్తూ, విజయమే లక్ష్యంగా నగిరెడ్డి వరలక్ష్మి ప్రచారాన్ని మరింత ముమ్మరం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనశాల శాఖ

"నాణెములు, స్టాంపుల, కరెన్సీ ప్రదర్శన"

ప్రజాభూమి ప్రతినిధి-అనంతపురం



రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ కమిషనర్ ముత్యాలరాజు రేవు ఐఏఎస్ మరియు అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఐఏఎస్ నేతృత్వంలో, ప్రపంచ వారసత్వ వారోత్సవాలు - 2026 లో భాగంగా ఈరోజు అనగా 21-11-2026, నాడు "నాణెములు స్టాంపుల మరియు కరెన్సీ ప్రదర్శన ప్రదర్శన" అనే కార్యక్రమము పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు మరియు ప్రదర్శనశాల వద్ద ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం పట్టణ మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమము రాష్ట్ర పురావస్తు మరి ప్రదర్శనశాల శాఖ, అనంతపురం ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్, లేడీస్ క్లబ్ ఇన్నర్ వీల్ క్లబ్ , శ్రీదేవీ కాలేజ్ వారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీ జస్వంత్ రావు మాట్లాడుతూ, వేల సంవత్సరాల క్రితం నాణ్యాలు, వందలాది రకాల స్టాంపు కలెక్షన్లు, వందల సంవత్సరాల క్రితం నాటి స్టాంపులు, దేశ విదేశీయ స్టాంపులు యొక్క కలెక్షను పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పుర వస్తువు మరి ప్రదర్శించేలాల శాఖ వద్ద నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు, కావున విద్యార్థిని విద్యార్థులు మాత్రమే కాకుండా ప్రజలందరూ వీక్షించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా, రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ, అనంతపురం సహాయ సంచాలకులు స్వామి నాయక్ మాట్లాడుతూ, వందలాది సంవత్సరాల క్రితం నాటి నాణ్యాలు మరియు స్టాంపులు యొక్క ప్రదర్శన వాటి కాలక్రమేణంలో ఉపయోగంలో వచ్చిన మార్పులు ఇక్కడ ప్రదర్శించారని, విద్యార్థులకు, ప్రజలకు జ్ఞాన సమాపార్జనకు ఎంతో మేలు చేకూరుస్తుందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ×చీూాజఽ కన్వీనర్ శ్రీ రామ్ కుమార్ మాట్లాడుతూ వందలాది సంవత్సరాల క్రితము నుంచి నేటి వరకు వివిధ నాణ్యాలు, స్టాంపులు మరియు కరెన్సీలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పు కేవలం సమాపార్జన మాత్రమే కాకుండా కాలక్రమ మార్పుని కూడా తెలియజేస్తుందని ఆయన తెలిపారు. నాణ్యాలు, స్టాంపులు మరియు కరెన్సీ కలెక్షన్ చేసినటువంటి ప్రముఖులు గోవిందరాజులు గుప్తా మరియు పి. శివ ప్రసాద్ ఇరువురు మాట్లాడుతూ దాదాపుగా 50 సంవత్సరాలు నుంచి ఈ స్టాంపు కలెక్షన్ చేస్తున్నానని దేశ విదేశీయాల స్టాంపుల లతో పాటు రచన కాలము నుండి నేటి వరకు వివిధ నాణ్యాలు మధ్యయుగ కాలం నుంచి నేటి వరకు వివిధ పేపర్ కరెన్సీలను సైతం నేను సేకరించటం అలాగే విలువలను విద్యార్థులకు తెలియజేయడం తనకెంతో ఆనందంగా ఉందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఇంటాక్ సభ్యులు పి కృష్ణమూర్తి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రియాజ్, సూర్యనారాయణ రెడ్డి, జూటూరు షరీఫ్ మరియు లేడీస్ క్లబ్ సెక్రటరీ శ్రీమతి సార్ పద్మ నారాయణరెడ్డి, సూర్యప్రకాశ్ రెడ్డి, ఇన్నర్ వీల్ క్లబ్ సెక్రటరీ శ్రీమతి జయంతి మరియు శ్రీదేవీ కళాశాల చీూా ఆఫీసర్ శ్రీమతి భార్గవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

- ఎస్పీ కె. చక్రవర్తి ఆదేశాలతో ప్రత్యేక నిఘా.. డీఎస్పీ అష్రఫ్ అలీ పర్యవేక్షణలో చర్యలు
- ఒకే వారంలో ముగ్గురిపై కేసులు నమోదు.. రెండు సారా తయారీ కేంద్రాల ధ్వంసం

నాటుసారాపై పోలీసుల వరుస దాడులు!

ప్రజాభూమి ప్రతినిధి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి మండలంలో నాటుసారా తయారీ, విక్రయాల నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి ఐపీఎస్ ఆదేశాల మేరకు రంపచోడవరం డీఎస్పీ పి. అష్రఫ్ అలీ పర్యవేక్షణలో పోలీసులు వరుస దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నవంబర్ 16 నుంచి 21వ తేదీ వరకు రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్ స్టేషన్ల పరిధిలో ముగ్గురిపై నాటుసారాకు సంబంధించి కేసులు నమోదయ్యాయి.నవంబర్ 16న రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని దూసరపాము పంచాయతీ సుబ్బంపాడు గ్రామ సమీపంలో ప్రత్యేక పోలీసు బృందం, ఎస్సై షరీఫ్ ఆధ్వర్యంలో దాడి చేసింది. ఈ సందర్భంగా బోయిన కృష్ణ ప్రసాద్ (29) వద్ద అక్రమ సారా తయారీని గుర్తించి సారా బట్టీని ధ్వంసం చేశారు. 80 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 45 బాక్సుల్లో ఉన్న సుమారు 450 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు.మరో ఘటనలో జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని బుసులపాలెం గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు సమన్వయంతో జడ్డంగి ఎస్సై చిన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో కొన్న చిన్నరావును పట్టుకున్నారు. అతని వద్ద ఐదు లీటర్ల నాటుసారాను



స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.ఇదే క్రమంలోహెచ్ రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న రేలంగిపాడుకు చెందిన తాడే శ్రీరాములు, పై కూడా నవంబర్ 21న నాటుసారాకు సంబంధించి కేసు నమోదైంది.మూడు కేసుల్లో రెండు తయారీ కేంద్రాలపై దాడులు చేసి మొత్తం 280 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 450 కిలోల బెల్లం, ఐదు లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీ, విక్రయాలపై నిఘా కొనసాగిస్తామని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

- భావ తరంగిణి ఆధ్వర్యంలో 'సంగీత నృత్య తరంగిణి'..
- ఘనంగా నాట్య కళా తపస్వి పురస్కార ప్రదానం

తెలుగు సంస్కృతి కీర్తి కిరీటం కూచిపూడి నాట్యం

ప్రజాభూమి ప్రతినిధి-మచిలీపట్నం



తెలుగు సంస్కృతికి కూచిపూడి నాట్యం కీర్తి కిరీటమని డాక్టర్ ధన్వంతరి ఆచారి అన్నారు. స్థానిక మహతి ఆడిటోరియంలో శనివారం సాయంత్రం భావ తరంగిణి సంస్థ ఆధ్వర్యం లో నిర్వహించిన 'సంగీత నృత్య తరంగిణి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాలు మన సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకలని పేర్కొన్నారు.మన సంప్రదాయ కళలను ప్రోత్సహించడంతోపాటు వాటి వైభవాన్ని భావితరాలకు అందించేలా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని న్యాయవాది లంకిశెట్టి బాలాజీ అన్నారు. ఆర్టీసీ అధికారి టీ. పెద్దిరాజు మాట్లాడుతూ కార్తీక మాసం కళలకు శుభప్రదమైన మాసమని, ఈ మాసంలో సంగీతం, నృత్యం వంటి కళారూపాలతో దైవాన్ని ఆరాధించడం విశేషమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కార్పొరేటర్ హసీం బేగ్, భావ తరంగిణి అధ్యక్షురాలు భవిష్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస శ్రేయకు 'నాట్య కళా తపస్వి' బిరుదు

కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి శ్రీనివాస శ్రేయ ప్రదర్శించిన నృత్యరూపకాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆమె ప్రతిభకు గుర్తింపుగా భావ తరంగిణి సంస్థ 'నాట్య కళా తపస్వి' బిరుదుతో సత్కరించింది. దేశ, విదేశాల్లో 250కి పైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చిన శ్రేయ, నృత్యం, భక్తి, జ్ఞానం అనే మూడు ప్రధాన సూత్రాల ఆధారంగా శిష్యులకు శిక్షణ అందిస్తున్నారు. జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన ఖజురహో, మహాబలిపురం నృత్యోత్సవాలతోపాటు ధ్రౌళీ నృత్యోత్సవంలోనూ ఆమె ప్రదర్శనలు ఇచ్చారు. టర్కీ, మాస్కో తదితర ప్రాంతాల్లో నిర్వహించిన అంతర్జాతీయ నృత్య కార్యక్రమాల్లో పాల్గొని తన కళా ప్రతిభను చాటుకున్నారు.వివిధ నాట్యాంశాలతోపాటు శ్రీకృష్ణ తత్వాన్ని ప్రతిబింబించే అంశాలను తన అభినయంతో ప్రదర్శించి ప్రేక్షకులను భక్తిభావంలో ముంచెత్తారు. సంప్రదాయ నృత్యరీతులు, హావభావాలు, లయబద్ధమైన అడుగులతో ఆడిటోరియంలో కళాభిమానులను అలరించారు.

సంగీత విభావరి.. కళాకారులకు సత్కారం

తొలుత చిరంజీవి ఈషా వయోలిన్ వాయిద్య ప్రదర్శన, విరాజ్ కీబోర్డు వాయిద్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. శాస్త్రీయ సంగీత రంగంలో విశేష సేవలు అందిస్తున్న కాళీపట్నపు ఉమ, ఎల్. విజయలక్ష్మి, ఓరుగంటి మహాలక్ష్మిలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మేయర్ అబ్దుల్ అబీదా, కవినీల, రేవతి, మడమల రాంబాబు తదితరులు భక్తిగీతాలు ఆలపించి సంగీత విభావరికి మరింత శోభ చేకూర్చారు. రాధికారాణి, శిరీష, శ్రీరామ్, జె. చంద్రిక, భవాని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సంగీతం, నృత్యం, భక్తి సమ్మేళనంగా సాగిన ఈ కార్యక్రమం కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది.

ప్రజాభూమి
జనరల్ 14
ఆదివారం 22 నవంబర్ 2026

ఘనంగా ప్రపంచ టెలివిజన్ దినోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

నవంబర్ 21 ప్రపంచ టెలివిజన్ డే సందర్భంగా ఈరోజు పాలకొల్లు ఆడియో & వీడియో టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం స్థానిక లాకు దిగువ ఉమా హాస్పటల్ వెనుక యూనియన్ అధ్యక్షులు మానెం బసవరాజు అధ్యక్షతన వారి గోడౌన్ వద్ద జరిగింది.ఈ సమావేశంలో ముందుగా ఏ ఈ టి యు రాష్ట్ర యూనియన్ జెండాను ఆవిష్కరించడం జరిగినది. తదుపరి కేక్ కట్ చేసి మనం ఈరోజు ఇలా ఉండటానికి మొదటిగా టెలివిజన్ ను కనుగొన్న ప్రముఖ వ్యక్తి జాన్ లాగీ బైర్డ్ మరియు ఆధునిక ఎలక్ట్రానిక్



టెలివిజన్ అభివృద్ధికి ముఖ్యమైన ఆవిష్కర్త ఫిలో టేలర్ ఫార్న్స్ వర్త్ అని ఆ మహానుభావుల మేధస్సు మనం ఈరోజు టీవీ చూస్తున్నామంటే ఈ శాస్త్రవేత్తలు మనకు ఈ టెక్నాలజీని డెవలప్ చేసి మనకు అందించడం వలన ఈ టెలివిజన్ల ద్వారా ప్రపంచంలో నలుమూలలలో ఉన్న ఎవరు ఏమి మాట్లాడిన సెకండ్లలో మనకి వార్తల రూపంలో కంటికి కనిపించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపకులు బొడ్డపాటి సూరిపండు, నంబూరి పుల్లయ్య, ఎన్ వెంకటరత్నం, కార్యదర్శి, వట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కేదార్, ట్రెజరర్ బత్తుల నాగేశ్వరరావు, యు. అప్పాజీ, బండారు గుప్త, బండి కృష్ణ, సన్నీ శ్రీనివాసరావు, శాంసంగ్ రాజు, ఐరెడ్డి ఏసుబాబు, పెచ్చెట్టి నాగరాజు, కె. బ్రహ్మాజీ, శక్తేశ్వరరావు, కూర్మారావు, మేకా నాగరాజు, బండారు చినరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు మేయర్ పీఠంపై 'ముఠా మేస్త్రి'!

- కార్మిక నాయకుడి నుంచి నగర ప్రథమ పౌరుడిగా రెడ్డి అప్పలనాయుడు ప్రస్థానం



రీజనల్ బ్యూరో ప్రజాభూమి

నగరాలు, పట్టణాల్లో విజయదుందుభి మోగించిన కూటమి అభ్యర్థులు అట్టహాసంగా పదవీ ప్రమాణ స్వీకారాలకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ పీఠాన్ని జనసేన పార్టీ తరపున ఎన్నికైన రెడ్డి అప్పలనాయుడు అధిష్ఠించనున్నారు. సాధారణ కార్మిక నాయకుడిగా, ముఠా మేస్త్రిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన అప్పలనాయుడు, ప్రజల జీవన విధానాలు, వివిధ వర్గాల సమస్యలపై ప్రత్యక్ష అవగాహన కలిగిన నాయకుడిగా ఎదిగారు. కార్మికుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, శ్రామిక జనబాంధవుడిగా గుర్తింపు పొందారు. ప్రజలతో మమేకమవుతూ అంచెలంచెలుగా రాజకీయంగా ఎదిగి నేడు నగర ప్రథమ పౌరుడి పీఠాన్ని అధిష్ఠించే స్థాయికి చేరుకున్నారు. గతంలో కూటమి తరఫున ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ఆయనకు పార్టీ అధిష్ఠానం ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో ఏలూరు కార్పొరేషన్ మేయర్ పీఠం కోసం పోటీ నెలకొంది. ఈ పదవిని టీడీపీ అభ్యర్థికి దక్కేలా ప్రయత్నాలు జరిగినప్పటికీ, చివరకు జనసేన తరఫున రెడ్డి అప్పలనాయుడు మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు. ముఠా మేస్త్రిగా మొదలైన ప్రస్థానం నుంచి ఏలూరు నగర మేయర్ స్థాయికి చేరుకోవడం ఆయన రాజకీయ ప్రయాణంలో ఒక విశేష మలుపు. సామాన్య ప్రజల మధ్య నుంచి ఎదిగిన నాయకుడిగా, నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన ఏ మేరకు తనదైన ముద్ర వేస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

డిప్యూటీ మేయర్ పదవి కేటాయింపులో
పార్టీ విధేయులకే తొలి ప్రాధాన్యత

- ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ఏలూరు

తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన వారికే డిప్యూటీ మేయర్ పదవి కేటాయింపులో తొలి ప్రాధాన్యత ఉంటుందని టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు.ఈ నెల 23న ఏలూరు నగరపాలక సంస్థ నూతన పాలకవర్గం కొలువుదీరనున్న నేపథ్యంలో శనివారం పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన కార్పొరేటర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీ సానుభూతిపరులుగా ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన కప్పా ఉమామహేశ్వరరావు, చలువాది రూపకళాశ్రీ, నిడిగట్టు లావణ్యలు ఎమ్మెల్యే బడేటి చంటి సమక్షంలో తిరిగి పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.అలాగే అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన కార్పొరేటర్ రాజా స్వర్ణకుమారికి ముందుగా ప్రకటించిన విధంగా రూ.10 లక్షల విలువైన వెండి కానుకను అందజేశారు.అనంతరం పురుష కార్పొరేటర్లకు ఎమ్మెల్యే బడేటి చంటి నూతన వస్త్రాలు,మహిళా కార్పొరేటర్లకు తన సోదరి మోటేపల్లి కోటేశ్వరమ్మ చీరలను బహూకరించారు.అనంతరం భారీ కేక్ కట్



చేసి విజయోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ, టికెట్లు దక్కని వారికి నామినేటెడ్ పదవులు కల్పించేందుకు కృషి చేస్తామని, ఎన్నికల్లో ఓటమి చెందిన వారికి కూడా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.యువ కార్పొరేటర్లు సీనియర్లను కలుపుకొని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు,ఏఎంసీ ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి,ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టీడీపీ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ చల్లా వెంకట సత్యవరప్రసాదరావు, ఏలూరు నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, సీనియర్ నాయకులు బెల్లపుకొండ కిషోర్, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి.. 609 నామినేషన్లకు ఆమోదం

- వాడపల్లి 9వ వార్డు నామినేషన్ తిరస్కరణ

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట



గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఆత్రేయపురం మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శనివారం పూర్తయింది. సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిబంధనల మేరకు నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మండలవ్యాప్తంగా సర్పంచ్ పదవులకు దాఖలైన 80 నామినేషన్లు, వార్డు సభ్యుల పదవులకు దాఖలైన 529 నామినేషన్లు అర్హత పొందినట్లు అధికారులు తెలిపారు. వాడపల్లి గ్రామ పంచాయతీలో 9వ వార్డు అభ్యర్థి గొల్లపల్లి సురేష్ నామినేషన్‌ను ప్రతిపాదకుడు అదే వార్డుకు చెందిన వ్యక్తి కాకపోవడంతో ఎన్నికల నిబంధనల మేరకు తిరస్కరించారు. నామినేషన్ పత్రాల్లో వివరాలు, అభ్యర్థుల అర్హతలు, ప్రతిపాదకుల వివరాలు, ధ్రువపత్రాలను పరిశీలించి ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రత్తిపాడు సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి
- సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రత్తిపాడు

ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వైద్య సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపీ విభాగం, నవజాత శిశువుల వార్డు, ప్రసవానంతర వార్డు, జనరల్ వార్డులను కలెక్టర్ సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య పరీక్షలు, చికిత్స విధానం, మందుల లభ్యత, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటుపై వివరాలు తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న రోగులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆసుపత్రిలో



అందుతున్న సౌకర్యాలపై అభిప్రాయాలు సేకరించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. తల్లులు, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రి వార్డులు, పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

వాతావరణ మార్పుల నేపథ్యంలో జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆహార పదార్థాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, దోమల నుంచి రక్షణకు దోమతెరలు వినియోగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలు కూడా తమవంతు సహకారం అందించాలని కోరారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. వైద్యుల సలహా లేకుండా సొంతంగా మందులు వాడకూడదని తెలిపారు. వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందడం ద్వారా ఆరోగ్య సమస్యల తీవ్రతను నివారించవచ్చన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ప్రత్తిపాడు తహసీల్దార్, ఎంపీడీవో, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు పంచాయతీ నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

- అభ్యర్థులకు అవసరమైన పత్రాల పూర్తి చెక్‌లిస్ట్ అందించాలి
- నామినేషన్ల స్వీకరణ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరగాలి: కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజా భూమి,ప్రత్తిపాడు

గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో దశ నేపథ్యంలో ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కాకినాడ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను పరిశీలించిన కలెక్టర్, అభ్యర్థులకు అందిస్తున్న సమాచారం, ఎన్నికల నిబంధనలు, నామినేషన్ ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలపై ఆరా తీశారు. నామినేషన్



దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందికి సూచించారు. నామినేషన్ దాఖలుకు అవసరమైన పత్రాలు, ధ్రువపత్రాలు, సమర్పించాల్సిన వివరాలు, పాటించాల్సిన నిబంధనలతో కూడిన పూర్తి చెక్‌లిస్ట్‌ను ప్రతి అభ్యర్థికి తప్పనిసరిగా అందించాలని రిటర్నింగ్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. నామినేషన్ పత్రాలను ఎలా నింపాలి, ఏయే పత్రాలను జత చేయాలి, వివరాలు అసంపూర్ణంగా ఉంటే ఎలా సరిచేసుకోవాలనే అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు. అభ్యర్థులు అవసరమైన పత్రాలపై అవగాహన లేక ఇబ్బందులు పడకుండా ముందస్తు మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. నామినేషన్ పత్రాల స్వీకరణ సమయంలో ఎన్నికల నిబంధనలు, విధివిధానాలను కచ్చితంగా పాటించాలని, ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి సంబంధిత రికార్డుల్లో నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రంలో అవసరమైన రిజిస్టర్లు, ఎన్నికల రికార్డులు, దరఖాస్తు పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, అభ్యర్థులకు ఎలాంటి గందరగోళం కలగకుండా స్పష్టమైన సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని, అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో ప్రత్తిపాడు తహసీల్దార్, ఎంపీడీవో, రిటర్నింగ్ అధికారి, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



డ్రగ్స్ వద్దు బ్రో పై అవగాహన

ప్రజాభూమి ప్రతినిధి నూజీవీడు

నూజీవీడు మండలం అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో స్కూల్ పరిధిలో డ్రగ్స్ వద్దు బ్రో అనే అంశం పై విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ,చిత్రలేఖనముపోటీలు నిర్వహించడమైనదని పాఠశాల ఇన్ చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర తెలిపారు. ఇన్ చార్జీ ప్రధానో పాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు డ్రగ్స్, మరియు మత్తు పదార్థాలకు అలవాటు పడ కూడదని తెలియచేశారు, అనారోగ్యమునకు గురిఅవు తారని, గుండెకు సంబంధించిన జబ్బులు, లివర్ దెబ్బతినటం, మానసిక సమస్యలు రావటం జరుగునని తెలియచేశారు. విద్యార్థినీ విద్యార్థులు మంచి లక్షణాలు అలవాటు చేసుకోవాలని తెలియచేశారు. వకృత్వ పోటీల్లో ప్రథమ బహుమతి రాధిక, ద్వితీయ బహుమతి గౌతమ్, త్రుతీయ బహుమతి నాగమల్లేష్. వ్యాసరచనల్ ప్రథమ ఎనోష్, ద్వితీయ బహుమతి ఆనంద్, త్రుతీయ బహుమతి పావని.చిత్రలేఖనములో ప్రథమ బహుమతి అభినయ్, ద్వితీయ బహుమతి సాకేత్ కృష్ణ, త్రుతీయ బహుమతి మహేశ్వరి సాధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యనీ ఉపాధ్యాయలు ఫిలోమిన,శ్రీమంగలక్ష్మి,జాస్మిన్, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

అనంత శ్రీరామ్ తల్లి ఉమారాణి సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు



ప్రజాభూమి ప్రతినిధి - పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ తల్లి ఉమారాణి నామినేషన్ వేశారు. ఇటీవల రెండు రోజుల క్రితం భీమవరంలో జిల్లా జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు నేతృత్వంలో అనంత శ్రీరామ్ కుటుంబం జనసేన పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మీడియాతో అన్నంత్ శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజలకు ప్రత్యక్ష సేవలు అందించాలనే ఉద్దేశంతో జనసేనలో చేరి సర్పంచ్ పదవికి తన తల్లి నామినేషన్ వేసిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేగొండి సత్యనారాయణమూర్తి, రవిశంకర్, డేగల సత్యనారాయణ, చిన్ని నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి జైకొడుతున్న పాలకొల్లు ప్రజలు!

- ఉషారాణి ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన



ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పాలకొల్లు పట్టణంలో కూటమి అభ్యర్థుల ప్రచారం జోరందుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ కూటమి అభ్యర్థి ఆబోతుల ఉషారాణి శనివారం పట్టణంలోని 35,30, 31 వార్డుల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు బాలి పద్మావతి, ధనాని నీలవేణి,. శి డగంలక్ష్మి పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఆమె వెంట ప్రచారంలో పాల్గొన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు జీవి, ఉషారాణి కుమార్తె జాహ్నవి సైతం ప్రచారంలో పాల్గొని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ.. మంత్రి నిమ్మల రామానాయుడు పాలకొల్లు అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి అనేక అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. పట్టణంలో ఇప్పటికే జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. భవిష్యత్తులోనూ ఇదే తరహా అభివృద్ధి కొనసాగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మంత్రి నిమ్మల రామానాయుడు సహకారంతో పాలకొల్లును మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఉషారాణి ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పలుచోట్ల మహిళలు ఉషారాణికి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. 'మా ఓటు మీకే' అంటూ ఆశీర్వదించారు. అన్ని వర్గాల ప్రజలు పట్టణంలో జరిగిన అభివృద్ధిని ప్రశంసిస్తూ కూటమి అభ్యర్థులను గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆదరణ, మహిళల ఆశీర్వాదాలతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.